లలితా జ్యువెల్లరి మార్ట్ లిమిటెడ్
డబ్బులు ఎవరికీ ఊరికే రావు!
కడప • వైజాగ్ • గోపాలపట్నం • విజయవాడ • విజయనగరం • గాజువాక
రాజమహేంద్రవరం • భీమవరం • కాకినాడ • తిరుపతి • అనంతపురం
గుంటూరు • శ్రీకాకుళం • ఒంగోలు • నరసారావుపేట • చిత్తూరు • అనకాపల్లి
సూళ్లూరుపేట • గూడూరు • నెల్లూరు • కర్నూలు • అమలాపురం • తుని
హైదరాబాద్ (సోమాజిగూడ | దిల్‌సుఖ్‌నగర్ | కూకట్‌పల్లి |
చందానగర్ | సుచిత్రా సర్కిల్) • నిజామాబాద్ • వరంగల్ • మిర్యాలగూడ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తాడేపల్లిగూడెం : fb.com/vaartha

Published fromTadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda,, Srikakulam

1-2-2025 శనివారం సంపుటి: 30 సంచిక: 364 పేజీలు: 10+4 వెల: 6.50

లలితా జ్యువెల్లరి మార్ట్ లిమిటెడ్
డబ్బులు ఎవరికీ ఊరికే రావు!
కడప • వైజాగ్ • గోపాలపట్నం • విజయవాడ • విజయనగరం • గాజువాక
రాజమహేంద్రవరం • భీమవరం • కాకినాడ • తిరుపతి • అనంతపురం
గుంటూరు • శ్రీకాకుళం • ఒంగోలు • నరసారావుపేట • చిత్తూరు • అనకాపల్లి
సూళ్లూరుపేట • గూడూరు • నెల్లూరు • కర్నూలు • అమలాపురం • తుని
హైదరాబాద్ (సోమాజిగూడ | దిల్‌సుఖ్‌నగర్ | కూకట్‌పల్లి |
చందానగర్ | సుచిత్రా సర్కిల్) • నిజామాబాద్ • వరంగల్ • మిర్యాలగూడ




నానాటికి బంగారం, వజ్రం, వెండి ధరలు పెరుగుతున్న ఈ తరుణంలో..
మీ సంతోషాన్ని దృష్టిలో ఉంచుకొని నా వంతుగా చేస్తున్న సహాయం ఇది.

అన్ని బంగారు నగలపై
మార్కెట్ కంటే మా తక్కువ తరుగులో ఇంకా తగ్గింపు 1%

అన్ని వజ్రాభరణాలు
క్యారెట్‌కు రూ.5000 తగ్గింపు
1 Carat = 200 Milligrams

వెండి వస్తువులకు ప్రత్యేక తగ్గింపు.

త్వరపడండి, పరిమితకాల ఆఫర్ !



ధరలు పోల్చండి!
నగల ధరలు కంపేర్ చేసేటప్పుడు ఈ డిజైన్ అలా ఉంది.. పనితనం ఇలా ఉంది.. అని మార్కెట్‌లో తికమక పెడుతున్నారా? లలితా జ్యువెల్లరిలో మీకు నచ్చిన నగకు ఎస్టిమేట్ స్లిప్ తీసుకోండి. ఆ నగను మొబైల్‌లో ఫొటో కూడా తీసుకోండి. రెండింటిని పెట్టుకుని నాలుగైదు షోరూంలలో కంపేర్ చేయండి. ఎక్కడ ధర తక్కువగా ఉంటే.. అక్కడే కొనండి!

లలితా జ్యువెల్లరి మార్ట్ లిమిటెడ్
బంగారం • వజ్రం • వెండి
ఆంధ్రప్రదేశ్ • తెలంగాణ • తమిళనాడు • పుదుచ్చేరి • కర్ణాటక
లక్షలాది డిజైన్లు! | Customer Care: 90 99 999 916 | BIS 916 హాల్‌మార్క్
www.lalithaajewellery.com



మీ లలితా జ్యూవెల్లరిలో.. మార్కెట్ లోనే అధిక ఆదాయం అందించే
2 నగల కొనుగోలు పథకాలు
FREE & FLEXI
11 నెలల
'నగలు కొనుగోలు పథకం'!
బంగారం ధర
పెరిగినా మీకే లాభం,
తగ్గినా మీకే లాభం
100%
తరుగు లేదు
అన్ని బంగారు నగలు, అన్‌కట్ వజ్రాభరణాలు
మరియు వెండి వస్తువులకు వర్తిస్తుంది.
బంగారం ధర పెరిగినా మీకే లాభం,
తగ్గినా మీకే లాభం
వజ్రాభరణాలకు ప్రత్యేక ఆఫర్ కలదు!
చిన్న వాయిదాలు:
రూ.1000 / రూ.1500 / రూ.2000 / రూ.2500 / రూ.5000
రూ.10000 / రూ.15000 / రూ.20000 / రూ.25000
BOSS
Lalithaa
EXCHANGE UTSAV
అడ్వాన్స్ నగల బుకింగ్ స్కీమ్
ఖర్చు లేకుండా,
ముందుగా పాత నగలు ఇచ్చి,
కొత్త నగలు తీసుకోవచ్చు!
100%
తరుగు లేదు
5వ నెల ఆఖరు నుంచి, కొనే నగను బట్టి,
తరుగు (V.A.) లేకుండా నగలు కొనొచ్చు.
11 నెలల తర్వాత నగలు తీసుకొంటే ఏ బంగారు నగ అయినా కానీ,
తరుగు ఛార్జీలు ఇవ్వాల్సిన పనిలేదు.
కేవలం అరశాతం (0.5%) మీ పాత బంగారు నగలను మెల్టింగ్,
ప్యూరిఫికేషన్ చేసేందుకు పట్టుకుంటాం.
పాత నగలతో మాత్రమే కాదు,
నగదు చెల్లించి కూడా ఈ స్కీమ్‌లో చేరొచ్చు!
అన్ని బంగారు నగలపై
మార్కెట్ కంటే మా తక్కువ తరుగులో ఇంకా
1% తగ్గింపు
వజ్రాభరణాలు
క్యారెట్‌కు రూ. 5000 తగ్గింపు
1 Carat = 200 Milligrams
ఇతర షోరూం మాదిరిగా తరగు మరియు మజూరి వంటి రెండు ఛార్జీలు వేయడం లేదు.
V.A. మాత్రమే.. అది కూడా మార్కెట్‌లో కంటే తక్కువ!
నాణ్యత సర్టిఫికెట్ | కలర్ & క్లారిటి | ఎక్స్ఛేంజ్ పాలసి
వెండి వస్తువులకు
ప్రత్యేక తగ్గింపు.
Lalithaa
www.lalithaajewellery.com
లలితా జ్యూవెల్లరి మార్ట్ లిమిటెడ్
Customer Care
90 99 999 916
BIS 916 హాల్‌మార్క్
లక్షలాది డిజైన్లు!
విజయవాడ: పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్. ఫోన్: 0866-2481133. వైజాగ్: ఆర్‌టీసీ బస్టాండ్, ద్వారకా నగర్. ఫోన్: 0891-6600001. గోపాలపట్నం: బాజి జంక్షన్, విశాఖపట్నం. ఫోన్: 0891-2515550.
విజయనగరం: ఎం.జి.రోడ్, జగన్నాథస్వామి ఆలయం సమీపంలో. ఫోన్: 0892-256123. అనకాపల్లి: ట్రంక్ రోడ్. ఫోన్: 0892-4226678 / 79. గాజువాక: మెయిన్‌రోడ్, విశాఖపట్నం. ఫోన్: 0891-2534789 / 0891-2553456.
శ్రీకాకుళం: గొల్లవారి వీధి, G.T. రోడ్ నార్తన్ రో చౌక్ వార్డ్. ఫోన్: 08942-227799. కాకినాడ: బాలాజీ చెరువు సమీపం. ఫోన్: 0884-2373777. భీమవరం: సండే మార్కెట్. ఫోన్: 08816-221799.
అమలాపురం: ఏజీ రోడ్, సినిమా రోడ్. ఫోన్: 08856-297304. రాజమహేంద్రవరం: కంబాల చెరువు, దేవిచౌక్ సమీపంలో. ఫోన్: 0883-2020300. గుంటూరు: లక్ష్మీపురం, మెయిన్ రోడ్. ఫోన్: 0863-2332123.
ఒంగోలు: కర్నూల్ రోడ్, ప్రకాశం జిల్లా ఫోన్: 08592-224404 / 05 /06. నరసారావుపేట: రైల్వేస్టేషన్ రోడ్, గుంటూరు జిల్లా. ఫోన్: 08647-221123. అనంతపురం: సప్తగిరి సర్కిల్, అనంతపురం టౌన్. ఫోన్: 08554-220346 / 47.
కర్నూలు: మేడం కాంపౌండ్, పార్కు రోడ్, జెడ్.పి. మెయిన్ రోడ్. ఫోన్: 08518-224474. కడప: కడప కేఫ్, కోటిరెడ్డి సర్కిల్, రైల్వే స్టేషన్ రోడ్. ఫోన్: 08562-240035 / 25. సూళ్లూరుపేట: జీఎన్‌టీ రోడ్. ఫోన్: 0862-3243244.
గూడూరు: హాస్పిటల్ రోడ్. ఫోన్: 0862-4229 599 / 699. నెల్లూరు: మినీ బైపాస్ రోడ్, మాగుంట లేఅవుట్. ఫోన్: 0861-2314233. చిత్తూరు: చామంతిపురం, వేలూరు రోడ్. ఫోన్: 08572-227799, 233799.
తిరుపతి: 481/482, V.V. మహల్‌రోడ్. ఫోన్: 0877-666 0505 / 0606 / 7888. తుని: మార్కెట్ మెయిన్‌రోడ్, వార్డు నెం.9 ఫోన్: 89259 90415 / 16.
హైదరాబాద్ (సోమాజిగూడ | దిల్‌సుఖ్‌నగర్ | కూకట్‌పల్లి | చందానగర్ | సుచిత్రా సర్కిల్) • నిజామాబాద్ • వరంగల్ • మిర్యాలగూడ • ఖమ్మం
తమిళనాడు • పుదుచ్చేరి • కర్ణాటక

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

తాడేపల్లిగూడెం : fb.com/vaartha

Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

1-2-2025 శనివారం సంపుటి: 30 సంచిక: 364 పేజీలు: 10+4 వెల: 6.50

## డిజిపిగా హరీష్ కుమార్ గుప్తా బాధ్యతల స్వీకరణ

## సంజయ్ సస్పెన్షన్‌ను పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

7లో



## 6.8% ఆర్థిక వృద్ధి అంచనా

### లోక్‌సభలో ఆర్థిక సర్వే సమర్పించిన మంత్రి నిర్మలా సీతారామన్

**న్యూఢిల్లీ, జనవరి 31:** భారత్ ఆర్థికవృద్ధి 6.3శాతంనుంచి 6.8శాతంగా ఉంటుందని, ద్రవ్యోల్బణం స్థిరంగానే నియంత్రణలో ఉంటుందని ఆర్థికసర్వేలో ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వ ప్రధాన ఆర్థికసలహాదారు అనంత నాగేశ్వరన్ ఆధ్వర్యంలోరూపొందించిన కొత్తసంవత్సర ఆర్థికసర్వే నివేదికను మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. దేశీయంగా ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉందని, నిరుద్యోగిత రేటు తగ్గుతోందని, ద్రవ్యోల్బణం స్థిరంగా ఉంటూనే మరికొన్ని సంస్కరణలు ప్రవేశపెట్టాలని >>7



## ప్రపంచంలో 3వ ఆర్థిక వ్యవస్థగా మారుతున్న భారత్ : రాష్ట్రపతి ముర్ము

**న్యూఢిల్లీ,జనవరి 31:** ఎన్డీయే ప్రభుత్వం గత ప్రభుత్వాల పాలనతో పోలిస్తే మూడురెట్లు వేగంగా పనిచేస్తోందని త్వరలో ప్రపంచంలోమూడో ఆర్థికవ్యవస్థగా భారత్ మారనున్నదని రాష్ట్రపతి ద్రౌపదిముర్ము అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో గ్లోబల్ ఇన్నోవేషన్ పవర్‌హౌస్‌గా భారత్ మారిపోతోందని రాష్ట్రపతి అన్నారు. వక్ఫ్ చట్టాలకు సవరణలు, ఒకే దేశం ఒకే ఎన్నిక వంటి అంశాలపై ప్రభుత్వం కీలక నిర్ణయాలు ప్రకటించిందని అన్నారు. బడ్జెట్ సమావేశాల ప్రారంభం రోజున ఉభయసభలనుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించారు. సంస్కరణలు, పనితీరు, పరివర్తనం అన్న మూడు అంశాల ఆధారంగా మరింత పురోగతివైపు భారత్ పయనిస్తోందని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా భారత్ కొత్తపాలన నమూనాకు పర్యాయపదంగా మారాయని ఆమె అన్నారు. జి20, బ్రిక్స్ >>7

## రిజిస్ట్రేషన్ విలువలు నేటి నుంచి పెంపు

### రాష్ట్రమంతా కిటకిటలాడిన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు


**విజయవాడ, జనవరి 31 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా భూముల రిజిస్ట్రేషన్లకు సంబంధించి కొత్త మార్కెట్ విలువలు శనివారం నుంచి అమల్లోకి రాబోతున్నాయి. సీఆర్డీ పరిధిలో మినహాయించి రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద రద్దీ వాతావరణం ఉంది. రిజిస్ట్రేషన్లు అధికంగా ఉండటంతో సర్వర్‌పై ఒత్తిడి పెరిగింది. దీనివల్ల రిజిస్ట్రేషన్ల నిర్వహణకు అధిక సమయం పట్టింది. చలానాల చెల్లింపులకూ నిరీక్షించాల్సి వచ్చింది. దీంతో క్రయ, విక్రయదారులు అవస్థలు పడ్డారు. సాయంత్రం నుంచి క్రమంగా సర్వర్‌పై ఒత్తిడి తగ్గడంతో రిజిస్ట్రేషన్లు ఊపందుకున్నాయి. కొన్ని కార్యాలయాల్లో రాత్రి పొద్దుపోయే వరకు రిజిస్ట్రేషన్లు కొనసాగాయి. నివాస భవనాల విభాగంలో అపార్టుమెంట్ ఫ్లాట్‌కు రూ.1490, రూ.1270, రూ.900 చొప్పున ఖరారు చేశారు. ఇదేవిధంగా మూడో అంతస్తు ఆపైన వాటికి అదనంగా రూ.30, రూ.25, రూ.20గా నిర్ణయించారు. వాణిజ్యభవనాల విభాగంలో గ్రౌండ్ ఫ్లోర్‌కు రూ.1800, రూ.1540, రూ.1060 చొప్పున నిర్ణయించారు. మొదటి అంతస్తుకు రూ.1700, రూ.1480, రూ.1010, రెండో అంతస్తు, ఆ పైన ప్రతి ఫ్లోర్‌కు రూ.1590, రూ.1380, రూ.950 చొప్పున చెల్లించాలి. సినిమా హాళ్లు కర్మాగారాలకు చదరపు అడుగుకు రూ.950, రూ.880, రూ.690 చొప్పున ఖరారు చేశారు. పెంకుటిల్లు రేకులషెడ్లు, ఇతర వాటికి రూ.740, రూ.590,రూ.420 చవిటి మిద్దెలకు రూ.420, రూ.320, రూ.240 చొప్పున ఖరారు చేశారు. వీటితోపాటు మరికొన్ని నిర్మాణాలు విలువలు కూడా పెరిగాయి. భూముల రిజిస్ట్రేషన్ల కోసం ఆయా ప్రాంతాల అభివృద్ధి ప్రతిపాదికన 10% నుంచి 20% వరకు ఇవి పెరిగాయి. కొన్నిచోట్ల పెంపు కాస్త ఎక్కువగానే ఉంది. కొత్త మార్కెట్ విలువల అమలుకు ఏర్పాట్లు చేసుకోవాలని ప్రభుత్వం రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖను ఆదేశించింది. భూములతోపాటు నిర్మాణాల విలువలపెంపు కూడా ఫిబ్రవరి 1నుంచే అమల్లోకి రానుంది. ఇందుకు సంబంధించిన వివరాలనూ రిజిస్ట్రేషన్లశాఖ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలకు పంపింది. ప్రస్తుతం అమల్లో ఉన్న నిర్మాణాల >>7

# గాడిన పడుతున్న రాష్ట్రం

### ప్రతి ఎన్నిక ఫలితం సుస్థిరపాలనపై నమ్మకం కలిగించేలా ఉండాలి

### ఎప్పుడు ఎన్నికలొచ్చినా గెలుపు ప్రణాళికలు పకడ్బందీగా రూపొందించాలి

### గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై సిఎం చంద్రబాబు దిశానిర్దేశం



**విజయవాడ.జనవరి31,ప్రభాతవార్తప్రతినిధి:** ఏ ఎన్నిక వచ్చినా గెలిచినప్పుడే ప్రజలల్లో మనం ఎంత విశ్వసనీయత ఉందో స్పష్టమవుతుందని ఏపీ సీఎం చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో సుస్థిర పాలనపై నమ్మకానికి గుర్తుగా ఉంటుందన్నారు. ఎన్డీయే కూటమి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై నేతలకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఉభయ గోదావరి జిల్లాలు, ఉమ్మడి కృష్ణా , గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పేరాబత్తుల రాజశేఖర్,ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను కూటమి అభ్యర్థులుగా బలపరిచామన్నారు. ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ వస్తుందన్నారు. అదే నెల 27న ఎన్నికలు, మార్చి 3న ఓట్లు లెక్కింపు జరుగుతాయని తెలిపారు. ప్రతి గ్యాడ్యుయేట్‌ను కలిసి భారీ మెజారిటీ సాధించాలన్నారు.. చదువుకున్న వాళ్లంతా కూటమితోనే ఉన్నారని చెప్పారు. ఎవరూ ఓవర్ కాన్ఫిడెన్స్‌లో ఉండొద్దని నేతలకు సూచించారు.అతి విశ్వసనీయత వలన మన నుంచి ప్రజలు ఏం కోరుకుంటున్నారో గుర్తించలేమన్నారు. ఎన్డీయే పక్షాలతో సమన్వయ సమావేశాలు పెట్టుకుని పని చేయాలని వెల్లడించారు. క్లస్టర్, యూనిట్, బూత్, ఇంచార్జ్‌లతోపాటు, జనసేన, బీజేపీ కమిటీల నేతలతో ముందుకెళ్లాలని నిర్దేశించారు. ఈ ఎన్నికలు ఏక పక్షంగా జరగాలన్నారు.ప్రజల్లో మన పట్ల మరింత ఆదరణ పెరుగుతుందని చెప్పారు. మొదటిసారి గెలిచిన ఎమ్మెల్యేలు, కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన నేతలు మరింత చిత్తశుద్ధితో పని చేయాలని తెలిపారు. కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన 7నెలల్లో ఇబ్బందులు అధిగమించి సుపరిపాలన వైపు అడుగులు వేస్తున్నామని, ప్రజలకు ఇబ్బంది లేని పాలన సాగిస్తున్నామని పేర్కొన్నారు. రాత్రికి రాత్రి అన్నీ జరిగిపోతాయని మనం చెప్పడం లేదని గాడి తప్పిన వ్యవస్థలను సరిదిద్దుతున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ సాయంతో విశాఖ స్టీల్ ప్లాంట్, రాజధాని అమరావతికి ఆర్థిక సాయం, పోలవరానికి నిధులు, రైల్వే జోన్‌తో పాటు ఇతర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. జాబ్ ఫస్ట్ విధానంతో నూతన ఇండస్ట్రియల్ పాలసీలు తీసుకొచ్చామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక దాదాపు రూ.7 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకొచ్చామని.. ఈ పెట్టుబడుల ద్వారా 4,10,125 ఉద్యోగాలు యువతకు వస్తాయని అన్నారు. త్వరలోనే 16,347 టీచర్ పోస్టులకు డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తున్నామన్నారు.

ఇవన్నీ ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ఉందన్నారు. మూడు పార్టీల నేతలు సార్వత్రిక ఎన్నికలకు ముందు సమన్వయంతో పని చేసినట్లుగానే ఇప్పుడూ అదేవిధంగా పని చేయాలని సూచనలు చేశారు. జరిగే ప్రతి ఎన్నికల్లో గెలిచేందుకు ప్రణాళిక రూపొందించుకోవాలని సీఎం చంద్రబాబు అన్నారు. కూటమికి యూటీఎఫ్ మినహా >>7

## 'ఆప్'కు ఏడుగురు ఎమ్మెల్యేలు గుడ్‌బై

### తాజా ఎన్నికలకు పార్టీ టిక్కెట్లు రాకపోవడమే కారణం

### 5న ఢిల్లీ పోలింగ్

**న్యూఢిల్లీ, జనవరి 31:** అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆమ్ ఆద్మీపార్టీకి భారీ షాక్ తగిలింది. ఒకేసారి ఏడుగురు ఎమ్మెల్యేలు శుక్రవారం రాజీనామాచేసారు. అరవింద్ కేజ్రివాల్‌తోపాటు పార్టీపైనా తమకు నమ్మకం పోయిందని వారంతా తమతమ రాజీనామా లేఖల్లో ప్రకటించారు. పార్టీలో ప్రాథమిక సభ్యత్వాలకు రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్యేలు భావనాగౌర్, మదన్‌లాల్‌లు కేజ్రీవాల్ పైనా, పార్టీపైనా తమకు నమ్మకం లేదని అన్నారు. ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రివాల్‌కు వేరువేరుగా లేఖలు పంపించారు. మీపట్ల పార్టీపట్ల విశ్వాసం లేదని అందువల్లనే ఈనిర్ణయం తీసుకున్నా దయచేసి నా రాజీ నామాను ఆమోదించాలని భావనాగౌర్ తన లేఖలో వివరించారు. ఎమ్మెల్యేలు మెహ్రౌలి నుంచి నరేష్ యాదవ్, త్రిలోక్‌పురి రోహిత్ కుమార్, జనక్‌పురి రాజేష్ >>7

## నేడు ఢిల్లీ ఎన్నికల ప్రచారానికి సిఎం

**విజయవాడ,జనవరి31,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఫిబ్రవరి1న ఢిల్లీకి వెళ్లనున్నారు. ఫిబ్రవరి 5న ఢిల్లీ అసెంబ్లీకి సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి పక్షాన ఆయన ప్రచారం చేయనున్నారు. ఎన్డీయే పొత్తులో భాగంగా బీజేపీ తరఫున ప్రచారం చేయాలని టీడీపీ నిర్ణయించింది. ఈ మేరకు ఢిల్లీకి చంద్రబాబు రేపు వెళ్లనున్నారు. బీజేపీకి మద్దతుగా తెలుగువారున్న ప్రాంతాల్లో ఆయన ప్రచారం చేయనున్నారు. దీనికి సంబంధించి శుక్రవారం ఢిల్లీలో ఆంధ్ర అసోసియేషన్‌తో టీడీపీ ఎంపీలు సమావేశం అయ్యారు. ఇక ఆదివారం రోజు ఎంపీలతో కలిసి బీజేపీ తరఫున చంద్రబాబు ప్రచారం చేయనున్నారు.?ఉభయ గోదావరి జిల్లాలు, ఉమ్మడి కృష్ణా గుంటూరు జిల్లాల నేతలతో నేడు ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్యాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పేరాబత్తుల రాజశేఖర్, ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను కూటమి అభ్యర్థులుగా బలపరిచామని తెలిపారు. ఫిబ్రవరి 27న జరిగే ఎన్నికల్లో వారిని భారీ మెజార్టీతో గెలిపించేలా చూడాలని ఆదేశించారు.

## గత ప్రభుత్వ వైఫల్యాలు విస్తృతంగా ప్రజల్లోకి



శుక్రవారం టిడిపి పొలిబ్యూరో సమావేశంలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

### వైఎస్సార్సీ హయాంలో తప్పులు చేసిన వారిని శిక్షించేందుకు ప్రత్యేక ట్రిబ్యునల్

### టిడిపి పొలిట్‌బ్యూరో సమావేశంలో పలుకీలక నిర్ణయాలు

### లోకేష్‌కు డి.సిఎంపైనా ప్రస్తావన

### 3విడతల్లో అన్నదాత సుఖీభవ చెల్లింపు

**విజయవాడ,జనవరి31,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను, గత ప్రభుత్వ వైఫల్యాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకుని వెళ్ళాలని ఏపీ చంద్రబాబు అన్నారు.పార్టీని పటిష్టం చేసేందుకు ప్రతి క్రియాశీలక కార్యకర్త ఇచ్చే సలహాను పరిగణనలోకి తీసుకుంటామన్నారు.ఏపీ సీఎం చంద్రబాబు అధ్యక్షతన టీడీపీ పొలిట్ బ్యూరో సమావేశం శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగింది. వైఎస్సార్సీపీ హయాంలో స్థానిక సంస్థల్లో తగ్గిన బీసీ కోటా రిజర్వేషన్ పునరుద్ధరించేలా చట్టపరమైన అంశాలు పరిశీలించాలని నేతలకు సూచించారు. చంద్రబాబు అధ్యక్షతన జరిగిన పొలిట్ బ్యూరో సమావేశంలో చర్చించారు. నాలుగున్నర గంటల పాటు ఈ సమా వేశం జరిగింది.వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో జరిగిన పొరపాట్లను సరిదిద్దాలని నిర్ణయించారు. తెలుగుదేశం పార్టీ పరంగా అత్యున్నత నిర్ణాయక వేదిక పొలిట్ బ్యూరో ఉంది,ప్రస్తుతం పొలిట్ బ్యూరోలో పలువురు సీనియర్ నేతలు ఉన్నారు. వారంతా కేబినేట్‌లో మాదిరిగానే పొలిట్ బ్యూరోలో కూడా సీనియర్లు, జూనియర్లకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.వారు ఈ అంశంలో కొంత చర్చ జరగాలన్నారు. అప్పుడే బ్యాలెన్స్ కుదురుతుందని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ భావిస్తున్నారు.అదే విషయాన్ని ఆయన సమావేశంలో ప్రస్తావించారు.అందుకే ప్రస్తుతం పొలిట్ బ్యూరోలో రాజకీయంగా క్రియశీలంగా నలుగురైదుగురి స్థానే నూతన ఆలోచన విధానంతో ఉన్నవారికి అవకాశం కల్పించాలని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నారా లోకేశ్ నూతన ప్రతిపాదనలు చేసారు. పొలిట్‌బ్యూరో సహా ఇతర సంస్థాగత వ్యవస్థలో కీలక బాధ్యతలను మూడు పర్యాయాల పనిచేసిన వారికి >>7

## టీచర్ల బదలీల్లో పారదర్శకత కోసం ట్రాన్స్‌ఫర్ యాక్ట్

### విద్యామంత్రి లోకేష్



**విజయవాడ,జనవరి31,ప్రభాతవార్తప్రతినిధి:** ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం విషయంలో ప్రభుత్వం ఎప్పటికప్పుడు స్థిర కార్చచరణ తీసుకుంటుందని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయంలోనూ టీచర్ల అభిప్రాయ సేకరణ ఉంటోందన్నారు. పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో మంత్రి నారా లోకేశ్ మీడియాతో ఇష్టాగోష్టిలో పాల్గొన్నారు.విద్యాశాఖ కమిషనర్ ప్రతి శుక్రవారం టీచర్ల సమస్యలు వింటున్నారని వివరించారు. ఆ దిశలో చర్యలు తీసుకున్నామన్నారు.టీచర్ల బదిలీ పారదర్శకంగా ఉండేందుకు ట్రాన్స్‌ఫర్ యాక్ట్ తీసుకొస్తున్నట్లు తెలిపారు. విద్యా వ్యవస్థ అంటే అనాలోచిత నిర్ణయాలు తీసుకునే వ్యవస్థ కాదని నిరూపిస్తున్నామని తేల్చి చెప్పారు. అందులో భాగస్వామ్యులైన వారందరితో చర్చించాకే నిర్ణయం తీసుకుంటూ ప్రజాస్వామ్య విలువలు చాటుతున్నామన్నారు. రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియగానే డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామని మార్చిలో ప్రక్రియ ప్రారంభించి విద్యాసంవత్సరం ప్రారంభంలోనే టీచర్ల భర్తీ పూర్తి చేస్తామన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ, నవ్యాంధ్రలోనూ 80శాతానికిపైగా టీచర్ల నియా >>7

### లిక్కర్ స్కాం నిందితుడు

## వాసుదేవరెడ్డి డిప్యుటేషన్ పొడిగింపు

### ప్రభుత్వం ఆదేశాలు

**విజయవాడ,జనవరి31,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణంలో కీలక నిందితుడు, ఐఆర్‌టీఎస్ అధికారి డి.వాసుదేవరెడ్డి డిప్యుటేషన్ పొడిగిస్తూ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. రాష్ట్రంలో ఆయన డిప్యుటేషన్‌ను మరో ఆరు నెలల పాటు పొడిగిస్తున్నట్టుగా రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. మద్యంకేసు విచారణ జరుగుతున్నందున ఆయన్ని రాష్ట్రం నుంచి రిలీవ్ చేయకుండా, డిప్యుటేషన్‌పై కొనసాగిస్తున్నారు. మద్యం సీసాలపై ముద్రించే సెక్యూరిటీ హాలోగ్రామ్‌ల తయారీ, సరఫరా విషయంలో వాసుదేవరెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని చెన్నైకి చెందిన సీనియర్ పాత్రికేయుడు వి.శివరామన్ గతేడాది నవంబరు 23వ తేదీన ఫిర్యాదు చేశారు. తద్వారా కుంభత్ హాలోగ్రాఫిక్స్ సంస్థ, హోలిస్టిక్ ఇండియా, అల్ఫాలేజర్ టెక్ సంస్థలను టెండర్ ప్రక్రియలో పాల్గొనేందుకు నాటి ఏపీఎస్‌బీసీఎల్ ఎండీ వాసుదేవరెడ్డి అవకాశమిచ్చారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. వి.శివరామన్ ఫిర్యాదు ఆధారంగా సీఐడీ కేసు నమోదు చేసింది. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం వాసుదేవరెడ్డి ఇప్పటికే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.ఐఆర్ టీఎస్ అధికారిగా ఉన్న డి.వాసుదేవరెడ్డిపై జరుగుతున్న విచారణ దృష్ట్యా డిప్యుటేషన్‌పై ఏపీలోకొనసాగించేందుకు అనుమతిస్తూ రైల్వేశాఖ ఏపీ ప్రభుత్వానికి >>7

## ప్రజాస్వామ్యానికి బిజెపి తూట్లు

### మార్చి 23 నుంచి దేశవ్యాప్త ఉద్యమం: సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా



శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డి.రాజా

**విశాఖపట్నం, జనవరి 31, ప్రభాతవార్త :** కేంద్రంలో ప్రజావ్యతిరేక పాలన సాగుతోందని, ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తోందని మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెడుతున్న బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాలని దీనికోసం వామపక్ష, లౌకికపార్టీలతో కలిసి పనిచేస్తాయని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా వెల్లడించారు. విశాఖలో గురు, శుక్రవారాల్లో జరిగిన పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశాల అనంతరం శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రజా వ్యతిరేక పాలనపై భగత్ సింగ్ వర్ధంతి మార్చి 23వ తేదీ నుంచి అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14 వరకు దేశవ్యాప్తంగా రాజకీయ ప్రచార ఉద్యమాన్ని నిర్వహిస్తామని తెలియజేశారు. దేశంలో ప్రజల మధ్య ఐక్యత, శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలంటే బిజెపిని అధికారం నుంచి దించాలని అన్నారు. సిపిఐ శతజయంతి ఉత్సవాల సందర్భంగా విజయవాడలో డిసెంబర్ 24, 25 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తామని, దీనికి ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో ఉన్న కమ్యూనిస్టు పార్టీల ప్రతినిధులను ఆహ్వానిస్తామని తెలిపారు. డిసెంబర్ 25న శతవార్షికోత్సవాల ముగింపు సభను ఖమ్మంలో నిర్వహించనున్నట్టు చెప్పారు. దేశంలో ప్రస్తుతం సంక్లిష్ట పరిస్థితులు నెలకొన్నాయని, ఆర్థిక పరిస్థితి అధ్వానంగా ఉందని, విదేశీ అప్పు 700 బిలియన్ డాలర్లకు చేరుకుందని, రూపాయి విలువ భారీగా పడిపోతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగం పెరిగి యువతలో నిస్పృహ అలుముకుంటోందని, ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని బిజెపి చెపుతున్న వికసిత భారత్ ఎక్కడా కనిపించడం లేదని రాజా విమర్శించారు. రైతు ప్రయోజనాలకు వ్యతిరేకంగా మూడు నల్ల చట్టాలను తీసుకొచ్చిందని, కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను అనుసరిస్తోందని తెలిపారు. బిజెపి పాలనలో రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి పెనుముప్పు పొంచి ఉందని, దేశ ప్రజలు రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు. రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌పై >>7

ప్రతి కష్టంలోనూ అవకాశాన్ని చూస్తాడు ఆశావాది,
ప్రతి అవకాశంలోనూ కష్టాన్నే చూస్తాడు నిరాశావాది.

-షేక్స్పియర్

# లెక్కలు తేల్చేస్తాయి

నీతి ఆయోగ్ నివేదికల్లో తెలుగు రాష్ట్రాల్లో కాస్తంత వెనుకబడి ఉన్నట్లు ర్యాంకుల్లో తేలిపోయింది. దేశంలోని అన్ని రాష్ట్రాల నివేదికలలో ఆంధ్రప్రదేశ్ అట్టడుగు స్థాయిలో ఉండగా తెలంగాణ కాస్త బెటర్. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం ఎపి డెబిట్ సస్టెన్‌బిలిటీలో జీరో స్థాయిలోఉంది. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలోనూ వెనుకబడి ఉన్నట్లు పాలకులు, పాలితుల మధ్య చర్చ నడుస్తోంది. గత పాలన లోటుపాట్లు ఎత్తి చెప్పడంలోనూ ఆర్థిక వెనుకబాటుతనం, ఆర్థిక ఖాతాల నిర్వహణ, అభివృద్ధిలో లోటుపాట్లను దిద్దడానికి నీతిఆయోగ్, కాగ్, ఫిస్కల్ ఇండెక్స్‌లు ఎత్తి చూపుతుంటాయి. తాజాగా నీతి ఆయోగ్ నివేదికలో ఆంధ్రప్రదేశ్ 17వ స్థానానికి, తెలంగాణ 8వ స్థానంలోనూ ఉన్నాయి. 2022-23లో రాష్ట్రంలో ఆర్థిక వనరులు బాగా దెబ్బ తిన్నాయని ఈ అంకెలు చెబుతున్నాయి. అసలు మూల ధనవ్యయమేదీ కనపడడం లేదు. అంటే విద్య, వైద్యం వంటి సామాజిక అంశాలలోనూ మూలధన వ్యయమేదీ లేదు. ఐతే 2023లో అప్పులు మాత్రం 62 వేల కోట్లు. ఇదే సందర్భంలో స్టేట్ ఫిస్కల్ హెల్త్ ఇండెక్స్ నివేదికపై కూడా చర్చ జరుగుతోంది. రాష్ట్రాభివృద్ధి పేరిట 16.5 శాతం రుణాలు పెరగగా 9.8 శాతం ఆదాయం తగ్గింది. వడ్డీ మొత్తాలు 15 శాతం మేరకు పెరిగాయి. ఎక్కువ వడ్డీకి అప్పులు తీసుకురావడం, మూలధనవ్యయం అసలే లేకపోవడం, పన్నుల పెంపు వంటి కారణాల వల్లనే ఆంధ్రప్రదేశ్ అప్పుల సూచికలో కూరుకుపోయిందనే ఆరోపణలున్నాయి. నీతిఆయోగ్ నివేదికలో ఈ అంశాలపై వ్యాఖ్యానాలు రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి గత పాలన తప్పిదాలను ప్రత్యేకించి ఏకరువు పెట్టారు. నిజానికి ఈ నివేదికలు తాజా ప్రభుత్వాలకు పాలనా మార్గదర్శకత్వం చేస్తాయి. ఇలాంటి సమీక్షలతో పాలనా క్రమంలో 'చేయదగినవి, చేయకూడనివి, చేయాల్సినవ్ని దృష్టిలో ఉంచుకునేందుకు సూచికలుగా పని చేస్తాయి. 2014-19లో తెలుగుదేశం ప్రభుత్వ పాలన చేయగా, 2019-2024 వరకు రాష్ట్రంలో వైసిపి పాలనలో ఉంది. మళ్లీ తెలుగుదేశం నేతృత్వంలోని ఎన్డీఎ కూటమి పాలనా పగ్గాలు చేపట్టడంతో ముందుగతిని నిర్దేశించే అవసర మొచ్చింది. తాజాగా గతంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన 7 శ్వేత పత్రాల్లో ఉన్న అంశాలనే నీతి ఆయోగ్ ధృవీకరించినట్లయింది. దీని నేపథ్యంలోనే భవిష్యత్ ఆలోచనలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై పడింది. దేశవ్యాప్తంగా 18 పెద్ద రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులను సైతం నీతిఆయోగ్ నివేదిక విశ్లేషించింది. 2023-23 నాటికి ఉన్న ఆర్థిక పరిస్థితులను క్రోడీకరించి, కొన్ని ఆర్థిక ప్రమాణాలను ఐదు కీలకాంశాల ఆధారంగా ఈ ఆర్థిక సూచి 2025లో ర్యాంకులు కూడా కేటాయించింది. 5 ప్రధాన సూచికలు 9 మైనర్ సబ్ ఇండికేటర్‌లు ఆధారంగా నీతి ఆయోగ్ సర్వే చేసింది. వీటిలో ఉత్పాదక వ్యయం రెవెన్యూ లోటు, వడ్డీ చెల్లింపులు ప్రస్తుత రుణాలు, రుణ సామర్థ్యం, జిఎస్టీ వృద్ధి తదితర అంశాలను ప్రామాణికంగా ఈ నివేదిక రూపొందించారు. ఆర్థిక ఆరోగ్యసూచీ- 2025లో ఒడిశా 67.8 స్కొలర్‌తో మొదటి స్థానంలో కంటే ప్రప్రథమ స్థానంలో ఉంది. ఆంధ్రప్రదేశ్ 20.9 స్థానంతో అట్టడుగున ఉంది. గతంలో వెనుకబాటు తనంలో బీహార్‌ను ఒక సంకేతంగా భావిస్తారు. తాజా పరిస్థితులను బట్టి ఆంధ్రప్రదేశ్ దాని తర్వాతనే ఉండడం ఆలోచించదగిన విషయం. ఒక దానితోనొకటి పోటీపడుతూ అభివృద్ధి చెందాల్సిన తెలుగు రాష్ట్రాల అభివృద్ధి సూచీలు పెద్దగా ఆశించినట్లు లేవు. నీతి ఆయోగ్ 2022-23 ఆర్థిక ఆరోగ్య డేటా పరిశీలిస్తే ఆర్థిక సంవత్సరంలో పలు పారామీటర్‌ల ప్రకారం 17వ స్థానంలో నిలిచిందంటే బాగా వెనకబడినట్లే. ఆ ఏడాది ఆర్థిక ఆరోగ్యంలో ఒడిశా అద్భుతంగా ఉండగా, తర్వాత స్థానంలో ఛత్తీస్‌గఢ్ ఉంది. ఆంధ్రప్రదేశ్ కంటే పంజాబ్ మినహా మిగిలిన అన్ని రాష్ట్రాల ఆర్థిక, ఆరోగ్య స్థితి బావుందని నివేదికలో నీతి ఆయోగ్ పొందుపరిచింది. నీతి ఆయోగ్ నివేదికను 16వ ఆర్థికసంఘం చైర్మన్ అరవింద్ పనగడియా విడుదలచేసి పలుసూచనలు కూడా చేసారు. వాటి ఆధారంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణాకు తమ ఆర్థిక ప్రణాళికలను రూపొందించుకోవాల్సి ఉంటుంది. 2014-19లో పోల్చి చూసినప్పుడు ఆంధ్రప్రదేశ్‌కి సంబంధించి మూల ధనవ్యయం 60శాతం నుంచి గత పాలనలో 15 శాతానికి తగ్గిపోయింది. అభివృద్ధికి నిధులు కేటాయించలేనప్పుడు జరిగే అభివృద్ధి శూన్యమే. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేనప్పుడు ప్రజలమీద పన్నులు వేయడంతప్ప గత్యంతరం ఉండదు. నిన్న మొన్నటి ఎన్నికల్లో సూపర్ సిక్స్ పథకాలను ప్రకటించి వాటిని పూర్తిగా అమలులోకి తేకుండానే రాష్ట్ర ఆర్థికపరిస్థితిపై సిఎం చంద్రబాబు నాయుడు పెదవి విరవడంతో విపక్షాలు, 'సూపర్ సిక్స్ అట్టర్‌ఫ్లాప్' అని ఎద్దేవా చేసే పరిస్థితి తలెత్తింది. ఆర్థిక పరిస్థితి ఎలాఉన్నా ఆంధ్రప్రదేశ్ 2047 నాటికి అభివృద్ధి ప్రణాళికలకు రూపుదిద్దడంతో మరింత అభివృద్ధికి పునాదులు పడుతున్నాయని జనం ఆశపడుతున్నారు. ఆంధ్రప్రదేశ్ విషయంలో గత ప్రభుత్వ హయాంలో చెప్పుకోదగిన తప్పులేమీ జరగలేదంటూ తాజా అప్పుల మోతపై ఆనాటి ప్రభుత్వ అనుయాయులు విమర్శలు గుప్పిస్తూ సమర్థించుకుంటున్నారు. ఇలాంటి బేరీజులు, దిశానిర్దేశం చేసే విషయంలో నీతిఆయోగ్, కాగ్ నివేదికలు మార్గదర్శకమే అవుతాయి. ఆసరాగా చేసుకుని పాలకులు దిశా నిర్దేశం చేసుకోగలిగితే ఆంధ్ర ప్రదేశ్ అభివృద్ధిలో మూడు పువ్వులు - ఆరు కాయలుగా వర్ధిల్లుతుంది.

సమస్య చిన్నదైనా, పెద్దదైనా సకాలంలో చర్య తీసుకుంటే ఎందులోనూ అపజయం అనేది ఉండదు.



సి.సి.కాల్టన్

వాడని ఇనుము తుప్పు పడుతుంది. కదలని నీరు స్వచ్ఛతను కోల్పోతుంది. బద్ధకం మెదడును నిస్తేజం చేస్తుంది.



డావిన్సి

## ప్రజావాక్కు



### పథకాల దుర్వినియోగం సరికాదు

ఒక పథకం పది సంవత్సరాలు పూర్తి చేసుకోవడం అంటే చాలా గొప్పవిషయం. ఏదేశమైనా ఆర్థికాభివృద్ధి సాధించడానికి పరిపూర్ణ ఆరోగ్యం సమకూర్చుకోవడం ముఖ్యం. అయితే 2014ముందు 39శాతం ఉన్న స్వచ్ఛత 2014 తరవాత ప్రజా భాగస్వామ్యం పౌరుల బాధ్యతాయుత వైఖరి మూలంగానే ఇవ్వాళ 93 శాతం మంది మహిళలు డిగ్నిటీ ఆఫ్ లైఫ్‌ను ఎంజాయ్ చేస్తున్నారు. నేడు భారత దేశంలో ఈ పది సంవత్సరాలలో 11.5 కోట్ల సౌచాలయాలు నిర్మాణం చేసి ఇవ్వాళ ఓడీఫ్ నుండి ఓడీఫ్ ప్లేస్ వరకుప్రయాణంసాగుతోంది. ఈ ప్రయాణంలో సుస్థిరాభివృద్ధిలక్ష్యాలలో మూడో లక్ష్యమైన అందరికి ఆరోగ్యం, ఐదవ లక్ష్యం అయిన జెండర్ సమానత్వంను సాధించే వైపుగా ప్రయాణం చేస్తున్నది. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో ఆరోవ లక్ష్యంలో శుభ్రత కూడా చేకూరుతుంది అయితే దీనివల్లభారతఆర్థికవ్యవస్థకు 6శాతంవృద్ధి చేకూరుతుంది.

-భారత అవినాష్, జనగామ

### వలంటీర్ల పరిస్థితి ఏమిటి?

రాష్ట్రంలో గత వై.సీ.పీహయాంలో వలంటీర్ వ్యవస్థ మొదలైంది. సంక్షేమ పథకాలవిషయంలో లబ్ధిదారులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ఈ వ్యవస్థను ప్రారంభించారు. గత ప్రభుత్వం వాలంటీర్లకు నెలకు 5 వేల రూపాయలు మాత్రమేఇచ్చి బండచాకిరీ చేయించుకుంది. డిగ్రీలు, పీజీలు, బీటెక్ చేసిన యువత ప్రభుత్వ సర్వీస్ అవుతుందనే ఆశతో తక్కువ వేతనానికేపనిచేసారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం వలంటీర్లకు న్యాయం చేసేలా ప్రస్తుత ప్రభుత్వం మానవతా దృక్పథంతో తగిన చర్యలు తీసుకోవాలి.

- ఆర్. కృష్ణ, గోపంపల్లి

### ఉపాధ్యాయుల కొరత

తెలంగాణ ఆదర్శ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. విద్యార్థులకు ఒక్కవ్యాయామ ఉపాధ్యాయుడు కూడా లేదు. గంటల తరవున ఉపాధ్యాయులను వలంటీర్లుగా నియమించుకుని అరకొర జీతాలతో నెట్టుకుస్తుంది ప్రభుత్వం. ఉపాధ్యాయుల కొరత వలన విద్యార్థులలో క్రమశిక్షణ లోపిస్తుంది. ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి ఇకనైనా ఉపాధ్యాయులను నియమించాలి.

-గూరుడు ప్రశాంత్, గోధుర్, జగిత్యాల జిల్లా

### తీగల కింద చెట్లు నాటొద్దు

పచ్చదనం కోసంరోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటడం చేస్తుంటారు. రోడ్ల వెంబడి విద్యుత్తు లైను నడపబడి ఉన్నా అవేవీ పట్టించుకోకుండా మొక్కలునాటేస్తున్నారు. అవి పెరిగి పెద్దయ్యాక విద్యుత్ తీగలకు అడ్డు వస్తుండడంతో వాటి కొమ్మలు కొట్టి వేసి మోడుగా మిగిలిస్తున్నారు. మొక్కలను నాటి వాటికి నీరుపోసి, జంతువులనుండి కాపాడేందుకు ఫెన్సింగ్‌వేసి వాటిని చెట్లుగా మార్చడం చాలా వ్యయ ప్రయాసతో కూడిన పని. ఇంత చేశాక విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మొక్కలను ఎదగనీయకుండా కొమ్మలునరకడం తరచుగా చూస్తున్నాం. తద్వారా ప్రయాణికులకు నీడ, మంచిగాలి దూరమవుతున్నాయి. విద్యుత్తు తీగలకింద మొక్కలు నాటకుండా చూడాలి. విద్యుత్ తీగలు లేని వైపు మాత్రమే మొక్కలను నాటాలి.

-డి. వెంకటరెడ్డి, నెల్లూరుజిల్లా

### శబ్దకాలుష్యాన్ని నివారించాలి

శబ్ద కాలుష్యం ఆరోగ్యాన్ని, ప్రవర్తనను రెండింటినీ ప్రభావితం చేస్తుంది. అవాంఛిత ధ్వని(మోత)శారీరక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. శబ్దకాలుష్యానికి అనేక ఆరోగ్యపరిస్థితులకూ సంబంధం ఉంది. వీటిలో హృదయ సంబంధ రుగ్మతలు, రక్తపోటు, అధిక ఒత్తిడి స్థాయిలు, టిన్నిటస్, వినికిడి లోపం, నిద్రలేమి, ఇతర హానికారక, కలతపెట్టే ప్రభావాలు ఉన్నాయి. 55 డెసిబెల్స్ కు పైబడి ఉండే మోతలు మానవ ఆరోగ్యానికి హానికరం.

-సింగు. లక్ష్మీనారాయణ, భూపాలపల్లి

### ఉపాధి కల్పనే పెద్ద సవాల్

యువతకు ఉద్యోగ, ఉపాధిఅవకాశాలు కల్పించడమే దేశం ఎదుర్కొనే అతి పెద్దసవాల్ అనిఇటీవలి రాయిటర్స్ సంస్థ అధ్యయనం తెలియజేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో వినియోగం పెరగకపోవడం, ఆరు శాతం మంది పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నాలుగు శాతంమంది పేదరికాన్ని ప్రధాన సమస్యలుగా సదరు అధ్యయనం పేర్కొంది. 2023 అక్టోబర్‌నుంచి డిసెంబర్ త్రైమాసికంలో 2024 ఏళ్ల మధ్య యువతలో నిరుద్యోగం 44.49 శాతానికి పెరిగిందని,, మార్చి 2021 నాటికి దేశ వ్యాప్తంగా 9.79 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం నివేదిక తెలియజేస్తోంది. ఇందులో ఒక్కరైల్వేలోనే 2.93 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాల్సి ఉంది. ఇవికాక, వివిధ రాష్ట్రాల్లో భర్తీ చేయాల్సిన ప్రభుత్వఉద్యోగాలూ లక్షల సంఖ్యలోనే ఉన్నాయి.

-సి.హెచ్.ప్రతాప్. కోటి వీధి, శ్రీకాకుళం

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# అమలుకు నోచుకోని చట్టాలెందుకు?

**చట్టం అయితే చేశారు కానీ దాన్ని అమలు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు, యంత్రాంగాన్ని ఏర్పాటు చేయలేదు. అంతా అయోమయ పరిస్థితి. దేశవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలు పొగాకు ఉత్పత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. లక్షలాది మంది రైతులు మరెందరో కూలీలు పొగాకు సాగుపై ఆధారపడి ఉన్నారు. ఈ కుటుంబాలు వీధిపాలు కాకుండా చూడాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. ముందుగా వారికి ప్రత్యామ్నాయం చూపించాలి. అవేమీ పట్టించుకోకుండా కాగితాలపై చట్టాలు చేసి చేతులు దులుపుకుంటే ప్రయో జనం ఉండదు. పాలకులకు చిత్తశుద్ధి ఉండే జీవనోపాధి కోల్పోతున్నవారికి ప్రత్యామ్నాయం చూపి పొగాకు ఉత్పత్తు లను, అమ్మకాలను, వినియోగాన్ని భూటాన్ దేశంలో లాగా పూర్తిగా నిషేధించాలి. అప్పుడే దీనికి ఒక పరిష్కారం లభిస్తుంది. అంతేకానీ ఆచరణ సాధ్యంకానీ అమలు చేయలేని చట్టాలు చేస్తే పాలకులు నవ్వులపాలౌతారు.**

దామెర్ల సాయిబాబ

మాదక ద్రవ్యాలు? — మానవజాతిని పట్టిపీడిస్తున్న మద్యపానం, ధూమపానాలను పారద్రోలే విషయంలో ఆరాటమే కానీ, త్రికరణ శుద్ధిగా పోరాటం చేయడంలేదనే చెప్పాలి. ఈ రెండు వ్యసనాలతో మాదకద్రవ్యాలు తోడు కావడంతో దేశంలో కోట్లాది కుటుంబాలు చితికిపోతున్నాయని, లక్షలాది మంది మంచానికే పరిమితమై కృంగికృశించి మరణిస్తున్నారనే విషయం పాలకులకు తెలియంది కాదు. చట్టాలు చేస్తున్నారు. ఉపన్యాసాలు ఇస్తున్నారు. కానీ త్రికరణశుద్ధిగా వీటిని నియంత్రించేందుకు మాత్రం ప్రయత్నం చేయడం లేదు. కొందరిని కొంతకాలం మోసం చేయవచ్చు. అందరిని కొంత కాలం మోసం చేయవచ్చు. అందరిని ఎల్లకాలం మోసం చేద్దామనుకుంటే అది భ్రమే అవుతుంది. అలా ప్రజలను మోసం చేసిన వారు, వేధించిన వారు ఎందరో చక్రవర్తులు, రాజులు, మరెందరో నేతలు చరిత్రహీనులుగా కాలగర్భంలో కలిసిపోయారు. ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి ప్రజా అవసరాలను గుర్తించి ప్రజలకు ఇచ్చిన మాటను నెరవేర్చి ఆదరాభిమానాలు పొంది వారి హృదయాల్లో చోటు సంపాదించుకున్నవారు చిరస్థాయిగా మిగిలిపోతారు. మాదకద్రవ్యాల విషయంలో అటు కేంద్ర, రాష్ట్ర పాలకులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా, ఎంత మంది అధికారులను నియమిస్తున్నా నిందితులను పట్టుకొని జైళ్లల్లో పెడుతున్నా అది ఏమాత్రం ఆగడం లేదు. అంతకంతకు పెరుగుతున్నది. యేటా దేశ వ్యాప్తంగా వేలాది కోట్ల రూపాయల మత్తుపదార్థాలు పట్టుబడుతూనే ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో కూడా ఏమాత్రం తక్కువ లేదు. ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు, గౌరప్రదమైన ఉద్యోగాలు చేస్తున్న కొందర సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఈ మత్తుకు అలవాటు పడడమే కాదు అందులో కొందరు ఆ వ్యాపారంలో భాగస్వాములవుతున్నారు. తాజాగా బెంగుళూరులో ఒక ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ శని, ఆదివారాల్లో అక్కడ నుండి హైదరాబాద్‌కు మత్తు మందులు తెచ్చి అమ్ముకుంటున్న విషయం నిన్న సోమవారం బయటపడింది. ఆయనే కాదు ఎందరో యువకులు ఈ మత్తు వ్యాపారంలో మునిగితేలుతున్నారు. మద్యం విషయంలో పాలకులు పైకి ఏమి చెప్పున్నా ఆదాయం కోసం ప్రోత్సహిస్తున్నారనేది కాదనలేని వాస్తవం. గతంలో దశలవారీగా తగ్గిస్తామని చెప్పుకున్న పెద్దలే అంచెలంచెలుగా పెంచుతున్నారు. ఒకనాడు కేవలం వందకోట్ల ఆదాయంతో ప్రారంభమైన మద్యం వ్యాపారం నేడు రెండు రాష్ట్రాల్లో కలిసి యాభై, అరవైవేల కోట్లకుపైగా చేరుకుంటున్నది. ఈ యేడాది తెలంగాణ ప్రభుత్వం ప్రస్తుతం వస్తున్న ఇరవైఐదు వేల కోట్లకు అదనంగా ఐదువేల కోట్ల రూపాయలకుపైగా ఆదాయాన్ని పెంచుకోనున్నట్లు మొన్నటి బడ్జెట్ అంచనాలు స్పష్టం చేస్తున్నాయి. కొన్ని రాష్ట్రాలకు మద్యం ఆదాయమే మహాప్రసాదంగా పరిణమించింది. ఇక మద్యం సరే. సారాను నిషేధించారు. కానీ ఏ మాత్రం అమలవుతున్నది? మంచినీరు దొరకని గ్రామాలు ఎన్నో ఉండొచ్చు. కానీ సారా దొరకని గ్రామం లేదు. గుడంబ, నాటుసారా ఒక కుటీర పరిశ్రమగా రూపుదిద్దుకున్నది. ఈ అక్రమ సారాను నియంత్రించేందుకు పాలకులే చీప్ లిక్కర్‌ను ప్రవేశపెట్టారు. ప్రజారోగ్యానికి అత్యంత హానిచేస్తున్నది ఈ చీప్‌లిక్కరే. ముఖ్యంగా పేదల జీవితాలు ఈ చీప్‌లిక్కర్‌తో చితికిపోతున్నాయి. లక్షలాది కుటుంబాలు వీధినపడుతున్నాయి. మద్య నిషేధం గురించి ఒకసారి గతంలోకి వెళ్లితే మద్యానికి బానిసై అనారోగ్యంపాలై కుటుంబాలకు కుటుంబాలే బజారున పడుతుండడంతో ఆనాడే ఆవేదన చెందిన మహాత్ముడు స్వతంత్ర భారతావని నుంచి మద్యాన్ని తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. మహాత్మాగాంధీ కలలకు అనుగుణంగానే

ఒక్క మాట

స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత 1947 అక్టోబరు ఒకటో తేదీ నుంచి అప్పటి మద్రాసు ప్రభుత్వం మద్యాన్ని నిషేధించింది. అందులోభాగంగానే ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో మద్యనిషేధాన్ని విజయవంతంగా అమలుచేశారు. మద్యపానం వల్ల జరిగే కష్టనష్టాలను ప్రజలకు వివరించడంలో, మరొక పక్క అక్రమ మద్యాన్ని తయారుచేసే వారిపై ఉక్కు పాదం మోపడంలో ఆనాటి పాలకులు ఎంతో సమర్థవంతంగా వ్యవహరించారు. 1960 ప్రాంతంలో రాజకీయ జోక్యం పెరగడంతో మద్యనిషేధం అమలు చేయడం కష్టతరంగా మారింది. సారా తయారీదారులు కొందరు రాజకీయ నాయకుల అండదండలతో నిషేధానికి తూట్లు పొడవడం ప్రారంభించారు. మద్యనిషేధంవల్ల రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయల ఆదాయం కోల్పోతుందనే వాదనను లేవనెత్తి దశలవారీగా మద్యం వ్యాపారాన్ని విస్తరించారు. మధ్యలో ఒకటి, రెండు సందర్భాల్లో సంపూర్ణ మద్యనిషేధానికి శ్రీకారం చుట్టినా అది ఎక్కువ రోజులు నిలవలేదు. మద్యపానాన్ని ఆదాయం దృష్ట్యా నియంత్రించ లేకపోతున్నారనేది అందరికి తెలిసిందే. ధూమపానాన్ని నియంత్రించే విషయంలో కూడా పాలకులు విఫలమవుతున్నారేమోననిపిస్తున్నది. ఊపిరితిత్తుల కేన్సర్, గుండె జబ్బులు, మరెన్నో రోగాలకు ధూమపానం కేంద్ర బిందు వని ఎందరో వైద్యనిపుణుల అధ్యయనంలో వెల్లడైంది. ప్రపంచవ్యాప్తంగా 130కోట్ల మందికిపైగా ధూమపానంలో మునిగితేలుతున్నారు. భారత దేశానికి సంబంధించి ఇరవై కోట్ల మందికిపైగా పొగాకు ఉత్పత్తులకు అలవాటు పడ్డారు. ఇందులో బీడీలు తాగేవారే అధికంగా ఉన్నారు. బీడీలు, సిగరెట్లు తాగడం సరదాగా ఆరంభమై ఆతర్వాత అలవాటుగా మారుతున్నది. కేవలం ధూమపానం వల్లనే దేశ వ్యాప్తంగా కోట్లాదిమంది అనేక రోగాలబారిన పడుతుంటే లక్షలాది మంది అసువులు బాస్తున్నారు. సిగరెట్ పొగలో నాలుగువేల ఎనిమిది వందలకు పైగా ప్రమాదకర విష వాయువులు ఉన్నాయని, ఇవి అనేక రోగాలకు కారణాలవుతున్నాయని వైద్యనిపుణులు చెబుతున్నారు. బీడీ పరిశ్రమ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కోట్లాది మందికి బతుకుతెరువు ఇస్తున్నదనేది కాదనలేని వాస్తవం. అడవుల్లో ఉన్న లక్షలాది మంది గిరిజన కుటుంబాలకు బీడీ ఆకుల సేకరణ ప్రధాన ఆదాయ వనరుల్లో ఒకటి. కొన్ని శతాబ్దాలుగా అదొక కుటీర పరిశ్రమగా వర్ధిల్లుతున్నది. ఈ వాస్తవాలను పట్టించుకోకుండా బీడీ వినియోగాన్ని తగ్గించేందుకు ప్రయత్నం చేయడం వివేకం అనిపించుకోదు. కానీ పాలకపెద్దలు ఈవిషయాన్ని దృష్టిలోఉంచుకోకుండా పొగాకు ఉత్పత్తులను నిషేధించేందుకు ప్రయత్నాలకు దాదాపు మూడు దశాబ్దాలక్రితంనుంచే శ్రీకారంచుట్టారు. దీంతో బీడీ కార్మికులు, కాంట్రాక్టర్లు, అందరూ ఏకమై ఎదురుతిరగడం, ఒత్తిడిలు తోడుకావడంతో విరమించుకోవాల్సి వచ్చింది. మళ్లీ బహిరంగ ప్రదేశాల్లో ధూమపానాన్ని నిషేధించారు. పొగాకు పండించే రైతులను ప్రత్యామ్నాయ పంటలవైపు మళ్లించేందుకు రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కిందచర్యలు చేపడుతున్నట్లు ప్రకటిస్తున్నారు. మరొకపక్క పొగాకు ఎగుమతులు పెరుగుతున్నట్టు కేంద్రం చెప్పుకుంటున్నది. గతయేడాది దాదాపు పన్నెండు వేల కోట్ల రూపాయలకు పైగా పొగాకు ద్వారా ఆదాయం వచ్చినట్లు చెప్పుకుంటున్నారు. కామన్‌వెల్త్ దేశాలన్నింటిలో నూ భారత్‌లోనే పొగాకు ఉత్పత్తి అధికంగా అవుతున్నది. అలాగే కేన్సర్ వ్యాధికి మూలకారణాల్లో పొగాకు ఒకటి. నోటి, ఊపిరితిత్తులు రకరకాల కేన్సర్లు భారత్‌లో ఆందోళనకర స్థాయిలో విస్తరిస్తున్నట్లు అధ్యయనాలే వెల్లడిస్తున్నాయి. యేటా దాదాపు ఇండియాలో పద్నాలుగున్నర లక్షల మందికిపైగా పొగాకుతో ప్రాణాలు కోల్పోతున్నట్టు అధికారలెక్కలే వెల్లడిస్తున్నాయి. ఈయేడాది అది పదిహేడు లక్షల దెబ్బైవేలకు చేరవచ్చునని అంచనాలు వెలువడుతున్నాయి. పొగాకు పదమూడేళ్ల ప్రాయం నుండే ప్రారంభించి ఇరవైయేళ్లు వచ్చేసరికి దానికి బానిసలుగా మారిపోతున్నారు. చట్టం అయితే చేశారు కానీ దాన్ని అమలు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు, యంత్రాంగాన్ని ఏర్పాటు చేయలేదు. అంతా అయోమయం, గందరగోళం. ఇంకొకపక్క దేశవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలు పొగాకు ఉత్పత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. లక్షలాది మంది రైతులు మరెందరో కూలీలు పొగాకు సాగుపైఆధారపడిఉన్నారు. ఈ కుటుంబాలు వీధిపాలుకాకుండా చూడాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. ముందుగా వారికి ప్రత్యామ్నాయం చూపించాలి. అవేమీ పట్టించుకోకుండా కాగితాలపై చట్టాలు చేసి చేతులు దులుపుకుంటే ప్రయోజనం ఉండదు. ప్రజారోగ్యాన్ని కాటేస్తున్న ఈ ధూమపానానికి కచ్చితంగా ఫుల్‌స్టాప్ పెట్టించాల్సిందే. అందులో మరో అభిప్రాయానికి తావులేదు. అలాగే జీవనోపాధి కోల్పోతున్నవారికి ప్రత్యామ్నాయం చూపి పొగాకు ఉత్పత్తులను, అమ్మకాలను, వినియోగాన్ని భూటాన్ దేశంలో లాగా పూర్తిగా నిషేధించాలి. అప్పుడే దీనికి ఒకపరిష్కారం లభిస్తుంది. అంతేకానీ ఆచరణసాధ్యం కాని అమలుచేయలేని చట్టాలుచేస్తే పాలకులు నవ్వులపాలౌతారు. ఈ మారణహోమం కొనసాగుతూనే ఉంటుంది. ●

# నిరుద్యోగుల పట్ల ఇంత నిర్లక్ష్యమా?

ఎం. చిరంజీవి

ఉద్యోగులకు పదవి విరమణ వయసు పెంచడం పట్ల నిరుద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగాలు ఇస్తానని చెప్పి గత ప్రభుత్వం మోసం చేసిందని, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ చెప్పినటువంటి మాటలు నమ్మి కాంగ్రెస్ పార్టీకి పట్టం కడితే, పెద్ద ప్రభుత్వ ఇచ్చినటువంటి ఉద్యోగాలకు నియామక పత్రాలు ఇచ్చి మేమే ఇచ్చామని చెప్పుకుంటున్నటువంటి విషయాన్ని గమనిస్తున్న నిరుద్యోగులు ప్రభుత్వంపై మండిపడుతున్నారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరమైనా కూడా ఏ డిపార్ట్మెంట్లో ఎన్ని వేకెన్సీలు ఉన్నాయనే అటువంటి విషయాన్ని కూడా ఇప్పటివరకు బహిరంగపరచలేదనేటువంటి విషయాన్ని ప్రస్తుత ప్రభుత్వం తెలపడం లేదని, ఎటువంటి నోటిఫికేషన్లు వేయడం లేదనేటువంటి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఉద్యోగం వస్తే తప్ప మా బతుకులు బాగుపడవని గమనించినటువంటి యువత ఉద్యోగం కోసం కొన్ని ఏళ్లనుండి కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. కానీ వారి ఆశ నెరవేరడం లేదు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం అత్యధిక నోటిఫికేషన్లు జారీచేసి, ఎక్కువ మంది నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని అనుకుంటున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 63 సంవత్సరాలకు పెంచడం రాష్ట్ర ప్రభుత్వానికి శ్రేయస్కరం కాదు. దీనివల్ల ప్రభుత్వానికితీరని నష్టం వాటిల్లే ప్రమాదం వుంది. ఉద్యోగ విరమణ వయసును పెంచడమంటే లక్షల మంది నిరుద్యోగుల నోట్లో మట్టి కొట్టినట్టడమే. ప్రభుత్వానికి ఎంత ఆర్థిక ఇబ్బందులున్నప్పటికీ, ఎన్ని డిమాండ్లు వచ్చినప్పటికీ ఈ ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలని నిరుద్యోగ యువత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తుంది. గత ప్రభుత్వం చేసిన తప్పును ప్రస్తుత ప్రభుత్వం చేస్తుందని అంటున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంలో నిరుద్యోగులే కీలకపాత్ర పోషించారు. జాబ్ క్యాలెండర్‌కోసం వారు వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు. నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లకుండా వెంటనే ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరుతున్నారు. నోటిఫికేషన్లు విడుదల కాకపోవడంతో ఇప్పటికే ఎంతో మంది నిరుద్యోగులు ఆత్మహత్యలకు చేసుకుంటున్నారని, ఇప్పటికైనా ఉద్యోగ నోటిఫికేషన్లు వెలువరించకపోతే రాష్ట్రంలోని నిరుద్యోగులు ఏకమై మరొక ఉద్యమానికి సిద్ధపడుతున్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 5వ వేతన సవరణ సంఘం, 58 ఏళ్ల నుంచి 60 ఏళ్లకు పెంచాలని సిఫార్సుచేసింది. కానీ, గరిష్ట వయస్సు 60ఏళ్లకు మించరాదని, వయస్సుకు మించిన సర్వీసు పొడిగింపులపై పూర్తిగా నిషేధం విధించాలని పేర్కొంది. అంతేకాదు 7వ పీఆర్సీ సైతం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును పెంచాలని ఎలాంటి సిఫార్సులు చేయలేదు. అయితే, ఏపీ, తెలంగాణ వంటి కొన్ని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచిన విషయం తెలిసిందే. దీనివల్ల నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారనే విమర్శలు ఉన్నాయి. రిటైర్మెంట్ వయసు పెంచడంతో ఉద్యోగాలసంఖ్యతగ్గిపోయి, కొత్త నోటిఫికేషన్ల రావడం ఆలస్యం అవుతుంది. వాస్తవానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రిటైర్మెంట్ వయసు 58 ఏళ్లుగా ఉండేది. కానీ, కేంద్రంతోపాటు పలు రాష్ట్రాలు 60 ఏళ్లకు, ఏపీ, తెలంగాణలోనూ 62ఏళ్లకు పెంచారు. దీనిపై తీవ్రవిమర్శలు కూడా వస్తున్నాయి. నిరుద్యోగులకు అన్యాయం చేయడమేమిటని మండిపడుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు డిఏలు, టిఏలు, పిఆర్సి వంటివి ఇవ్వనవసరం లేకుండా వయస్సు పెంచడం ద్వారా వీటన్నింటి ద్వారా లబ్ధిపొందవచ్చని ప్రభుత్వం యోచిస్తుంది. ●

# ఆర్థిక అవసరాలే ఆసరాగా అవయవమార్పిడి!

మహమ్మద్ ఆరిఫ్

హైదరాబాద్ లోని సరూర్ నగర్‌లో గల ఒక ఆస్పత్రిలో ఇటీవల 'కిడ్నీరాకెట్' వెలుగు చూడడం రాష్ట్రంలో కలకలం రేపింది. ఇంకెన్ని ఆస్పత్రుల్లో ఇలాంటి దందా నడుస్తున్నదనే అనుమానం వ్యక్తమవుతున్నది. అనుమతి లేకుండా కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలు నిర్వహించిన ఆస్పత్రిపై కఠినంగానే వ్యవహరిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఆస్పత్రిని సీజ్ చేసింది. కిడ్నీ మార్పిడి చేసుకున్న ఇద్దరు, కిడ్నీ దానం చేసిన ఇద్దరిని గాంధీకి తరలించి వైద్యం చేయిస్తున్నది. ఆర్థిక ఇబ్బందులతోనే తమిళనాడు, కర్ణాటకకు చెందిన ఇద్దరు వితంతువులు కిడ్నీ ఇచ్చేందుకు ఒప్పుకున్నట్లు అధికారులు గుర్తించారు. ఇంకా ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి ఈ వ్యవహారంపై ప్రభుత్వం విచారణ జరుపుతున్నది. మరోవైపు అవసరమైతే వైద్యుల లైసెన్సులను శాశ్వతంగా తొలగిస్తామని మెడికల్ కౌన్సిల్ ప్రకటనచేసింది. అనేకసార్లు ఇలా అవయవమార్పిడి ఘటనలు బయటపడుతున్నా.. ఈ దందాకు అడ్డుకట్ట పడడం లేదు. అయితే ఈ దందాలో పేదలే సమిధలు అవుతున్నారు. ఆర్థిక ఇబ్బందులతో డబ్బుల ఆశకు కిడ్నీలు ఇచ్చేందుకు రెడీ అవుతున్నారు. అయితే పేదల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకొని ముఠాలు ఈ దందాను కొనసాగిస్తున్నాయి. అంతేకాకుండా కిడ్నీ తీసుకున్నాక.. వారిని మోసం చేస్తున్నాయి. డబ్బులు చెల్లించకపోవడంతోనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతోనే అనేక అవయవ మార్పిడి ఘటనలు వెలుగుచూశాయి. ఇంకా వెలుగులోకి రానిఘటనలు వేలల్లోనే ఉంటాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, ఢిల్లీ ఇలా ప్రతి రాష్ట్రంలో ఇలాంటి శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి. అనేకసార్లు ముఠాలు పట్టుబడుతున్నాయి. అంతేకాకుండా కిడ్నీ మార్పిళ్ల కోసం పలువురిని విదేశాలకు పంపిన ఘటనలు సైతం వెలుగుచూశాయి. అవయవాలు అవసరమున్న వారు, దానం చేయాలనుకునే వారు ముందుగా జీవన్ దాన్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ అవసరమైనవారు ఎక్కువ, దాతలు తక్కువగా ఉంటున్నారు. అవయవాలకు డిమాండ్ పెరగడంతో డబ్బుల చూపి అక్రమ మార్గంలో వాటిని పొందేందుకు కొందరు ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో కొందరు ముఠాలుగా ఏర్పడి పేదల ఆర్థిక ఇబ్బందులను ఆసరాగా చేసుకొని వారికి డబ్బుల ఆశచూపి అవయవదానానికి ఒప్పిస్తున్నారు. అయితే కిడ్నీ వ్యాధిగ్రస్తుడు కుటుంబ సభ్యులు, లేదా సమీప బంధువుల నుంచి కిడ్నీని పొందొచ్చు. అయితే



ముఠాలు ఎలాంటి బంధుత్వం లేకున్నా వారిని బంధువులుగా చూపించేలా ఫోర్జరీ డాక్యుమెంట్లు తయారు చేసి కిడ్నీ మార్పిడీ సర్జరీలు చేయిస్తున్నాయి. గతంలో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స కోసం నకిలీ పత్రాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తుండగా విజయవాడలోని భవానీపురం తహశీల్దార్ గుర్తించి ఆ దరఖాస్తును తిరస్కరించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫేక్ డాక్యుమెంట్స్‌తో ఢిల్లీ, పంజాబ్, హర్యానా, మధ్యప్రదేశ్, గుజరాత్ లో కిడ్నీ మార్పిడి సర్జరీలు చేయిస్తున్న ముఠాను గతంలో ఢిల్లీ క్రైంబ్రాంచ్ పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే అవయవ మార్పిడిల్లో కిడ్నీ సర్జరీలే ఎక్కువగా ఉండడం గమనార్హం. సోషల్ మీడియా ద్వారానూ కొన్ని ముఠాలు అక్రమ అవయవ వ్యాపారం చేస్తున్నట్లు తెలుస్తున్నది. మానవ అవయవాలను విక్రయించేందుకు ఓ ప్రముఖ ఆస్పత్రి వెబ్‌సైట్‌ను పోలి ఉన్న ఓ నకిలీ వెబ్‌సైట్‌ను కొందరు రూపొందించినట్లు 2023లో అధికారులు గుర్తించారు. ఈ ఘటనలో ఇద్దరు ఆఫ్రికన్ పౌరులతో సహా ఐదుగురిని చెన్నై పోలీసులు బెంగళూరులో అరెస్టు చేశారు. ఊపిరితిత్తులు, కిడ్నీలు వంటి మానవ అవయవాలను మార్పిడి చేయడానికి ఈ ముఠా రూ.5 కోట్ల వరకు ధర చెబుతున్నట్లు పోలీసులు తెలిపారు. అవయవదానం పేరుతో ఫేస్‌బుక్ అడ్డాగా దందా సాగిస్తున్న గ్యాంగ్‌ను గతంలో రాచకొండ పోలీసులు అరెస్ట్‌చేశారు. అవయవ మార్పిడి కోసం దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఎదురుచూస్తున్నారు. ఇందులో కిడ్నీ మార్పిడి కోసం ఎదురుచూస్తున్న వారే సుమారు పది లక్షల వరకు ఉంటారని అంచనా. అయితే ఎవరైనా బ్రెయిన్ డెడ్ అయితే వారి బంధువుల అనుమతితో అవయవదానం చేయవచ్చు. రెండు కిడ్నీలు, రెండు కళ్లు, రెండు ఊపిరితిత్తులు, కాలేయం, గుండె ఇలా ఒక మనిషి అవయవదానం చేస్తే ఎనిమిది మందికి ప్రాణం పోయవచ్చు. దేశంలో వివిధ ప్రమాదాల్లో రెండు లక్షల నుంచి మూడు లక్షల మంది వరకు మరణిస్తున్నారు. అయితే అవయవదానంపై సరైన అవగాహన లేకపోవడంతో ప్రమాదాల్లో మరణించినవారు, బ్రెయిన్‌డెడ్ అయిన వారి కుటుంబ సభ్యులు ముందుకు రావడంలేదు. దీంతో వారి శరీరంలోని అవయవాలు ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా కిడ్నీ ఇచ్చిన వారు, అమర్చుకున్న వారు, సర్జరీ చేసిన వైద్యుడు, అవకాశమిచ్చిన ఆస్పత్రి, మధ్యవర్తులు ఇలా ప్రతి ఒక్కరూ నేరం చేసినట్టేనని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే విచారణ, నేర నిరూపణలో అధికారులు, పోలీసులు విఫలమవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. అందుకే మధ్యవర్తుల ముఠాలు పెరిగిపోతున్నట్లు తెలుస్తున్నది. ప్రభుత్వాలు పట్టుబడిన ఆస్పత్రులను సీజ్ చేసి తమ పని అయిపోయినట్టుగా భావించకుండా మధ్యవర్తులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటేనే ఈ దందాకు అడ్డుకట్ట పడే అవకాశముంటుంది. అంతేకాకుండా ఆయా సర్జరీలు చేసిన వైద్యుల లైసెన్సులను శాశ్వతంగా రద్దు చేయడమే కాకుండా నిరంతరంగా ప్రైవేటు ఆస్పత్రుల్లో తనిఖీలు చేపడితే ఇలాంటి సర్జరీలు జరగకుండా నిరోధించవచ్చు. ●

# ఒకరోజు వాహనసేవలకు సిద్ధం !



**- సీనియర్ అధికారులతో మాడవీధుల్లో పర్యవేక్షణ**
**- సమన్వయంతో మెరుగైన భద్రతా ఏర్పాట్లు**
**- అత్యవసర సమావేశంలో టిటిడి చైర్మన్ బిఆర్‌నాయుడు**

**తిరుమల,జనవరి 31ప్రభాతవార్తప్రతినిధి:** రానున్న మంగళవారం రథసప్తమి పర్వదినం సందర్భంగా ఒకేరోజు ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తి మలయప్పస్వామి ఏడువాహనాలపై ఊరేగనున్నారు. ఉదయం 5.30గంటల నుండి రాత్రి 8గంటల వరకు జరిగే ఈ వేడుకలకు 2లక్షలమందికిపైగా భక్తులు తరలివస్తారని అంచనావేసి తదనుగుణంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పటిష్ట ఏర్పాట్లపై శుక్రవారం ఉదయం తిరుమల అన్నమయ్యభవనంలో టిటిడి పాలకమండలి ఛైర్మన్ బిఆర్‌నాయుడు అధ్యక్షతన అత్యవసర సమావేశం జరిగింది. టిటిడి బోర్డుసభ్యులు, టిటిడి ఇఒ జె.శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఇఒ వీరబ్రహ్మం, ఇన్‌ఛార్జి సివిఎస్ఒ మణికంఠచందోలు,టిటిడి సిపిఆర్ఒ డాక్టర్ తలారిరవి తదితర అధికారులతో గంటన్నరకుగాపై సమీక్షించారు. అనంతరం ఛైర్మన్ నాయుడు వివరాలను మీడియాప్రతినిధులకు వెల్లడించారు. ఫిబ్రవరి 4వతేదీ రానున్న మంగళవారం సూర్యజయంతి పర్వదినం పురస్కరించుకుని మలయప్పస్వామి ఉత్సవమూర్తి ఉదయం 5.30గంటలకు తోలివాహనసేవగా సూర్యప్రభపై ఆలయమాఢవీధుల్లో ఊరేగనున్నారు. ఆ రోజు ఉదయం 6.44గంటలకు సూర్యోదయం కానున్నందున సూర్యకిరణాలు స్వామివారిపై ప్రసరిస్తాయన్నారు. అనంతరం ఉదయం 9గంటలకు చిన్నశేషవాహనం ఇలా రాత్రి 8గంటలకు చంద్రప్రభవాహన సేవలు ఉంటాయన్నారు. గత అనుభవాల దృష్ట్యా భక్తులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. మాఢవీధుల్లోని గ్యాలరీల్లో పోలీసులు, శ్రీవారిసేవకులు, ఎస్‌పిఎఫ్, ఆక్టోపస్, విజిలెన్స్ బలగాలు భద్రతాపరంగా, సేవలకు సిద్దంగా ఉంటారన్నారు. దాదాపు 3లక్షలమంది లోపు భక్తులు రావచ్చని అంచనాతో అన్ని ఏర్పాట్లు తీసుకున్నామన్నారు. ఆలయం ముందు, మాఢవీధుల్లో గ్యాలరీలు, జర్మన్‌షెడ్లను ఏర్పాటుచేశారు. ఉదయం నుండి రాత్రి వరకు నిరంతరాయంగా భక్తులకు అన్నప్రసాదాలు, తాగునీరు. టీ,కాఫీ,పాలు అందించేలా శ్రీవారిసేవకులు, టిటిడి ఉద్యోగులనునియవిస్తున్నా మన్నారు. తిరుమలలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారని, అదనపు పార్కింగ్ ప్రదేశాలకు సూచిక బోర్డులు ఏర్పాటుచేస్తున్నారు. భక్తులకు ఉదయం నుండిరాత్రి వరకు చలికి, ఎండకు ఇబ్బందులు కలగకుండా మాఢవీధుల్లో అవసరమైన చర్యలు తీసుకున్నారు. 8లక్షల లడ్డూలు అదనంగా నిల్వఉంచడం జరుగుతుందన్నారు.

**- 4న అన్ని దర్శనాలు రద్దు:** 4వతేదీ మంగళవారం అన్ని ఆర్జితసేవలు, ఇతర ప్రత్యేక దర్శనాలు, సిఫార్సు దర్శనాలు, బ్రేక్ దర్శనాలు పూర్తిగా రద్దుచేశామని ఛైర్మన్ బిఆర్‌నాయుడు తెలిపారు. ఆ రోజు ఉదయం ప్రోటోకాల్ పరిధిలోని ప్రముఖులకు మాత్రమే బ్రేక్ దర్శనం ఉంటుంది. వృద్దులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులకు ప్రత్యేక దర్శనాలు రద్దుచేశారు. తిరుమలకు అశేష సంఖ్యలో విచ్చేసే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఫిబ్రవరి 3వతేదీ నుండి 5వరకు తిరుపతిలోని కౌంటర్లలో ఆఫ్‌లైన్‌లో సర్వదర్శనం టైమ్‌స్లాట్ టోకెన్లు జారీని నిలుపుదలచేశారు. తిరుమలలో ఎల్ఇడి స్క్రీన్లు ఏర్పాటుచేసి వాహనసేవలను ప్రత్యక్షప్రసారం చేస్తామన్నారు. ఎప్పటికప్పుడు భక్తులకు సమాచారం అందించేందుకు పబ్లిక్ అడ్రసింగ్ విధానం కూడా అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు.

**- ఉదయం నుండి రాత్రి వరకు వాహనసేవలు:** 4వతేదీ ఉదయం 5.30గంటలకు తొలివాహనంగా సూర్యప్రభవాహనం మొదలై ఉదయం 8గంటల వరకు మాఢవీధుల్లో ఊరేగనుంది. ఉదయం 9గంటల నుండి 10గంటల వరకు చిన్నశేషవాహనం, ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు గరుడవాహనం, మధ్యాహ్నం 1నుండి 2గంటల వరకు హనుమంతవాహనం, మధ్యాహ్నం 2గంటల నుండి 3గంటల వరకు చక్రస్నానమహోత్సవం, సాయంత్రం 4గంటల నుండి 5గంటల వరకు కల్పవృక్షవాహనం, సాయంత్రం 6గంటల నుండి 7గంటల వరకు సర్వభూపాల వాహనం, రాత్రి 8గంటల నుండి 9గంటల వరకు చంద్రప్రభవాహనసేవ చివరగా ముగుస్తుంది.

**- పుష్కరిణిలో పటిష్ట భద్రత:** ఏడువాహనసేవల్లో భాగంగా 4వతేదీ మధ్యాహ్నం చక్రస్నానం జరుగుతుంది. పుష్కరిణిలో భక్తులు పెద్దసంఖ్యలో పవిత్ర స్నానాలాచరించే అవకాశం ఉడటంతో ఎన్‌డిఆర్ఎఫ్, గజ ఈత గాళ్ళను సిద్దంగా ఉంచడం జరుగుతుందని ఇఒ శ్యామలరావు తెలిపారు.



# డా.ప్రభావతికి సుప్రీంలో ఊరట

**డి.స్పీకర్ రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసు**

**విజయవాడ,జనవరి31,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ శాసనసభ ప్రస్తుత డిప్యూటీ స్పీకర్, ఎంపీగా ఉన్న సమయంలో రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో డాక్టర్ ప్రభావతికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. హైకోర్టు తీర్పుపై సుప్రీం ధర్మాసనం స్టే విధించింది. అయితే విచారణకు సహకరించాలని ప్రభావతిని ఆదేశించింది. ఈ కేసులో నిందితురాలిగా ఉన్న ప్రభావతికి ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు ఏపీ హైకోర్టు నిరాకరించింది. కేసు విచాణ దశలో ఉన్నందున ఆమె దాఖలు చేసిన యాంటిసిపేటరీ బెయిల్‌ను మంజూరు చేయడానికి హైకోర్టు తిరస్కరించింది. అంతకు ముందు గుంటూరు జిల్లా కోర్టుకు ఆమె ముందుస్తు బెయిల్ పిటిషన్ తోసిపుచ్చింది.ఈ నేపథ్యంలో హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో ఆమె సవాల్ చేశారు. ప్రభావతి పిటిషన్ ను జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహాతా ధర్మాసనం విచారించింది.రఘురామ ఈ కేసులో కెవియట్ పిటిషన్ దాఖలు చేసారు.ఈ కేసులో తన వాదనలు వినాలను ఆయన తన న్యాయవాది ద్వారా కోర్టును అభ్యర్థించారు.వీటిని పరిశీలించిన ధర్మాసనం ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. ఆ తర్వాత 2 వారాల్లో రిజాయిండర్ దాఖలు చేయాలని పిటిషనర్‌ను ఆదేశించింది. విచారణకు డాక్టర్ ప్రభావతి హాజరుకావాలని సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలిచ్చింది. తదుపరి ఉత్తర్వుల వరకు హైకోర్టు ఆదేశాలపై స్టే ఇచ్చిన ధర్మాసనం, 4 వారాలకు విచారణను వాయిదా వేసింది. రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో ఏ5గా ప్రభావతి ఉన్నారు.

# క్షతగాత్రులకు సాయం అందించేవారికి.. నగదు బహుమతులు

**- మంత్రి సత్యకుమార్ యాదవ్**

**తిరుపతి హెల్త్, జనవరి 31 ప్రభాతవార్త :** క్షతగాత్రులకు సాయం అందించే వారికి నగదు బహుమతులు అందజేయనున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్విమ్స్ సర్కిల్‌లో జిల్లా రవాణాశాఖాధికారి కొర్రపాటి మురళీ మోహన్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్, మోటార్ వాహనాల తనిఖీ అధికారి అతికానాజ్, రహదారి భద్రతా విభాగ వైద్యురాలు డాక్టర్ పూజవాణి ఉపాధ్యాయ గుడ్ సమారిటన్ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. రహదారి ప్రమాదాలు జరిగినపుడు క్షతగాత్రులని తక్షణమే వైద్యశాలకు తరలించే ప్రక్రియలో సహాయ పడే ఒక మంచి సమారిటన్‌ను గుర్తించి వారికి ప్రోత్సాహకంగా బహుమతి రూపంలో రూ. 5వేలు నగదులో పాటు ప్రశంసా పత్రాన్ని ఇవ్వడం జరుగుతుందని, ఈ సందర్భంగా జిల్లా వైద్య శాఖ అధికారి తెలియజేశారు. అంతే కాకుండా వారికి పోలీస్, న్యాయం సాయం అందిస్తామని మోటార్ వాహనాల తనిఖీ అధికారి అతికా నాజ్ అన్నారు. వైద్యురాలు పూజా వాణి జయరాం మాట్లాడుతూ రోడ్డు ప్రమాదం జరిగిన మొదట గంట అంటే గోల్డ్ అవర్‌లోపు బాధితులకి సరైన వైద్య చికిత్స అందితే ప్రాణాలు కాపాడవచ్చునన్నారు. ఈ సందర్భంగా పాత మెటర్నటీ ఆస్పత్రి నుంచి స్విమ్స్ ఆస్పత్రి వరకు జిల్లా ప్రధాన వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయ సిబ్బందితో ప్రచార ర్యాలీని నిర్వహించారు.

# తిరుమల సమాచారం

## ఎస్వీఅన్నప్రసాదం ట్రస్ట్‌కు భారీ విరాళం



**తిరుమల,జనవరి 31ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామిపై భక్తివిశ్వాసాలతో దాత లు పలు పథకాలు, ట్రస్ట్‌లకు భారీమొత్తంలో విరాళాలను అందిస్తున్నారు. శుక్రవారం ఉదయం తమిళనాడు చెన్నైకి చెందిన క్యాపిటల్ కంపెనీ ఎండి,సిఇఒ వెంకటేశ్ కన్నప్పన్ టిటిడి ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు ఒకకోటి రూపాయలు విరాళాల డిడిని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి అందజేశారు.

## తొక్కిసలాట ఘటనలో గాయపడిన బాధితురాలికి పరిహారం అందజేత



**తిరుమల,జనవరి 31ప్రభాతవార్త ప్రతినిధి:** పదిరోజుల వైకుంఠ ద్వార దర్శనానికి వచ్చి తిరుపతిలో 8వతేదీ జరిగిన తొక్కిసలాటలో గాయపడి కోలుకున్న బాధితురాలికి టిటిడి ఆర్థిక పరిహారాన్ని అందజేసింది. కడపజిల్లా వీరనాయనపల్లి మండలం సర్వరాజుపేటకాలనీకి చెందిన జి.శైలజ 8వతేదీ జరిగిన తొక్కిసలాటలో గాయపడింది. వైద్యచికిత్సలనంతరం కోలుకుంది. ఆమెకు శుక్రవారం తిరుమలలో జరిగిన పాలకమండలి సమావేశానికి ముందు క్యాంపు కార్యాలయంలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు ,బోర్డుసభ్యులు జ్యోతులనెహ్రూ, శాంతారాం 2లక్షల రూపాయలు డిడిని ఆమెకు అందజేశారు.

## అసౌకర్యం లేకుండా సాఫీగా ప్రవేశనిష్క్రమణ మార్గాలు

**- భక్తులకు సౌకర్యవంతంగా ఏర్పాట్లు**



**తిరుమల,జనవరి 31ప్రభాత వార్తప్రతి నిధి:** సూర్య జయంతి పర్వదినం ఫిబ్రవరి 4వతేదీ రానున్న మంగళ వారం రథసప్తమిన ఏడువాహనాలపై ఏడుకొండలస్వామి భక్తులకు కటాక్షించనున్నారు. ఈ నేఫథ్యంలో మంగళవారం ఉదయం నుండి రాత్రి వరకు ఆలయ మాఢవీధుల్లో ఏడువాహనాల వీక్షణకు 3లక్షల మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున గ్యాలరీల్లోకి సాఫీగా ప్రవేశించేలా ,తిరిగి వెలుపలకు వెళ్ళేలా ప్రవేశ,నిష్క్రమణ మార్గాలు ఏర్పాటుచేయడం జరిగింది. మాఢవీధుల్లో అత్యాధునిక సౌకర్యాలతో జర్మన్‌షెడ్లు నిర్మించారు. అందులో అత్యవసర మరుగుదొడ్లు సదుపాయం, అగ్నిమాపక నివారణ పరికరాలు, పోలీసు,విజిలెన్స్, ఆక్టోపస్, ఎస్‌పిఎఫ్ బలగాలతో భద్రతను పర్యవేక్షిస్తారు. మాఢవీధుల్లోని గ్యాలరీల్లో 1.25లక్షలమంది భక్తులు వేచివుండే అవకాశం ఉంది.

వీరందరినీ మంగళవారం వేకువజాము నుండే మాఢవీధుల్లోని గ్యాలరీల్లోకి అనుమతించడం, నిష్క్రమణ ద్వారాలు ,అత్యవసరగేట్లను శుక్రవారం మధ్యాహ్నం టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, బోర్డు సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, నర్సిరెడ్డి,పనబాకలక్ష్మి, జ్యోతులనెహ్రూ, ఆనంద్‌సాయి. ఎంఎస్‌రాజు, శాంతారామ్, నరేశ్, టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ వెంకయ్యచౌదరి, సివిఎస్ఒ మణికంఠచందోలు, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, సిఎస్ఒలు ఎస్టీవిరామ్‌కుమార్, సురేంద్రతో కలసి తనిఖీ చేశారు. గత అనుభవాలను, అపశృతులు,విషాదఘటనలను దృష్టిలో ఉంచుకుని రథసప్తమికి పటిష్టంగా ఏర్పాట్లు చేయడంతోబాటు భక్తుల నియంత్రణపై సమన్వయంతో వ్యవహరించాలని ఆదేశించారు. భక్తులు గ్యాలరీల్లోకి చేరుకున్న తరువాత నిరంతరాయంగా అన్నప్రసాదాలు, తాగునీరు, టీ,కాఫీ పంపిణీ, మరుగుదోడ్లు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. గ్యాలరీల్లో నిరంతరం పర్యవేక్షణ ఉండాలని ఛైర్మన్ నాయుడు అధికారులను ఆదేశించారు.

# 'న భూతో నభవిష్యత్' అన్నట్లుగా శివరాత్రి ఉత్సవాలు

**ముగ్గురు మంత్రులతో సమీక్ష - దక్షిణ భారత్ సిఎంలకు ఆహ్వానం: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి**



**శ్రీకాళహస్తి,జనవరి 31 ప్రభాతవార్త** శ్రీకాళ హస్తీశ్వరుని శివరాత్రి బ్రహ్మోత్సవాలు - న భూతో నభ విష్యత్తు' అన్నట్లుగా నిర్వహించ నున్నామని ఎంఎల్‌ఏ వెల్లడించారు.ఇక్కడి పంచాయతీరాజ్ అతిధి గృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ళ పాటు రహస్యంగా కొట్లు వెచ్చించి నిర్వహించిన శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో అవకతవకలు,అవినీతి చోటు చేసుకుందన్నారు.కానీ ఈ ఏడాది ఓ వైపు అభివృద్ధి మరో వైపు శివరాత్రిని జవాబుదారి తనం పారదర్శకతతో నిర్వహించుటకు అధికారులను పరుగులు తీయిస్తున్నామన్నారు. శనివారం జిల్లా ఇన్‌చార్జి, రెవెన్యూశాఖమంత్రి సత్యకుమార్, దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిలు విచ్చేస్తున్నారని అంతే కాకుండా శివరాత్రిపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. నలుగురు సిఎంలు అయిన నారాచంద్రబాబు నాయుడు, తెలంగాణా సిఎం రేవంత్‌రెడ్డి, తమిళనాడు సిఎం స్టాలిన్, మహారాష్ట్ర సిఎంలను ప్రత్యేకంగా కలవడంతోపాటు కేంద్రంలో ప్రధాని మోడీ, అమిత్‌షా, ఇతర మంత్రులను ప్రత్యేకంగా కలసి శివరాత్రులకు ఆహ్వానించడంతో పాటు సినీనటుడు అమితాబ్ బచ్చన్, చిరంజీవి, నాగార్జున, వెంకటేష్‌లను ఆహ్వానిస్తామన్నారు. శివరాత్రికి రూ.500 టిక్కెట్టులను రూ.200లకు స్థానికులకు ఇస్తామన్నారు. రెండు రోజులు స్థానికులకు ఆధార్‌కార్డుతో ఉచిత దర్శనం కల్పించనున్నా మన్నారు. నారాలోకేష్ ఇచ్చిన మాట ప్రకారం వాట్సాప్ ఈగవర్నెన్స్ అందుబాటులోకి తెచ్చి ఇందులో 161 సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. శివరాత్రికి ఇప్పటికే ముంబాయి, డిల్లీనుంచి లైటింగ్‌లు తెప్పిం చామని హైదరాబాదు నుంచి పూలడెకరేషన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 1వ గేటు నుంచి రూ.200 టిక్కెట్లు పొందిన భక్తులు, 3వ గేటు నుంచి రూ.500 టిక్కెట్లు తీసుకున్న భక్తులు, 4వ గేటు నుంచి విఐపిలకు ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. విఐపిలతో పాటు నలుగురికి మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. వృద్దులు, చిన్నారుల తల్లిదండ్రులు రూ.200 టిక్కెట్లు తీసుకున్నా వారిని రూ.500లుతో పంపిస్తామన్నారు.

**వ్యవసాయానికి ప్రాధాన్యత:ప్రాజెక్టుల పూర్తికి చర్యలు:** శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేసే ఎస్‌ఎస్‌కెనాల్‌పూర్తి, మల్లెమడుగు, స్కిట్‌లు మూడు సంవత్సరాల్లో అందుబాటులోకి వస్తాయన్నారు. బెల్ ప్రాజెక్టులు అమలు చేయడమే లక్ష్యం అన్నారు. గ్రామాల్లో స్మశానాలకు దారులు ఏర్పాటు చేసి అక్కడ బోరు, ప్రహరీగోడ అందబాటులోకి తెస్తామన్నారు. రూ.22లక్షలతో కళ్ళిపూడి వద్ద ఉన్న తెలుగుగంగ కాలువపై బ్రిడ్డి ఏర్పాటు చేస్తామన్నారు. మరో రెండు మూడు రోజుల్లో ఇందుకు టెండర్లు పిలుస్తామన్నారు. శివం టు శివం రోడ్డుకు త్వరలోనే టెంకాయకొడు తామన్నారు. చకచకా శివరాత్రి పనులు చేస్తున్నామన్నారు.

## మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసిన సివిల్ సప్లై కమిషనర్ సౌరభ్ గౌర్ ఐఎఎస్

**విజయవాడ జనవరి 31 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సివిల్ సప్లై కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సౌరభ్ గౌర్ ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిశారు. ఈ సమావేశంలో సచివాలయంలోని రెండో బ్లాక్‌లో ఉన్న మంత్రి కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రంలోని పౌరసరఫరాల వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించడం నాణ్యమైన సేవలను ప్రజలకు చేరువ చేయడం వంటి అంశాలపై చర్చించారు. మంత్రి నాదెండ్ల మనోహర్, ప్రజలకు నాణ్యమైన మరియు పారదర్శక సేవలు అందించేందుకు పాలనలో సమర్థతను పెంచాలని సూచించారు. కమిషనర్ సౌరబ్ గౌర్ ప్రభుత్త లక్ష్యాలకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## సీమలో రైల్వే జిఎం విస్తృత తనిఖీలు



సీమలో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్న రైల్వే జీఎం జైన్

**గుంతకల్లు రైల్వే,జనవరి 31,ప్రభాత వార్త** దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ గుంతకల్లు రైల్వే డివిజన్‌లో రాయలసీమ జిల్లాలలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. వార్షిక తనిఖీలలో భాగంగా ముందుగా నిర్ణయించిన కార్యక్రమం ప్రకారం గుంతకల్లు డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తాతో పాటు జోన్,డివిజన్‌కు చెందిన సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి ఆయన తిరుపతి,తిరుచానూరు,రాజంపేట,కడప రైల్వే స్టేషన్లను తనిఖీ చేశారు. తిరుచానూరులో రైల్వే సిబ్బంది సౌకర్యార్థం నిర్మిస్తున్న రైల్వే కళ్యాణ్ మండపాన్ని ఆయన శంకుస్థాపన చేశారు. పలుచోట్ల రైలు మార్గాన్ని పరిశీలించారు. అనంతరం గుంతకల్లు చేరుకొని సంబంధిత ఉన్నతాధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షించి ఆర్థిక సంవత్సరం ముగింపుకు మరో రెండు మాసాలే ఉన్నందున నిర్థేశిత లక్ష్యసాధనకు కృషి చేయాలన్నారు. అదనపు డిఆర్ఎం సుధాకర్,ఆయా విభాగాలకు చెందిన సంబంధిత ఉన్నతాధికారులు శ్రీనివాస్, మనోజ్, శ్రావణ్‌కుమార్, మురళీకృష్ణ,రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అప్పులపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలి:

**వైఎస్సార్‌సి అధికార ప్రతినిధి కాకుమాను రాజశేఖర్**



**విజయవాడ జనవరి 31 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏడు నెలల్లో చేసిన రూ.1.19 కోట్ల అప్పులపై వెంటనే శ్వేతపత్రం విడుదల చేసి, ఆ అప్పు ఎలా ఖర్చు చేశారో చెప్పాలని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి కాకుమాను రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఆ బాధ్యత కచ్చితంగా సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై ఉందని ఆయన తేల్చి చెప్పారు. రాజకీయాల్లో తనంత అనుభవజ్ఞుడు లేడని చెప్పే చంద్రబాబు ఎన్నికల ముందు గొప్పగా ప్రచారం చేసిన సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయకుండా సాకులు చెప్పడం సరికాదని స్పష్టం చేశారు. కరోనా సంక్షోభంలో ఎలాగైతే వైఎస్ జగన్ సంక్షేమ పథకాలను కొనసాగించారో అదే స్ఫూర్తితో సీఎం చంద్రబాబు పని చేయాలని సూచించారు. పథకాలు అమలు చేయబోమని చంద్రబాబు చెబుతున్నా పవన్‌కల్యాన్ తేలు కుట్టినా దొంగలా సైలెంట్‌గా ఉండటానికి కారణమేంటని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన కాకుమాను రాజశేఖర్ ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో చంద్రబాబు తన చేతగాని తనాన్ని కప్పి పుచ్చుకోవడానికి అభూత కల్పనలతో అబద్దాలు ప్రచారం చేస్తున్నారన్నారు.కేవలం ఏడు నెలల కాలంలో ప్రజలు చంద్రబాబు చేతిలో మరో సారి మోసపోయామనే ఆవేదనతో ఉన్నారన్నారు.ఇప్పటి ప్రభుత్వం అప్పులు భారీగా ఎందుకు చేస్తుందో కచ్చితంగా ప్రజలకు తెలియాల్సి ఉందన్నారు.

# విత్తు ఒక్కటే.. మొక్కలు మూడు!



**అంబాజీపేట,జనవరి 31, ప్రభాతవార్త:** భూమిలో పాతిన విత్తు ఒక్కటే.. కాని ఆ విత్తు నిండి మొలిచిన మొక్కలు మూడు.. సాధారణంగా ఒక కొబ్బరి కాయ నుండి ఒక మొక్క మాత్రమే మొలుస్తుంది.కొన్ని సందర్భాలలో రెండు మొక్కలు కూడా మొలుస్తుంటాయి. అదే కొబ్బరికాయకు మూడు మొక్కలు మొలిచి మరింత ఆశ్చర్యపర్చింది.అలాంటి ఆశ్చర్యానికి వేదికయ్యింది స్థానిక పశువుల సంత సమీపంలోని హడ్కో కాలనీ శివారులో ఉన్న సూదాబత్తుల శ్రీనివాసరావు వ్యవసాయ క్షేత్రం.శ్రీనివాసరావు తన కొబ్బరి తోటలో చెట్ల నుండి రాలి పడిన కొన్ని కొబ్బరికాయలను పాతిపెట్టారు. పాతిన మూడు నెలలకు చూడగా ఒక కొబ్బరికాయ నుండి మూడు మొక్కలు మొలిచినట్లు గుర్తించారు. స్థానికులు సమాచారంతో కొబ్బరి మొక్కలను ఆసక్తిగా తిలకించేందుకు రైతులు, స్థానికులు వస్తున్నారు.ఈ విషయంపై స్థానిక కొబ్బరి పరిశోధనా కేంద్ర అధిపతి డాక్టర్ ఎన్. బి.వి.చలపతిరావును వివరణ కోరగా జన్యుపర లోపం వల్ల మూడు మొక్కలు మొలుస్తాయన్నారు. మానవులలో ఒక్కక్క సారి ఇద్దరు కవల పిల్లలు, (ట్విన్స్ )మరికొన్ని సందర్భాల్లో ముగ్గురు(ట్రిప్లేట్స్ )జన్మిస్తుం టారని, అలాగే మొక్కలలో కూడా జరుగుతుందన్నారు. ఏది ఏమైనప్పటికీ ఒక కొబ్బరి కాయ నుండి మూడు మొక్కలు మొలవటం వింతైన విషయమని డాక్టర్ చలపతిరావు పేర్కొన్నారు.

# చుండూరు వెంకటరెడ్డి సేవలు చిరస్మరణీయం



విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు పంపిణీ చేస్తున్న దృశ్యం

**ఇంద్రకీలాద్రి, జనవరి 31, ప్రభాతవార్త :** దుర్గమ్మవారి ఆలయంకు ఉపసంస్థ అయిన సివిరెడ్డి చారిటీస్ సంస్థ కు చెందిన ధార్మిక రత్న చుండూరు వేంకటరెడ్డి సేవలు చిరస్మరణీయమని శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం డిప్యూటి ఇఓ ఎం రత్నరాజు అన్నారు. శుక్రవారం సివి రెడ్డి చారిటీస్ ప్రాంగణంలో ధార్మిక రత్న చుండూరు వేంకటరెడ్డి 44వ సంస్మరణ సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తదుపరి పేదవిద్యార్థులకు స్కాలర్‌షిప్పులు, పేదలకు బట్టలు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

**- దుర్గమ్మ ఆలయంలో ఇద్దరి పదవీవిరమణ:** దుర్గమ్మ ఆలయంలో డిప్యూటి ఇంజనీర్ వేంకటేశ్వరరావు, పర్యవేక్షకుడు అమృతరావు సుమారు ముప్పై సంవత్సరాల సేవలందించి శుక్రవారం పదవీవిరమణ చేస్తున్న సందర్భంగా ఇఓ కె రామచంద్రమోహన్ ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రిటైరైన ఉద్యోగులకు ఘనంగా డిప్యూటిఇఓ ఎం రత్నరాజు, ఇతర అధికారులు, సిబ్బంది సత్కరించారు. రిటైరైన వారు దుర్గమ్మవారి పంచహారతుల సేవలో పాల్గొన్న అనంతరం వారికి దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలను డిప్యూటి ఇఓ అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు. ఇతర అధికారులు, ఏఇఓలు, సిబ్బంది వారికి శుభాకాంక్షలు తెలిపారు.



పదవీవిరమణ చేసిన ఉద్యోగులకు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

# 7వమైలు వద్ద ఇఒ ఆకస్మికతనిఖీలు



**తిరుమల,జనవరి 31ప్రభాతవార్తప్రతినిధి:** రథసప్తమికి ముందే తిరుమల మొదటిఘాట్‌లో నడకదారిలో 7వమైలు సమీపంలో టిటిడి ఇఒ జె.శ్యామలరావు సాధారణభక్తుడిలా ఆకస్మిక తనిఖీలు చేశారు. శుక్రవారం రాత్రి ఆయన తిరుపతికి దిగే సమయంలో గాలిగోపురం, 7వమైలు ప్రాంతాల్లోని దుకాణాలను, వాటి లైసెన్స్‌లను, పారిశుధ్యం వాటిపై ఆకస్మికంగా తనిఖీ చేయడంతో దుకాణాదారులు ఒకింత ఆశ్చర్యచకితులయ్యారు. వెంట ఎవరినీ తీసు కెళ్ళకుండా ఈ తనిఖీలు చేయడం విశేషం.






## శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దీవెనలతో
# రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

- రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నా
- ఆర్యవైశ్యుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- పెనుగొండ శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినం సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్న సీఎం చంద్రబాబు
- అమ్మవారికి ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పణ అనంతరం గురుపీఠం నిర్మాణానికి శంకుస్థాపన








పెనుగొండ, జనవరి 31 ప్రభాతవార్త : పెనుగొండ శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకుని పట్టు వస్త్రాలు సమర్పించడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని అన్నారు. ఈ ఆలయానికి 2,600 ఏళ్ల చరిత్ర ఉందని, అమ్మవారిని వేడుకుంటే సకల శుభాలు కలుగుతాయని భక్తుల నమ్మకమన్నారు. పశ్చిమ గోదావరిజిల్లా పెనుగొండలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిని సీఎం చంద్రబాబు శుక్రవారం దర్శించుకున్నారు. ఆత్మార్పణ దినం సందర్భంగా అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆలయానికి వచ్చిన ముఖ్యమంత్రికి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేద పండితులు ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ... స్త్రీల ఆత్మగౌరవాన్ని చాటిచెప్పిన కలియుగ పార్వతీదేవిగా అమ్మవారిని భక్తులు కొలుస్తారు. అహింస, ఆత్మ త్యాగం, శాంతి, ధర్మ నిరతికి ప్రతిరూపం అమ్మవారు. దేశవ్యాప్తంగా ఆర్య వైశ్యులతో పాటు అన్ని వర్గాల ప్రజలు అమ్మవారిని కొలుస్తారు. ఆర్యవైశ్యుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు.

**దేవుని వరం వాసవీ మాత దర్శనం**

భగవంతుని ఆశీస్సులతో పెనుగొండ పాలకులైన కుసుమ శ్రేష్టి, కుసుమాంబ దంపతులకు శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి జన్మించింది. గుణవంతురాలైన వాసవిమాత సమాజం పట్ల ఎంతో బాధ్యతగా వ్యవహరించేవారు. రాజమహేంద్రవరాన్ని పాలించిన విష్ణువర్ధనుడు అనే రాజు వాసవీ అమ్మవారిని పెళ్లిచేసుకోవాలని భావించి ఆమె తల్లిదండ్రులను సంప్రదించారు. అమ్మవారు సహా 102 మంది గోత్రికులు ఈ పెళ్లికి నిరాకరించారు. ఆగ్రహించిన విష్ణువర్ధనుడు దుర్భాషలాడాడు. తన వల్ల హింస జరగకూడదని, శాంతిని కాపాడాలనే సదుద్దేశంతో అమ్మవారు సహా 102 మంది గోత్రికులు ఆత్మార్పణ చేశారు. అనంతరం, మహిషాసుర మర్ధిని ఆలయంలో అమ్మవారి రూపంలో వాసవి దేవి దర్శనమిచ్చారు. అప్పటినుంచి ఆర్యవైశ్యులు అమ్మను దేవతగా కొలుస్తున్నారు. దేశవ్యాప్తంగా వాసవిమాతకు ఆలయాలు ఉన్నాయి. ఆలయంలో 90 అడుగుల అమ్మవారి విగ్రహం ప్రతిష్టించారు. ఏడు అంతస్తుల గాలిగోపురం కట్టారు. ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేసేందుకు ముందుకొచ్చిన దాతలను నేను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని ముఖ్యమంత్రి అన్నారు.

**అమ్మవారి ఆశీస్సులతో అందిరికీ మంచి జరగాలి**

వైశ్యులు నీతి, నిజాయితీలతో వ్యాపారం చేస్తారు. సంపాదించిన డబ్బులో కొంత ప్రజాసేవకు వినియోగిస్తారు. ఒకప్పుడు చిరు వ్యాపారాలకే పరిమితమైన వైశ్యులు ఇప్పుడు పెద్ద వ్యాపారాలు చేస్తున్నారు. అమ్మవారి ఆశీస్సులతో అందరికీ మంచి జరుగుతుంది. దేశంలోనే తొలిసారిగా వాట్సాప్ గవర్నెన్స్ ప్రారంభించాము. 161 ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చాము. ప్రజలంతా సుఖ, సంతోషాలతో ఉండాలన్నదే నా ధ్యేయం. స్వర్ణాంధ్ర విజన్ -2047 లక్ష్య సాధనలో ఆర్య వైశ్యులు కూడా భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

పశ్చిమగోదావరి,ఏలూరు
వార్త

## రివాల్వర్‌తో కాల్చుకుని ఎస్సై ఆత్మహత్య

- -వీఆర్‌లో కొనసాగుతున్న ఎస్సై మూర్తి
- -తణుకు రూరల్ పోలీసు స్టేషన్‌లో ఘటన
- -ఘటనా స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ
- -సీఎం బందోబస్తుకు బయల్దేరిన ఎస్సై మూర్తి
- -స్టేషన్‌కు వచ్చి బాత్రూమ్‌లో రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్య
- -విచారణ చేయిస్తున్నామని వెల్లడించిన జిల్లా ఎస్పీ





**తణుకు, జనవరి 31(ప్రభాత వార్త):** సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని సబ్ ఇన్‌స్పెక్టర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో చోటు చేసుకుంది. పోలీస్ అధికారులంతా సీఎం బందోబస్తులో నిమగ్నమై ఉండగా ఈ ఉదంతం తణుకులో సంచలనం రేకెత్తించింది. తణుకు రూరల్ ఎస్సైగా పనిచేసిన ఆదుర్తి గంగ సత్యనారాయణమూర్తి (ఏజీఎస్ మూర్తి) (38) ప్రస్తుతం వీఆర్‌లో కొనసాగుతున్నారు. అయితే శుక్రవారం జిల్లాకు విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటనలో ఎస్కార్ట్ విధుల్లో పాల్గొనాల్సిన మూర్తి శుక్రవారం ఉదయం 7.30 గంటల ప్రాంతంలో తణుకు రూరల్ పోలీసు స్టేషన్‌కు వచ్చి వెనుక బాత్‌రూమ్‌కు వెళ్లి తనతోపాటు తెచ్చుకున్న సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకున్నారు. దీంతో అక్కడికక్కడే మృతి చెందడంతో మృతదేహాన్ని తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడు ఎస్సైకు భార్య విజయ, ఎల్‌కేజీ చదువుతున్న కుమారుడు చందన్, 13 నెలల వయసు కలిగిన కుమార్తె దీక్షిత ఉన్నారు. అయితే ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. సంఘటనా స్థలాన్ని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ సందర్శించి కుటుంబ సభ్యుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్సై మూర్తి ఆత్మహత్య ఘటనపై విచారణ చేస్తున్నట్లు ఎస్పీ వివరించారు. తణుకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**ఆత్మహత్యకు కారణాలేంటి..?**

తణుకు రూరల్ ఎస్సైగా పనిచేసి ప్రస్తుతం వీఆర్‌లో ఉన్న ఏజీఎస్ మూర్తి ఆత్మహత్య ఘటన జిల్లాలో సంచలనం రేకెత్తించింది. 2012 బ్యాచ్‌కు చెందిన మూర్తి కృష్ణా జిల్లా మచిలీపట్నంలో పోస్టింగ్ అనంతరం జిల్లాలోని నరసాపురం రూరల్, కాళ్ల, పాలకోడేరు, భీమవరం టూటౌన్, పెరవలి, తణుకు రూరల్ పోలసు స్టేషన్లలో పని చేశారు. ప్రస్తుతం తణుకు మండలం పైడిపర్రులోని తణుకు రూరల్ పోలీసు స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే అద్దెకు నివాసం ఉంటున్నారు. గతేడాది నవంబర్‌లో వేల్పూరు గ్రామానికి చెందిన రెండు గేదెల అపహరణ కేసులో పెద్ద మొత్తంలో నగదు చేతులు మారినట్లు వచ్చిన ఆరోపణలు నేపథ్యంలో ఎస్సై మూర్తితోపాటు మరో ఏఎస్సైను ఉన్నతాధికారులు వీఆర్‌లోకి పంపారు. అయితే శుక్రవారం పెనుగొండ వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనలో బందోబస్తు విధుల్లో పాల్గొనేందుకు గురువారం భీమవరం జిల్లా కేంద్రానికి వెళ్లి సర్వీస్ రివాల్వర్ తెచ్చుకున్నారు. శుక్రవారం ఉదయం డ్యూటీకు వెళుతున్నానని చెప్పి బైక్ బయల్దేరిన ఎస్సై మూర్తి నేరుగా తణుకు రూరల్ పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడే ఉన్న సెంట్రీతో బాత్రూమ్‌కు వెళతానని మంచినీళ్లు ఇవ్వాలని కోరారు. మంచినీళ్లు తాగిన ఎస్సై మూర్తి కొద్ది సేపు సెల్‌ఫోన్‌లో చాటింగ్ చేసుకుని బాత్రూంకు వెళ్లారు. కొద్ది సేపటికి పెద్ద శబ్దం రావడంతో అక్కడే ఉన్న సిబ్బంది వెళ్లి చూసే సరికి బాత్రూమ్‌లో విగత జీవిగా పడి ఉన్నారు. సమాచారం తెలుసుకున్న తణుకు రూరల్ సీఐ కృష్ణకుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని 108 వాహనంలో తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అయితే ఎస్సై మూర్తి ఆత్మహత్యకు గల కారణాలపై భిన్న వాదనలు వినబడుతున్నాయి. వీఆర్‌లో పెట్టినంత మాత్రాన మనస్తాపానికి చెంది ఆత్మహత్య చేసుకునేంత పిరికి వాడు కాదని బంధువులు, స్నేహితులు చెబుతున్నారు. ప్రస్తుతం జిల్లా స్థాయిలో వీఆర్‌లో కొనసాగుతున్న ఎస్సై మూర్తిని రేంజి వీర్‌లోకి పంపుతూ గురువారం ఆదేశాలు వచ్చిన విషయం అన్నతో ఫోన్‌లో చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో ఆందోళనకు గురైన మూర్తి గురువారం రాత్రంతా పడుకోలేదని కుటుంబ సభ్యులు చెబుతున్నారు.

## ప్లాస్టిక్ నిషేధ ఉత్తర్వులు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



భీమవరం జనవరి 31 ప్రభాతవార్త :ప్లాస్టిక్ నిషేధ ప్రభుత్వ ఉత్తర్వులు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని, ఫిబ్రవరి 1 నుంచి నిబంధనలు అమల్లోకి వస్తాయని మున్సిపల్ కమిషనర్ కె రామచంద్ర రెడ్డి అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, పురపాలక సంఘం ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహనా, హెూటల్స్ కు స్టీల్స్ సామాగ్రిని అందించారు. మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులతోపాటు స్వచ్ఛంద సంస్థల సభ్యులు కూడా ప్లాస్టిక్ నిషేధ అమలపై తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని, ఆ ప్రయత్నాల్లో ప్రతి హెూటల్స్ లో అవగాహనా కోసం స్టీల్ సామాగ్రి ని ఉచితంగా అందించడం గొప్ప విశేషమని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ సర్ సివి రామన్ స్కూల్ కరస్పాండెంట్ రావణం వేణుగోపాలరావు సహకారంతో 6 హెూటల్స్ కు స్టీల్ సామాగ్రిని అందించామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వరరావు, స్కూల్ ప్రిన్సిపాల్ పెండ్యాల సరితా, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# పోరాడే తీరుతం, సాధించే తీరుతాం

- నిరసన ర్యాలీలతో కధం తొక్కిన ఏడు గ్రామాల నిర్వాసిత ప్రజలు
- తాహసిల్దార్ కార్యాలయం ముట్టడి, డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేత



వేలేరుపాడు, ప్రభాత వార్త : పోలవరం ప్రాజెక్టు వలన సర్వం కోల్పోతున్నటువంటి తమ గ్రామాలను కూడా 41.15 కాంటూరులో చేర్చి పునరావాస ప్యాకేజీ అమలు చేయాలని వేలేరుపాడు మండలంలోని చాగరపల్లి,గిగావారగుంపు, కొర్రాజులగూడెం, సుద్దగుంపు,పాత గవర్నమెంట్ హాస్పటల్ కాలనీ (తాటుకూరుగొమ్ము కాలనీ), యర్ర బోరు, నడిమిగొమ్మ కాలనీ, పడమటి మెట్ట, మద్దిగట్ల, పాతపూచిరాల,వసంతవాడ, శివకాశి పురం గ్రామాల ప్రజలు అఖిలపక్షం ఆధ్వర్యంలో వేలేరుపాడు సెంటర్ నుండి తాహసిల్దార్ కార్యాలయం వరకు నిరసన, ర్యాలీలు చేపట్టారు. 2022 వరదల సమయంలో ఈ గ్రామాల ప్రజల గృహాల పైనుంచి వరద ప్రవాహం వచ్చిందని, ఈ గృహాలపై నుంచే పడవలు, లాంచీలు తిరిగాయని అధికారులు కళ్ళారా చూశారని అయినా 41.15వ కాంటూరు లో చేర్చకపోవడం ఎంతవరకు సబబు అని నిలదీశారు. 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరికి కూడా ప్యాకేజీ వర్తింపజేయాలని, గతంలో 10 రోజులు తక్కువైనా సరే 18 సంవత్సరాలు నిండా లేదని ప్యాకేజీ వాళ్ళకి ఇవ్వలేదని అలాంటి వారికి కూడా ఈసారి ప్యాకేజీ అమలు చేయాలని, ఈ గ్రామాలను 41.15 కాంరట్టార్ లో చేర్చి నిర్వాసితులందరికి న్యాయం చేయాలని చేయకపోతే రానున్న రోజుల్లో ఐటీడీఏ కార్యాలయాన్ని మరియు కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని పోరాటాలు వేలేరుపాడు కి కొత్తమీ కాదని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమాలలో అఖిలపక్షం నుండి కార్యక్రమ అధ్యక్షులు కట్టి.ఉదయ్ కుమార్,సిపిఐ మండల కార్యదర్శి బాడిస. రాము, సిపిఐ రాష్ట్ర సమితి నాయకులు ఎండి.మునీర్, సిపిఐ జిల్లా కార్యదర్శి సభ్యులు ధారయ, సాయిబాబు, యర్ర. మధు,సిపిఎం మండల కార్యదర్శి ధర్మల.రమేష్, సిపిఎం జిల్లా నాయకులు మడివి.దుర్గారావు, కారం.వెంకటరావు, వైఎస్ఆర్సిపి మండల నాయకులు కామినేని. వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ బుజ్జా.రామలక్ష్మి, కొమరాజు. రాంబాబు, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి సోడే. సీతారామయ్య,సిహెచ్ వెంకన్న బాబు,రాంబాబు తేల్లం. మహేష్, తోడం. సీతమ్మ ఊకే.ముత్యాలరావు, కాక.నరేష్, కామయ్య, దేవయ్య తదితరులు పాల్గొన్నారు



శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా పెనుగొండ శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారి దేవాలయం విచ్చేసిన గౌరవ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని కలిసిన, రాష్ట్ర ప్రభుత్వ విప్, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్. ప్రభాతవార్త నరసాపురం

## ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి విజయం కోసం నేడు సమావేశం

జంగారెడ్డిగూడెం ప్రభాతవార్త : జంగారెడ్డిగూడెం పట్టణ,మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటలకు స్థానిక ఆలపాటి గంగాభవాని కళ్యాణ మండపంలో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి విజయం కోసం సమావేశం నిర్వహిస్తున్నారు. పట్టణ టిడిపి అధ్యక్షులు రావూరి కృష్ణ ,ప్రధాన కార్యదర్శి తూటికుంట రాము శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ అభ్యర్థి పేరా బత్తుల రాజశేఖర్,ముఖ్య అతిథిగా చింతలపూడి ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్ పాల్గొంటారని వారు తెలిపారు.

## వాహ్...మార్టేరు అల్లం టీ! మంత్రి రమానాయుడు



పెనుమంట్ర, జనవరి-31, ప్రభాతవార్త: మండలంలోని మార్టేరు రాజు అల్లం టీని మంత్రి రమానాయుడు శుక్రవారం రుచి చూశారు. పెనుగొండలోని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రోగ్రాం చూసుకొని తిరిగి పాలకొల్లు వెళుతున్న సందర్భంలో మార్టేరు సెంటర్లో పెనుగొండ రోడ్ లో ఉన్న రాజు అల్లం టీ సెంటర్ దగ్గర రాష్ట్ర జలవనుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కొద్దిసేపు ఆగి టీ తాగారు. టీ చాలా బాగుందని ఆమెకు కితాబు ఇచ్చారు. అలాగే తెలుగుదేశం ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి ఎలా ఉంది? అని అడిగారు. ఆయన వెంట నాయకులు కూడా ఉన్నారు. మంత్రి అయ్యుండి సాధారణ వ్యక్తులా మార్టేరులో టీ తాగాడంపై మంత్రి రమానాయుడు పై పలువురు ప్రశంసలు కురిపించారు. ఇది ఆయన నిరాడంబరత్వానికి నిదర్శనం అని పలువురు పేర్కొన్నారు.




ముఖ్యమంత్రిని కలిసి పుష్ప గుచ్చాలి ఇచ్చిన నేతలు.
ప్రభాతవార్త






## ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**ఏలూరు టౌన్, జనవరి 31,ప్రభాత వార్త :** శ్రీ విద్యాలయ జూనియర్ కాలేజ్ నందు ఏలూరు విజన్ లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని శ్రీవిద్యలయ జూనియర్ కాలేజ్ డైరెక్టర్ మళ్ళ నాగార్జున శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుండి ప్రారంభం కానున్న ఈ ఉచిత వైద్య శిబిరంలో ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పిస్తారని వెల్లడించారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి విద్యార్థులతో పాటు ఇతరులు కూడా వినియోగించుకునే అవకాశం కల్పించామని తెలిపారు. ఈ శిబిరంలో ఏలూరు భాను డెంటల్ కేర్ ఆసుపత్రి అధినేత ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ జి భాను కిరణ్ (లయన్స్), డాక్టర్ హరీక్ పాల్గొంటారని ఆయన ప్రకటనలో స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు ఉచితంగా అందించాలనే సంకల్పంతో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని కాలేజీ కరస్పాండెంట్ మన్నె అశోక్ గజపతిరాజు తెలిపారు.

# నూజివీడు ఏ.ఎం.సి బాబీ కే ఇవ్వాలి

నూజివీడు, జనవరి30 ప్రభాతవార్త: నూజివీడు తెలుగు యువత నియోజకవర్గ కార్యదర్శి, ముసునూరు సర్పంచ్ తనయులు కొండేటి ఉదయ్ (బాబీ) కి నూజివీడు ఏ.ఎం.సి చైర్మన్ పదవి ఇవ్వాలని నియోజకవర్గంలో పలువురు నాయకులు కోరుతున్నారు. నియోజకవర్గంలోని చాట్రాయి, ఆగిరిపల్లి పరిసర మండలాల నుంచి పలువురు పోటీ పడుతున్నప్పటికీ విద్యావంతుడు వ్యవసాయంపై అవగాహన ఉన్న బాబీ కే ఈ పదవి కేటాయించాలి. నూజివీడు ఏ.ఎం.సి ఎస్సీ జనరల్ కు కేటాయించడంతో నియోజకవర్గంలోని పలువురు దళిత నాయకులు ఈ పదవికి పోటీ పడుతున్నారు. ఇది ఇలా ఉండగా ముసునూరు లో కొండేటి బాబి కుటుంబం గత 30 ఏళ్లుగా టిడిపిలోనే కొనసాగుతున్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి ముసునూరులో కొండేటి కుటుంబం టిడిపికి కంచుకోటగా కొనసాగుతుంది. బాబీ తండ్రి కొండేటి ఇర్మియా నూజివీడు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శి గా సుదీర్ఘ కాలం పాటు పంచాయతీరాజ్ శాఖలో పనిచేశారు. నియోజకవర్గంలోని నాయకులకు ఆయన సుపరిచితులు. పంచాయతీరాజ్ శాఖలో నిజాయితీగా పనిచేసి పలువురు ఉన్నతాధికారుల మన్ననలు పొందారు. ఆయన మాతృమూర్తి కొండేటి విజయలక్ష్మి పండిట్ అంగన్వాడీ టీచర్ గా విధులు నిర్వహించి ఎందరో విద్యార్థులను తీర్చిదిద్ది వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేశారు. ప్రస్తుతం ఆమె ముసునూరు సర్పంచ్ గా కొనసాగుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికలలో మంత్రి పార్థసారథి విజయ సాధనలో ముసునూరు మండలం, నూజివీడు నియోజకవర్గంలో యువతతో పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు. పలు సందర్భాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు యువతకు పెద్ద ఎత్తున ప్రాధాన్యం అని పేర్కొన్నారు. యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేష్ తో అప్పటి వై.సి.పి అరాచక పాలనపై పంచాయతీలో రచ్చబండ ముఖాముఖి చర్చలో ముసునూరు సర్పంచ్ కొండేటి విజయలక్ష్మి తో చర్చించడం చర్చనీయమైనది, మంత్రి నారా లోకేష్ దృష్టిలో ముసునూరు సర్పంచ్ కు ప్రత్యేక స్థానం ఏర్పరుచుకున్నారు. బాబి ముసునూరు సర్పంచ్ కొండేటి విజయలక్ష్మి కుమారుడు కావడం బాబీ కి కలిసి వచ్చే అవకాశం కలిగించి. నూజివీడునియోజకవర్గంలో ఎం.ఆర్.పి.ఎస్ , ఎం. ఈ.ఎఫ్ కులసంఘాల ఆత్మీయ కలయిక నిర్వహించడంలో కొండేటి బాబీ కీలకపాత్ర వహించారు. యువతలో మంచి ఆదరణ కలిగి ఉండటం, నియోజకవర్గం తెలుగుదేశం -బీజేపీ జనసేన కళ్ళు కూటమి కార్యకర్తల అభిప్రాయాలను పరిగణలో తీసుకొని నూజివీడు ఏఎంసీ చదువుకున్న యువతకు ఇవ్వాలని కూటమి ప్రభుత్వం ను యువత కోరుతున్నారు. బాబీకి చైర్మన్ పదవి ఇచ్చేందుకు బడుగు బలహీన వర్గాల ఆశ జ్యోతి మంత్రి కొలుసు పార్థసారథి ని కూటమి కార్యకర్తలు కోరుచున్నారు.

## ఆర్య వైశ్యుల అభ్యున్నతికి సహకరిస్తా ఎమ్మెల్యే రోషన్ కుమార్



జంగారెడ్డిగూడెం ప్రభాతవార్త : ఆర్య వైశ్యులు ఎంతో మృదు స్వభావులని,వారు ఎవరికీ హాని చెయారని చింతలపూడి ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్ అన్నారు. జంగారెడ్డిగూడెం ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ముందుగా ఆయన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జీవిత చరిత్రను వివరించారు. ఈరోజు జరుగుచున్న వాసవి కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ మహోత్సవంలో రాష్ట్రంలో నుండి వేలాదిమంది భక్తులు పాల్గొంటున్నారని తెలిపారు. ఆర్యవైశ్యులు మొన్న జరిగిన ఎన్నికలలో ఎన్డీఏను భారీ మెజారిటీతో గెలిపించారని కొని యడారు. నన్ను కూడా చింతలపూడి నియోజకవర్గంలో గెలిపించినందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో ఆర్యవైశ్యులకు పెద్ద పీట వేశారన్నారు. మంత్రి పదవిని కూడా ఇచ్చారని గుర్తు చేశారు. ఆర్యవైశ్యులకు ఎక్కువగా నిధులు మంజూరు కావటానికి కూడా తను కృషి చేస్తానన్నారు. ఆర్యవైశ్యులకు అండగా ఉండి,వారికి కేటాయించవలసిన ల్యాండ్ సమస్యల పరిష్కారానికి ,వ్యాపారవృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. విలేకరుల సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షులు రావూరి కృష్ణ ,మహంకాళి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

## నోటి క్యాన్సర్ పై డా. మేడపాటి ఆర్టికల్ విడుదల



పెనుమంట్ర, జనవరి-31, ప్రభాతవార్త: పెనుగొండ రత్నాస్ దంత వైద్యశాల వైద్యులు డా. మేడపాటి మురళీ జోగిరెడ్డి నోటి క్యాన్సర్ నిర్ధారణలో అత్యాధునిక రీసెర్చ్ లో భాగంగా మరొక అంతర్జాతీయ ఆర్టికల్ గురునానక్ జర్నల్ ఆఫ్ ఫార్మసీ అండ్ బయో అలైడ్ సైన్సెస్ లో విడుదలైనట్లు డాక్టర్ జోగిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు. ఆర్టికల్ ను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ నేటి మన నోటి అలవాట్లు మరియు, తీసుకునే ఆహారం వల్ల నోటి క్యాన్సర్ బాధితులు పెరుగుతున్నారని అన్నారు. కనుక యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు.

## చెరువు పనులను ఆపించండి -తహశీల్దార్ నాగార్జున

ఉండి, జనవరి 31, ప్రభాతవార్త : ఉండి రెవెన్యూ గ్రామపంచాయితీ పరిధిలో స్థానిక కొండాల డ్రెయిన్ కు చేర్చి అక్కా చైతు సాగిరాజు సాంబశివరాజు త్రవ్వుతున్న చెరువుల పనులను వెంటనే ఆపించాలని ఉండి మండల తహశీల్దార్ కే నాగార్జున సూచించారు. ఈ సందర్భంగా శుక్రవారం తనను కలిసిన విలేకరులతో ఆయన మాట్లాడారు. సాంబరాజు తవ్వుతున్న చెరువుల్లో డ్రైనేజీ గట్టు ఆక్రమణకు గురైందని డ్రైనేజీ ఏఈ జై ప్రకాష్ తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఈ విషయమై రైతును ప్రశ్నిస్తే తనను భయభ్రాంతులను గురి చేసే విధంగా మాట్లాడుతున్నారని జయప్రకాష్ తనకు వివరించారు. దీనిపై ఉండి పోలీసులకు ఫిర్యాదు సైతం చేసామని డ్రైనేజీ ఏఈ చెప్పినట్లు తాసిల్దార్ పేర్కొన్నారు. అలాగే రైతులకు చెందిన పులుగొమ్ము ఛానల్ 16వ నెంబర్ తూమును పూర్తిగా మూసేసి సన్న చిన్న కారు రైతులకు నష్టం చేకూరే విధంగా సాంబరాజు చెరువును త్రవ్వినట్లు స్థానిక రైతులు తమకు ఫిర్యాదు చేశారన్నారు. ఈ విషయమై హైకోర్టులో స్టేటస్ కో సైతం వచ్చినట్లు పలువురు రైతులు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. దీంతో సాంబరాజు చెరువు పనులు వెంటనే నిలిపివేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఫిషరీస్ డెవలప్ మెంటు ఆఫీసర్ కు డ్రైనేజీ ఎఇ కు సూచనలు చేశామని తాసిల్దారు వివరించారు. చెరువులకు నీళ్లు తోడినా, ఇతర పనులు చేసినా చట్టపరమైన చర్యలకు సిఫారసు చేస్తామని తహసిల్దార్ తెలిపారు.

## నూజివీడులో హాస్టల్ వార్డెన్ పై ఏ.సీ.బీ దాడి

### -రూ. 30 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వార్డెన్ దంపతులు



నూజివీడు, జనవరి31 ప్రభాతవార్త: నూజివీడు పట్టణంలో ఎంప్లాయిస్ కాలనీలో గురువారం రాత్రి ఏ.సీ.బీ దాడి తీవ్రసంచలనం కలిగించింది, వివరాలు ఇలా ఉన్నాయి. ముదునూరు తాతయ్య జూనియర్ కళాశాల ప్రాంగణంలోని సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్లో స్వీపర్ గా పనిచేస్తున్న మహిళా ఉద్యోగి రూట్సీ నుండి హాస్టల్ వార్డెన్ నాగమణి రూ. 30 వేల నగదు లంచం తీసుకుంటూ భర్తతో సహా రెడ్ హ్యాండెడ్ గా పట్టుపడ్డారు. హాస్టల్లో స్వీపర్ గా విధులు నిర్వర్తిస్తున్న రూట్సీ నుండి లక్ష రూపాయలు లంచం డిమాండ్ చేయడంతో అంత ఇచ్చుకోలేను అనగా రూ. 50 వేలు ఇవ్వమని వార్డెన్ కోరారు. అంత ఇవ్వలేనంటే కనీసం రూ. 30 వేలు ఇమ్మని అడిగినట్లు పేర్కొన్నారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని స్వీపర్ రూట్సీ ఏలూరు ఏసీబీ ని ఆశ్రయించింది. వారు ఒక పథకం ప్రకారం నిందితులను పట్టుకున్నారు. కేసు నమోదు చేసి రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఎసిబి డి.ఎస్పి సుబ్బరాజు ఈ సందర్భంగా మాట్లాడుతూ బాధితురాలిని లంచం ఇవ్వాలని డిమాండ్ చేయడంతో తమను ఆశ్రయించినట్లు పేర్కొన్నారు. గత రాత్రి నిఘా వేసి హాస్టల్ వార్డెన్ నాగమణి, ఆమె భర్తను లంచం తీసుకుంటూ ఉండగా పట్టుకున్నట్లు వివరించారు. ఏసిబి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో ఏసీబీ సీఐ ఎం.బాలకృష్ణ,కే.శ్రీనివాస్,రాజమండ్రి సీఐ ఎన్వి.భాస్కరరావు పాల్గొన్న రు.

## రైతులు ఏ పంట నమోదు తప్పనిసరిగా చేయిచుకోవాలి

అత్తిలి - జనవరి 31 ( ప్రభాత వార్త ): అత్తిలి మండలం లోని రైతులందరూ తప్పనిసరిగా ఈ పంట నమోదు తో పాటు ఈ కెవైసి కూడా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి జెడ్ వెంకటేశ్వరరావు కోరారు. అత్తిలి మండలం లోని అత్తిలి , ఆరవల్లి , స్కిన్నెర పురం గ్రామాలలో పర్యటించి ఈ పంట నమోదును తనిఖీ చేసారు. ఈ పంట నమోదు వల్ల విత్తనాలు , ధాన్యం కొనుగోలు , ఎరువుల కేటాయింపు , పంటల భీమా వంటి సదుపాయాలు కలుగుతాయని తెలిపారు. వ్యవసాయ సహాయకులు ఈ పంట నమోదులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా అధికారితో పాటు మండల వ్యవసాయాధికారి టికే . రాజేష్ సిబ్బంది పాల్గొన్నారు.

# యద్దనపూడి సేవలు కొనియాడదగినవి

### - సన్మాన గ్రహీత సీనియర్ జర్నలిస్టు గంటా వేణుగోపాల్







తణుకు, జనవరి 31 (ప్రభాతవార్త) : ప్రముఖ పాత్రికేయుడు, సంఘ సేవకుడు యద్దనపూడి సూర్యనారాయణమూర్తి సేవలు మరువలేనివని వార్త సీనియర్ జర్నలిస్ట్ గంటా వేణుగోపాల్ అన్నారు. యద్దనపూడి 14 వ వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం తాడేపల్లిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఎపియుడబ్ల్యుజే జిల్లాశాఖ, తాడేపల్లిగూడెం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యద్దనపూడి పేరిట వారి కుటుంబ సభ్యులు నిర్వహించిన అవార్డులకు కార్యక్రమం అటహాసంగా జరిగింది. పాత్రికేయులకు గౌరవం తెచ్చిన అమరజీవి యద్దనపూడి అని పలువురు ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో యద్దనపూడి స్మారక జిల్లాస్థాయి ఉత్తమ జర్నలిస్ట్ పురస్కారం -2024 ను తాడేపల్లిగూడెం ఆంధ్రజ్యోతి విలేఖరి మైలవరపు రవికిరణ్ కు దక్కింది. సీనియర్ పాత్రికేయులకు గౌరవ సత్కారం కార్యక్రమంలో భాగంగా 40 సంవత్సరాలుగా పాత్రికేయ వృత్తిలో కొనసాగుతున్న భీమవరం వార్త విలేఖరి గంటా వేణుగోపాల్ ను ఎంపిక చేసి సత్కరించారు. అలాగే ఏలూరు సాక్షి విలేఖరి సి.హెచ్. రామకృష్ణంరాజు , జంగారెడ్డిగూడెం ఎబిఎన్ ఆంధ్రజ్యోతి విలేఖరి పాలడుగుల రామకృష్ణ ను యద్దనపూడి కుటుంబం తరపున సత్కారం చేసారు. సన్మాన గ్రహీతలను పలువురు అధికారులు విలేకరులు కుటుంబ సభ్యులు అభినందించారు. ప్రభుత్వ బాలికల పాఠశాలలో పదవతరగతిలో అత్యధిక మార్కులు తెచ్చుకున్న మీసాల అనూష కు 5116 రూపాయల పారితోషికం అందచేసారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు టి.రంగసురేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్ ఛార్జ్ డి.రామకృష్ణ హాజరయ్యారు. ఈనాడు సీనియర్ పాత్రికేయుడు కర్రెడ్డి రామకృష్ణ, ఐజేయు జాతీయకార్యదర్శి డి.సోమసుందర్, ఎపియుడబ్ల్యుజే జిల్లా కార్యదర్శి గజపతి వరప్రసాద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యడ్లపల్లి మురళికృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.వి.లక్ష్మయ్య, ప్రెస్ క్లబ్ కార్యదర్శి గొలిమె బుజ్జి బాబు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ జగదాంబ ఆలయ కమిటీ చైర్మన్ గా చిర్రి ఏకగ్రీవం

### పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు



జీలుగుమిల్లి, జనవరి-31, ప్రభాతవార్త: మండల కేంద్రం జీలుగుమిల్లిలో వేంచేసి ఉన్న జగదాంబ అమ్మవారి ఆలయ కమిటీ ఎన్నిక శుక్రవారం ఏకగ్రీవంగా జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ గా చిర్రి వెంకటేశ్వరరావుతో పాటు ఆలయ కమిటీ సభ్యులు ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. శుక్రవారం జీలుగుమిల్లిలోని జనసేన క్యాంపు కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్ అధ్యక్షతన ఆలయ కమిటీ ఎన్నిక పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా జరిగింది. జగదాంబ తల్లి ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులుగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, గౌరవ సభ్యులుగా మాజీ జడ్పిటిసి, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్, ఆలయచైర్మన్ గా చిర్రి వెంకటేశ్వరావు, వైస్ చైర్మన్ గా కొండపల్లి ప్రసాద్ రావు, కోలా మధు, కార్యదర్శులుగా కుందేటి సత్యనారాయణ, ధార మధు, ఉప కార్యదర్శులుగా నారగాని నరేంద్ర, పాలోజి దుర్గ ప్రసాద్. కమిటీ నెంబర్లు గా బొంతు వెంకటేశ్వరావు, ఉలవల శివ, ఉలవల వెంకటేశ్వరావు, రూపా సత్యనారాయణ, కోలా ధర్మరాజు, కొత్తపల్లి శ్రీను,కక్కిరాల మురళి, కోరుకొండ శ్రీనివాస్, గద్దె సుబ్రమణ్యం నియమించినట్లు ఎమ్మెల్యే బాలరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ అమ్మవారి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిసమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## పరమేశ్వరి ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు పాల్గొన్న ఎమ్మెల్యే రోషన్ కుమార్...



లింగపాలెం జనవరి 31 ప్రభాతవార్త.... మాత విశిష్టత చాలా ప్రశస్తం మైనదని ఎమ్మెల్యే రోషన్ కుమార్ పేర్కొన్నారు. అంతకుముందు లింగపాలెం మండలం ధర్మాజీగూడెం లో వాసవి కన్యక పరమేశ్వరిఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు శాసనసభ్యులు రోషన్ కుమార్ ను పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వైశ్యులు పాల్గొన్నారు.

# ఘనంగావాసవి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం

### అమ్మవారి గ్రామోత్సవంలో కోలాట భజనలు



ఆగిరిపల్లి జనవరి 31 ప్రభాతవార్త :ఆర్యవైశ్య సంఘం ,యువజన సంఘం, వాసవిమహిళా మండలి ఆధ్వర్యంలో వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. నూతన పంచలోహ వాసవి మాత విగ్రహానికి సంప్రోక్షణ, పంచామృత ఫ లాభిషేక ము ,పుణ్యాహవచనం, అలంకరణ, అనంతరం వాసవి మాత గ్రామోత్సవం నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళలచే కోలాట భజనలు, కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆట పాటలతో 102 కలిశాలతో సామూహిక గ్రామోత్సవం, 102 కలిశాలతో అమ్మవారికి అభిషేకం, అలంకరణ ముత్తయిదువలచే సామూహిక కుంకుమ పూజ, అమ్మవారికి సారే సమర్పణ అన్న ప్రసాద వితరణ జరిగింది. ఈ పూజా కార్యక్రమాలు మండల సంఘం అధ్యక్షుడు చలవాది వెంకటరత్నం, మండల యువజన సంఘం అధ్యక్షుడు మడిపల్లి రుక్విత్, వాసవి మహిళా మండలి సభ్యులు చలువాది శైలజ కుమారి ఎండూరు భవానీల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైశ్య ప్రముఖులు మడుపల్లి గోపాలకృష్ణ, మడుపల్లి శివరామమూర్తి, ఎండూరు ప్రణీత్, ఎన్టీఆర్ జిల్లా వైశ్య సంఘ కార్యదర్శి నాల చిన్న సత్యంబాబు, ఎండూరు సుధీర్, చంద్రశేఖర రావు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా పెనుగొండ శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారి దేవాలయం విచ్చేసిన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నీ కలిసిన నరసాపురం మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు. ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీ వాసవీ అమ్మవారిని దర్శించుకుని, అమ్మవారికి ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు సమర్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఆర్యవైశ్యుల ఇలవేల్పు వాసవీ మాత- స్త్రీల ఆత్మగౌరవాన్ని చాటిన కలియుగ పార్వతీదేవి వాసవీమాత అని అన్నారు. అహింస, ఆత్మత్యాగానికి, శాంతికి ప్రతిరూపం వాసవీమాత అని అన్నారు. అమ్మను వేడుకుంటే శాంతి, సంపద, రక్షణ, ఆశీస్సులు మెండుగా లభిస్తాయని అన్నారు. వాసవీమాతకు దేశం మొత్తం ఆలయాలు ఉన్నాయని అన్నారు. ప్రభాతవార్త నరసాపురం

## పది లీటర్ల సారా స్వాధీనం వ్యక్తి అరెస్ట్



చాట్రాయి, జనవరి 31, ప్రభాతవార్త చాట్రాయి మండలం పోతనపల్లి చిన్న తండా లో జరిపిన దాడులలో బాణావతు బాలును అదుపులోనికి తీసుకొని అతని వద్ద నుండి 10 లీటర్ల నాటు సారా ని స్వాదిన పరచుకొని రవాణా చేస్తున్న హీరో బైక్ ను స్వాదిన పరచుకొని నాటు సారాయి తయారికి సిద్ధముగా ఉంచిన 50 లీటర్ల బెల్లపు ఊటను ద్వంసం చేసి కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఏ.మస్తానయ్య తెలిపినారు. ఈ దాడులలో నూజివీడు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ వై. ఈశ్వర రావు గారు, యం. ప్రసాద్ , మరియు సిబ్బంది పాల్గొన్నారు

# వైభవంగా హనుమంత వాహన ఉత్సవము



ఆగిరిపల్లి జనవరి 31 ప్రభాతవార్త: శ్రీ శోభనాచల వ్యాగ్ర లక్ష్మీ నరసింహ స్వామి శాంతి కళ్యాణం శుక్రవారం ఉదయం శ్రీ లక్ష్మీనరసింహ జువెలరీ మార్ట్ ఆగిరిపల్లి వారి సహకారంతో నిర్వహించారు. సాయంత్రం హనుమంత వాహనోత్సవం, నిత్య కళ్యాణంలు ఆగిరిపల్లి గౌడ సంఘం వారి సహకారంతోవైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమములు ఆలయ కార్య నిర్వహణ అధికారి సిహెచ్ సాయి పర్యవేక్షణలో ఆలయ అర్చకులు వేయాంతం శేషుబాబు రామ అనంతకృష్ణులు లీలా మనోహర్ లు నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# వాసవి అమ్మవారి ఆత్మార్పణ



కొయ్యలగూడెం జనవరి 31 ప్రభాతవార్త : కూటమి ప్రభుత్వం వాసవి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారికంగా ప్రకటించినందుకు. కొయ్యలగూడెం పట్టణ ఆర్యవైశ్య సంఘాలు సంతోషం వ్యక్తం చేశాయి. ప్రముఖ ఆర్యవైశ్యులందరూ ఎన్డీఏ కూటమికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఓటమి ప్రభుత్వం ఏర్పడిన అతి తక్కువ కాలంలో సంక్షేమ అభివృద్ధి తో రాష్ట్రం ఉరకల వేస్తుందని కొనియాడారు.. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహాసభ కోశాధికారి వెత్సా పంగిడి గారు,పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మాటూరు సుధీర్ గారు మరియు మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు చిరువురిశీను గారు అలాగే వాసవిఅమ్మవారి ఆలయకమిటీ చైర్మన్ బొమ్మ బాబు గారు మరియు కొల్లూరు వాసు ప్రముఖ వ్యాపారస్తులు కొల్లూరు సత్తిబాబు గారు, కొల్లూరు గెరటయ్య గారు ,కొల్లూరు నగేష్ గారు మరియు కొల్లూరు శీను గారు రమేష్ గారు ప్రముఖులు ఆనందం వ్యక్తం చేశారు.

## శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం

చింతలపూడి... ప్రభాత వార్త : చింతలపూడి పట్టణంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం కార్యక్రమం నకు శాసన సభ్యులు ముఖ్య అతిధిగా హాజరై పూజా కార్యక్రమాలు నిర్వహించారు,శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ రోజును రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు ను ప్రత్యేక దినోత్సవం ప్రకటించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్యవైశ్య సంఘం తరపున కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమం లో శాసన సభ్యులు మాట్లాడుతూ ఈ కార్యక్రమం లో తనను భాగస్వామి నీ చేసినందుకు శాసనసభ్యులు కృతజ్ఞతలు తెలియ చేశారు , అమ్మవారి త్యాగం గురించి ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు ఆర్య వైశ్యులు ఐకమత్యం గా ఉంటూ సమాజానికి సేవా చేస్తుండటం గర్వించదగ్గ విషయం, పార్టీ కి మీరూ చేసే సేవలు గుర్తించతగినవి అని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు జల్లిపల్లి శివాజీ, చిట్లూరి ధర్మరాజు, చుండూరు అబ్బయ్య తదితరులు పాల్గొన్నారు ఈ కార్యక్రమం లో ఆర్య వైశ్య సంఘం వారు కూటమి నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఏలూరు నియోజకవర్గ రోడ్లు డ్రైనేజీలు అభివృద్ధికి 15 కోట్ల భారీ నిధులు



ఏలూరు టౌన్, **జనవరి 31,ప్రభాత వార్త** : ఏలూరు నియోజకవర్గాభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించి, రోడ్లు, డ్రైన్ల అభివృద్ధికి 15 కోట్ల రూపాయల భారీ నిధులు ఖర్చుచేస్తున్నట్లు ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పేర్కొన్నారు. ఏలూరు 1టౌన్‌లోని బిర్లా భవన్ సెంటర్ నుండి గడియార స్థంభం కూడలి వరకూ 65లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న రహదారి నిర్మాణ పనులను ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, నగర మేయర్ షేక్ నూర్జహాన్‌లు పరిశీలించారు. పూర్తిస్థాయి నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ రహదారి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్‌ను ఎమ్మెల్యే చంటి ఆదేశించారు. ఇదేక్రమంలో ఎక్కడా ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులకు ప్రత్యేకంగా సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురై ప్రమాదకారకంగా తయారై అధ్వాన్నస్థితిలో ఉన్న రహదారుల అభివృద్ధి విషయంలో తొలినుండి కూటమి ప్రభుత్వానిది ఒకటే స్వరమని, అవే మాటలను అధికారంలోకి వచ్చిన తర్వాత చేతల్లో చేసి చూపుతున్నామన్నారు. దీనిలో భాగంగానే ఏలూరు నియోజకవర్గ వ్యాప్తంగా రహదారుల గుంతలు పూడ్చేందుకు, అవసరమైన ప్రాంతాల్లో నూతనంగా రోడ్లను నిర్మించేందుకు ప్రత్యేక ప్రణాళికలతో ముందుకెళ్తున్నామన్నారు. ప్రజా అవసరాలను స్వయంగా తెలుసుకునేందుకే నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నానన్న ఆయన దశలవారీగా అన్ని సమస్యలకూ పరిష్కారాలు చూపుతానన్నారు. 15 కోట్ల రూపాయల భారీ నిధులతో నియోజకవర్గంలోని రోడ్లు, డ్రైన్ల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించినట్లు స్పష్టం చేశారు. బిర్లా భవన్ సెంటర్ నుండి నిర్మిస్తున్న ఈ రహదారి నిర్మాణాన్ని రెండురోజుల్లో పూర్తిచేయాలని కాంట్రాక్టర్ రవిచంద్రకు ఎమ్మెల్యే బడేటి చంటి సూచించారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్ మాట్లాడుతూ ప్రజలకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను శరవేగంగా అమలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే కోట్లాది రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామన్న మేయర్ భవిష్యత్తులో కూడా అదేస్థాయిలో ఎమ్మెల్యే చంటి సహకారంతో నియోజకవర్గాభివృద్ధిని పరుగులు పెట్టించనున్నట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ ఎంఈ సురేంద్రబాబు, డిఈ రజాక్, ఏఈ సాయి, కో - ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, ఎస్సెమ్మార్ పెదబాబు, కార్పొరేటర్లు వంకదారు ప్రవీణ్, సబ్బన శ్రీనివాసరావు, కర్రి శ్రీనివాసరావు, దేవరకొండ శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ మారం అను, లింగిశెట్టి శశికుమార్, తవ్వా అరుణ కుమారి, ఒబిలిశెట్టి శ్రావణ్ కుమార్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# మార్చి 8 న లో లోక్ అదాలత్



ప్రభాతవార్త నరసాపురం :రాష్ట్ర మరియు ఉమ్మడి గోదావరి జిల్లాల న్యాయ స్థానాల ఆదేశాల మేరకు మార్చి నెల 8వ తారీకున నర్సాపురంలోని అన్ని కోర్ట్ సముదాయాలలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు నర్సాపురం 10వ అధనపు జిల్లా న్యాయమూర్తి శ్రీమతి పి . విజయ దుర్గ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కోర్టులలో ఉన్న రాజీపడతగిన అన్ని క్రిమినల్ కేసులు , కుటుంబ తగాదాలు, సివిల్ భూ తగాదాలు, చెక్ బౌన్స్ కేసులు, మోటారు వాహన ప్రమాద నష్ట పరిహార కేసులు , ఎక్సైజ్ కేసులు మొదలగునవి రాజీ చేసుకోవచ్చును. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొనుటకు వారి వారి న్యాయవాదుల ద్వారా గాని, సంభందిత పోలీసు వారిని లేదా కోర్ట్ ప్రంగంలో వున్న న్యాయ సేవాదికారా సంస్థ ను గానీ సంప్రదించవచ్చునని తెలిపారు. ఆయా బ్యాంక్ లు, బి.ఎస్. ఎన్.ఎల్ కు సంభందించిన కేసులు కూడా ప్రి లిటిగేషన్ కేసుల క్రింద సెటిల్ చేసుకోవచ్చును .వర్చువల్ గా కూడా కేసులు రాజీ చేసుకొనే వెసులుబాటును ఉన్నత న్యాయస్థానాలు కల్పించినట్లు న్యాయమూర్తి పి. విజయ దుర్గ పత్రికలకు తెలిపారు.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.

# కొత్త కరెన్సీని తెస్తే 100% సుంకాలు తప్పవు

## బ్రిక్స్ కూటమికి యుఎస్ అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరికలు

**న్యూఢిల్లీ, జనవరి 31:** డాలర్ కరెన్సీ రూపేణా బ్రిక్స్‌దేశాల్లో కొత్తకరెన్సీని అమలుకు తెస్తే అమెరికా సుంకాలు తప్పవని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. నూరుశాతం వారి ఎగుమతులపై సుంకాలు వేస్తామని అంతర్జాతీయ ట్రేడ్‌లో డాలర్‌కు ప్రత్యామ్నాయంగా కరెన్సీని తీసుకొస్తే సుంకాలు తప్పవని స్పష్టం చేసారు. అంతర్జాతీయంగా డాలర్ వినియోగాన్ని తగ్గించాలని చూస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని, బ్రిక్స్ దేశాలు ప్రపంచ వాణిజ్యంలో అమెరికా డాలర్ స్థాయిని పరిగణన లోనికి తీసుకోవాలని లేదంటే ఆర్థిక పరిణామాలను ఎదుర్కొనాల్సి ఉంటుందని హెచ్చరించారు. డాలం రూపేణా వాణిజ్య లావాదేవీల నుంచి వైదొలగాలని బ్రిక్స్ దేశాలుచూస్తున్నాయని ఇప్పటికేమేం నిశితంగా గమనిస్తున్నామని ట్రంప్ తన ట్రూత్ సోషల్‌మీడియాలో ప్రకటించారు. బ్రిక్స్‌దేశాలు కొత్తగా కరెన్సీని తీసుకురాబోమని, లేదా మరో కరెన్సీని డాలర్‌కు ప్రత్యామ్నాయంగా అమలుకు తీసుకురాబోమని లిఖితపూర్వకంగా తెలియజేయాలని లేదా బ్రిక్స్ దేశాలు సంయుక్తంగా ప్రకటించాలని సూచించారు. అలాంటి ప్రయత్నాలే ఈ దేశాల కూటమి చేస్తే ట్యారిఫ్‌కు హలో చెప్పాల్సిందేనని, అమెరికాకు గుడ్‌బై చెప్పాల్సి ఉంటుందని వెల్లడించారు. బ్రిక్స్ కూటమిలో బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా దేశాలున్న సంగతి తెలిసిందే. డాలర్‌పై ఆధారపడటం రానురాను తగ్గించాలని ఈ దేశాలకూటమి అనేక సమావేశాల్లో చర్చించింది. పాశ్చాత్యదేశాల ఆంక్షలు పెరుగుతున్న కొద్దీ తమ దేశాలు డాలర్‌పై ఆధారపడటం ఎందుకని ప్రశ్నిస్తున్నాయి. ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్ర కాలం నుంచి అమెరికా రష్యాపై మరిన్ని ఆంక్షలు ప్రకటించింది. ఇటీవలి కాలంలోనే బ్రిక్స్ కూటమి విస్తరించింది. ఈజిప్టు, ఇథియోపియా, ఇండోనేసియా, ఇరాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాలను కూటమిలోకి ఆహ్వానించింది. వాస్తవానికి బ్రిక్స్‌ప్లస్ కూటమికి



ఒకే కరెన్సీ అంటూ ఏదీలేదు. వారివారి స్థానిక కరెన్సీల్లోనే ఈ దేశాలు వాణిజ్యం చేస్తున్నాయి. 2023లో జరిగిన 15వ బ్రిక్స్ సదస్సులో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ డాలర్‌పై ఆధారపడటం తగ్గించాలని బ్రిక్స్ దేశాలు తమతమ దేశాల కరెన్సీల్లోనే లావాదేవీలు చేసే విధానం అమలుకు తీసుకురావాలని, ఇందుకోసం ఆదేశాల సెంట్రల్ బ్యాంకులు నుంచి సహకారం అవసరమని రష్యా అధ్యక్షుడు ప్రకటించారు. ఇప్పటికీ డాలర్ ప్రపంచంలోనే అత్యంత చెలామణీలో ఉన్న కరెన్సీగా సాగుతోంది. అట్లాంటిక్ మండలి జియో ఎకనమిక్ సెంటర్ గత ఏడాది తన అధ్యయనంలో యూరోపియన్ కరెన్సీ యూరో కానీ, బ్రిక్స్‌ప్లస్ దేశాలు డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించే ప్రయత్నాలుచేస్తున్నాయని ప్రస్తావించింది. ఇపుడు ట్రంప్ అధికారంలోకి వచ్చినతర్వాత డాలర్‌కరెన్సీ వాడకం తగ్గించాలని చూస్తే 100శాతం సుంకాలు తప్పవని హెచ్చరిస్తున్నారు. ఈ సుంకాలు అధికంగా వినియోగిస్తే అక్రమ వలసలు, డ్రగ్స్ అక్రమరవాణా, ప్రత్యేకించి అమెరికాలోకి ఫెంటానిల్ రాకను కట్టడిచేయగలమని చెపుతున్నారు. అయితే సుంకాలు పెంచడంవల్ల అమెరికా వినియోగదారులు, వ్యాపార సంస్థలకు వ్యాపారం దెబ్బతింటుందని పరిశ్రమలు ఎక్కువగా దిగుమతి ఉత్పత్తులపైనే ఆధారపడతాయని ఆర్థికవేత్తలు వాదిస్తున్నారు.

## నియంతలపై ప్రేమ లేదు

### అమెరికా కొత్త ఇంటెలిజెన్స్ అధికారి తులసీ గబ్బార్డ్



**వాషింగ్టన్, జనవరి 31:** తనకు నియంతలపై ఎలాంటి ప్రేమ లేదని యుఎస్ నూతన ఇంటెలిజెన్స్ అధికారి తులసీ గబ్బార్డ్ పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ఆమెను నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్‌గా ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఆ పదవీబాధ్యతలు చేపట్టబోయే ముందు తులసి యుఎస్ సెనేటర్ల ఎదుట హాజరయ్యారు. డెమొక్రట్లు, రిపబ్లికన్ల నుంచి ఎదురైన ఎన్నో కఠిన ప్రశ్నలకు ఆమె సమాధానాలిచ్చారు. ఇందులో భాగంగా మాట్లాడుతూ అసద్, గడాఫీ, మరే ఏ ఇతర నియంతలపైనా తనకు ప్రేమ లేదని, అల్‌ఖైదాను ద్వేషిస్తానని వెల్లడించారు. అసద్ తన సొంత ప్రజలపైనే రసాయన ఆయుధాలను వినియోగించిన ఘటనను తులసి ఖండించారు. ఉగ్రవాదాన్ని, దానిని ప్రోత్సహించే నేతలను తాను ఏమాత్రం ఉపేక్షించనని పేర్కొన్నారు. డిఎన్ఐ డైరెక్టర్‌గా అమెరికా ప్రజల భద్రత, స్వేచ్ఛను కాపాడడానికి, సైన్యాన్ని మరింతపటిష్టం చేయడానికి తనవంతు కృషి చేస్తానని వెల్లడించారు. అమెరికాలోని మొత్తం 18 నిఘా సంస్థలు డిఎన్ఐ హోదాలో ఉన్న తులసి పర్యవేక్షణలో పనిచేస్తాయి. ప్రపంచంలో ఏ మారుమూల ఏం జరిగినా ఇవిసేకరిస్తాయి. చివరికి సిఐఎ అధిపతి కూడా ఆమెకు రిపోర్టుచేస్తారు. నిఘా సమాచారాన్ని క్రోడీకరించి రోజువారీ కీలక విషయాలను ఆమె అధ్యక్షుడికి వెల్లడిస్తారు. 9/11 దాడుల తర్వాత ఏర్పడిన కమిషన్ సూచనల మేరకు ఏర్పాటు చేసిన అత్యంత కీలక పదవి ఇది. 2019లో డెమొక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం పోటీపడ్డారు. కానీ, ఆ తర్వాత బైడెన్‌కు మద్దతు పలికారు. నాడు హిల్లరీ క్లింటన్ ఆమెను ఏకంగా రష్యా ఏజెంట్ అంటూ విమర్శలు గుప్పించారు. దీనికి తులసి స్పందిస్తూ.. 'యుద్ధోన్మాదుల అవినీతి స్వరూపంగా' హిల్లరీని అభివర్ణించడం సంచలనం రేపింది. 2024 పోలింగ్‌కు కొన్ని వారాల ముందు రిపబ్లికన్ పార్టీ చేరారు. యుద్ధాలను వ్యతిరేకించే ట్రంప్ తన భావాలకు దగ్గరగా ఉండటంతో చేరినట్లు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో కూడా దూకుడుగా రిపబ్లికన్ల విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లారు. కమలతో చర్చా కార్యక్రమంలో ట్రంప్‌నకు చేదోడువాదోడుగా వ్యవహరించారు. తనపై దాడికి ఇంటెలిజెన్స్ వైఫల్యమే కారణమని ట్రంప్ బలంగా విశ్వసించారు. అందుకే తులసికి ఆ విభాగాన్ని అప్పజెప్పారు.

## మాలిలోని బంగారు గనిలో విరిగిపడిన కొండచరియలు 10 మంది దుర్మరణం

**బమాకో, జనవరి 31:** పశ్చిమ ఆఫ్రికాలోని మాలి దేశంలో ఘోర ప్రమాదం జరిగింది. బంగారు గనిలో కొండచరియలు విరిగిపడటంతో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. మరికొంతమంది ఆచూకీ ఇంకా తెలియరాలేదు. కౌలికోరో ప్రాంతంలోని బంగారు గనిలో బుధవారం ఈ ఘటన జరిగిందని అక్కడి గవర్నర్ కల్నల్ లామైన్ కపోరీ సనోగో పేర్కొన్నారు. 'గనిలో తవ్వకాలు చేస్తుండగా ఒక్కసారిగా కొండ చరియలు విరిగిపడ్డాయి. ఆ సమయంలో బంగారం వెతుకులాటకు వెళ్లినవారిలో 10 మంది మృత్యువాత పడ్డారు. ప్రాణాలు కోల్పోయిన వారిలో ఎక్కువమంది మహిళలే ఉన్నారు. గనిలోకి బురదనీరు ప్రవేశించి వారిని చుట్టుముట్టింది. మరికొంతమంది శిథిలాల కింద చిక్కుకొనిపోయారు. వారిని రక్షించేందుకు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది' అని గవర్నర్ వెల్లడించారు. ఆఫ్రికా దేశాల్లో మూడో అతిపెద్ద బంగారు ఉత్పత్తిదారుగా మాలి ఉంది. ఈ దేశంలో గనుల ప్రమాదాలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. గతేడాది సైతం ఇదే ప్రాంతంలోని కంగబా జిల్లాలో బంగారు గని కుప్పకూలింది. ఈ ఘటనలో 70 మందికిపైగా మృత్యువాత పడ్డారు.

## బానిసల పిల్లల కోసం ఆ పౌరసత్వం..

# ప్రపంచమంతా ఎగబడితే ఎలా?: ట్రంప్

**వాషింగ్టన్, జనవరి 31:** అమెరికా అధ్యక్ష పదవిలోకి వచ్చీ రాగానే డొనాల్డ్ ట్రంప్ పదులకొద్దీ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై సంతకాలు చేశారు. అందులో ఒకటి జన్మతఃపౌరసత్వం లభించే హక్కును రద్దు చేయడం..! ఇది కాస్తా వివాదాస్పదం కావడంతో న్యాయస్థానం ఆ ఉత్తర్వులను నిలిపివేసింది. ఈ క్రమంలోనే తాజాగా ట్రంప్ దీనిపై స్పందించారు. బానిసల పిల్లల కోసమే తొలినాళ్లలో జన్మతఃపౌరసత్వాన్ని తీసుకొచ్చారని వ్యాఖ్యానించారు.

'ఒకసారి గతాన్ని గుర్తు చేసుకుంటే బానిసల పిల్లలకు హక్కులు కల్పించాలనే ప్రాథమిక ఉద్దేశంతో జన్మతఃపౌరసత్వాన్ని అప్పట్లో ఆమోదించారు. అంతేకగానీ ప్రపంచ జనాభా మొత్తం వచ్చి అమెరికాలో పోగుపడటం కోసం ఆ చట్టాన్ని తీసుకురాలేదు. చాలామంది మన దేశానికి వస్తున్నారు. అర్హత లేని వ్యక్తులు ఈ చట్టాన్ని ఉపయోగించుకుంటున్నారు. దీంతో అర్హత లేని పిల్లలకు పౌరసత్వం లభిస్తోంది. ఈ చట్టం అందుకోసం కాదు. చాలా గొప్ప ఉద్దేశంతో బానిసల పిల్లల కోసం తీసుకొచ్చినది' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. దీనిపై తాను సుప్రీంకోర్టుకు వెళ్తానని చెప్పారు. అక్కడ తమకు అనుకూలంగా తీర్పు వస్తుందని వంద శాతం విశ్వాసంతో ఉన్నట్లు పేర్కొన్నారు.

అమెరికా రాజ్యాంగంలో 14వ సవరణ ప్రకారం తల్లిదండ్రుల వలసస్థితితో సంబంధం లేకుండా అమెరికాలో జన్మించిన వారందరికీ పౌరసత్వం లభించే విధానం అమల్లో ఉంది. ట్రంప్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తొలిరోజునే జన్మతః పౌరసత్వం లభించే హక్కును రద్దు చేసేలా కార్యనిర్వాహక ఆదేశాలు జారీ చేశారు. దీనిపై డెమొక్రాట్లు అధికారంలో ఉన్న 22 రాష్ట్రాలు 5 దావాలు వేశాయి.

అందులో ఒక దానిపై ఇటీ వల సియాటిల్‌లోని ఫెడరల్ కోర్టు తీర్పు వెలు వరించింది. ట్రంప్ ఇచ్చిన ఆదేశాలు రాజ్యాంగ విరుద్ధమని దాన్ని తాత్కాలికంగా నిలిపి వేస్తు న్నట్లు న్యాయస్థానం స్పష్టం చేసింది.

## కిన్నెర అఖాడా నుంచి మమతా కుల్‌కర్ణి బహిష్కరణ

### ఇటీవలే దీక్ష తీసుకొన్న కుల్‌కర్ణి

**ప్రయాగ్‌రాజ్, జనవరి 31:** మహాకుంభమేళా ప్రారంభంలో ప్రాపంచిక జీవనాన్ని పరిత్యజించి, సన్యాసినిగా మారిన ప్రముఖ బాలీవుడ్ నటి మమతాకులకర్ణి (52), కిన్నర అఖాడా నుంచి బహిష్కరణకు గురయ్యారు. మహామండలేశ్వర్‌గా ఆమె తీసుకున్న దీక్షను రద్దు చేశారు. పలువురు మతపెద్దలు, అఖాడాల నుంచి వస్తున్న అభ్యంతరాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అఖాడాలు వెల్లడించారు. అంతే కాదు ఆమెను అఖాడాలో చేర్పించిన కిన్నెర అఖాడా ఆచార్య మహామండలేశ్వర్ డాక్టర్ లక్ష్మీనారాయణ్ త్రిపాఠిని సైతం అఖాడా నుంచి తొలగిస్తున్నట్లు తెలిపారు. కిన్నెర అఖాడాలో కులకర్ణి చేరిక తర్వాత అందులోని సభ్యుల మధ్య వివాదాలు చెలరేగాయి. అఖాడాలో చేరిన మొదట్లోనే ఆమె అత్యున్నత స్థానమైన మహామండేశ్వర్ హోదాను పొందడాన్ని పలువురు వ్యతిరేకించారు. మహా కుంభమేళా పవిత్రమైన ఆధ్యాత్మిక కార్యక్రమమని, కానీ కొందరు వ్యక్తులు ఇందులో అసభ్యతను ప్రోత్సహిస్తున్నారంటూ ప్రముఖ యోగా గురువు బాబా రామ్‌దేవ్ మండిపడ్డారు. ఇప్పటివరకు ప్రాపంచిక సుఖాల్లో మునిగిపోయిన వ్యక్తులు ఒక్కసారిగా సన్యాసులుగా మారిపోయి మహామండేశ్వర్ హోదాను పొందడాన్ని పలువురు వ్యతిరేకించారు. మహా కుంభమేళా పవిత్రమైన ఆధ్యాత్మిక కార్యక్రమమని, కానీ కొందరు వ్యక్తులు ఇందులో అసభ్యతను ప్రోత్సహిస్తున్నారంటూ ప్రముఖ యోగా గురువు బాబా రామ్‌దేవ్ మండిపడ్డారు. ఇప్పటివరకు ప్రాపంచిక సుఖాల్లో మునిగిపోయిన వ్యక్తులు ఒక్కసారిగా సన్యాసులుగా



మారిపోయి మహామండలేశ్వర్ వంటి బిరుదులను కూడా పొందుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే అఖాడా వ్యవస్థాపకులు అజయ్ దాస్, కులకర్ణి గురువు లక్ష్మీనారాయణ్ త్రిపాఠి మధ్య విభేదాలు తీవ్రమయ్యాయి. అజయ్‌దాస్ అఖాడా నుంచి బయటకు వెళ్లి, తన కుటుంబంతో నివసిస్తున్నారని, కిన్నెర అఖాడా నియమాల ప్రకారం కుటుంబంతో ఉన్నవారికి ఈ విషయంలో నిర్ణయం తీసుకునే అధికారం లేదని త్రిపాఠి పేర్కొన్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఆమెపై బహిష్కరణ వేటు వేసినట్లు తెలుస్తోంది. 90వ దశకంలో బాలీవుడ్‌లో మంచి క్రేజ్ సంపాదించుకున్న నటి మమతాకులకర్ణి 2003 తర్వాత సినిమాల నుంచి తప్పుకొని, విదేశాలకు వెళ్లిపోయారు. ఈ క్రమంలోనే డ్రగ్స్ రాకెట్‌లో ఆమె పేరు వినిపించింది. పోలీసులు నోటీసులు సైతం పంపారు. ఇన్నేళ్ల తర్వాత కుంభమేళ సందర్భంగా భారత్‌కు వచ్చిన ఆమె అందరినీ ఆశ్చర్యపరుస్తూ కిన్నెర అఖాడాలో చేరి తన పేరును 'మాయీ మమతానంద్ గిరి'గా మార్చుకున్న విషయం తెలిసిందే.

# రాష్ట్రపతి ఎంతో అలిసిపోయారు..

## సోనియా వ్యాఖ్యలపై బిజెపి, విపక్షాల మధ్య దుమారం

**న్యూఢిల్లీ, జనవరి 31:** పార్లమెంటు ఉభయసభలనుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేసిన ప్రసంగంపై సోనియా చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. రాష్ట్రపతి హోదాను విస్మరించి ప్రథమ మహిళను కించపరిచేటట్లు ఉన్నాయని, సోనియా రాహుల్, ప్రియాంక వంటి నాయకులకు ఇలాంటి వ్యాఖ్యలు తగదని బిజెపి నేతలు ధ్వజమెత్తారు. బడ్జెట్ సమావేశాలు ప్రారంభం రోజున శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించారు. సమావేశం తర్వాత బయటకు వచ్చిన సోనియాను మీడియా పలకరించింది. దీనితో ఆమె మాట్లాడుతూ ప్రసంగం చదువుతూ రాష్ట్రపతి బాగా అలిసిపోయారు. అందువల్లనే పూర్తి స్థాయిలో చదవలేకపోయారని పేర్కొన్నారు. ప్రసంగం ఆసాంతం స్పష్టంగా చదవలేకపోయారని సోనియా అన్నారు. దీనితో ఒక్కసారిగా బిజెపి సభ్యులు ధ్వజమెత్తారు. అభ్యంతరకర వ్యాఖ్యలని వెంటనే క్షమాపణలుచెప్పాలని డిమాండ్‌చేసారు. బిజెపి సభ్యుఉరాలు సుకాంత మజుందార్ మాట్లాడుతూ సోనియా వంటి నేతలు ఇలాంటి వ్యాఖ్యలు చేయకూడదని చెప్పారు. ఆదివాసి మహిళ నేడు రాష్ట్రపతిగా ఉన్నందున సామ్రాజ్యవాద స్ఫూర్తితో ఉన్న ఆ కుటుంబానికి నచ్చదని అందుకనే ఇలా అవమానకరంగా మాట్లాడుతున్నారరన్నారు. సోనియా వ్యాఖ్యలపై రాష్ట్రపతి భవన్‌నుంచి కూడా ప్రత్యేకప్రకటన వెలువడింది. ప్రసంగం ఆసాంతం రాష్ట్రపతి ఎక్కడా అలిసిపోలేదని మహిళలు, రైతులు, ఇతర అణగారిన వర్గాలపై ప్రసంగించేందుకు ఎక్కువ ఆసక్తి చూపించారన్నారు. దేశీయభాషల్లో సూక్తులు బహుశా ఈ నేతలకు తెలియకపోవచ్చని దీనివల్ల తప్పుడు ప్రభావం పడుతోందన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు దురదృష్టకరమని ఎంతమాత్రం ఆమోదనీయం కాదని రాష్ట్రపతి భవన్ ప్రకటన వెలువరించింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రముఖ నాయకులు చేసిన వ్యాఖ్యలు ఈ అత్యున్నత భవన్ హోదాను, హుందాతనాన్ని కించపరిచినట్లుందని ప్రకటనలో వివరించారు. సోనియా వ్యాఖ్యలపై బిజెపి చీఫ్ జెపి నడ్డా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసారు. ప్రసంగంలో చెప్పిందే చెపుతూ వచ్చారని ఎఐసిసి నాయకుడు రాహుల్ గాంధీకూడా వ్యాఖ్యలు చేసారు. పైగా సోనియా వ్యాఖ్యలపై రాహుల్ ఆమెకు మద్దతిచ్చారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ ఆదివాసీ మహిళ అయిన ముర్ము ఎంతమాత్రం తగ్గిపోరని దేశం కోసంఎంతో కృషి చేసారన్నారు.





## చిన్నారుల కోసం నిపుణ్ భారత్ ఇనీషియేటివ్

### ఆర్థిక సర్వేలో అనంత నాగేశ్వరన్ ప్రస్తావన

**న్యూఢిల్లీ, జనవరి 31:** కేంద్ర బడ్జెట్ నేడు ప్రవేశపెడుతున్న తరుణంలో ఆర్థికసర్వేను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టారు. భారత్ ఆర్థికపని తీరుతోపాటు భవిష్యత్తు పరిణామాలకు ఈ నివేదిక పునాదులు వేసింది. 2026లో మూడో తరగతి పూర్తి చేసుకునే ప్రతి చిన్నారికి సమగ్ర అక్షరాస్యత కల్పించేందుకు నిపుణ్ భారత్ ఇనీషియేటివ్‌ను ఈ సర్వే ప్రధానంగా చూపింది. ఈ కార్యాచరణతో చిన్నారులకు అవగాహన పెంచడం ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యలపై పూర్తి అవగాహన కల్పించేందుకు నిర్ణయించారు. విద్యా సవాళ్లను పరిష్కరించడం, దేశవ్యాప్తంగా అభ్యాసన నైపుణ్యాలను మెరుగుపరచడంలో ఈ నిర్ణయం కీలకం అవుతుందని అన్నారు. ఆర్థిక సర్వేలోపేర్కొన్న విధంగా బీహార్, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో విజయవంతమైన నిర్దిష్ట కార్యక్రమాలను సిఇఎ హైలైట్ చేసారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉండబోయే కొన్ని కీలకాంశాలు కింది విధంగా ఉంటాయని నిపుణులు అంచనావేస్తున్నారు. ఉపాధ్యాయులకు బేసిక్ నైపుణ్యాలను చిన్నారులకు అందించేందుకు సమగ్ర శిక్షణ ఇస్తారు. ప్రాథమిక దశనుంచే అక్షరాస్యత, సంఖ్యలపై నైపుణ్యత ప్రాధాన్యతను తెలిపే పాఠ్యప్రణాళికలు రూపొందించి అమలు చేయడం, పిల్లల అభ్యాసనకు మద్దతిచ్చేందుకు విద్యాప్రక్రియలో సమాజం, తల్లితండ్రులు భాగస్వాములను చేయడం, ఈ బేసిక్‌నైపుణ్యాల్లో విద్యార్థుల పురోగతిని పర్యవేక్షించేందుకు వాటిని అంచనావేయడానికి బలమైన వ్యవస్థలను ఏర్పాటుచేయడం వంటివి అవసరమని ఆర్థికసర్వేలో ప్రధాన ఆర్థికసలహాదారు అనంత నాగేశ్వరన్ ప్రస్తావించారు.

# ఎక్కువ పనిగంటలు ఆరోగ్యానికి హానికరం

### ఆర్థిక సర్వేలో ప్రస్తావన

**న్యూఢిల్లీ, జనవరి 31:** ఆఫీసు పనిగంటల చర్చ దేశవ్యాప్తంగా నడుస్తున్న తరుణంలో ఆర్థిక




మంత్రి నిర్మలా సీతారామన్‌ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పనిగంటల ప్రస్తావన వచ్చింది. వారానికి 60 గంటలకుమించి పనిచేయడంవల్ల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఆర్థిక సర్వే హెచ్చరించింది. వివిధ అధ్యయనాల నివేదికలను ఇందులో ప్రముఖంగా ప్రస్తావించింది. ఆర్థికసర్వే 2024-25 ప్రకారం ఆఫీసుల్లో ఎక్కువసేపు గడపడం వల్ల మానసిక శ్రేయస్సుకు మంచిదికాదని, రోజుకు 12, అంతకంటే ఎక్కువ గంటలు పనిచేసే వ్యక్తులు గణనీయమైన స్థాయిలో బాధ అనుభవిస్తున్నారు. వారానికి ఎక్కువ పనిచేయడం ఆరోగ్యానికి హానికరమని, ప్రపంచ ఆరోగ్యసంస్థ అంతర్జాతీయ కార్మికసంస్థ అధ్యయనాల నివేదికలు కూడా ఈ అంశాన్ని స్పష్టంచేసాయని ఆర్థికసర్వేలోప్రస్తావించారు. అనధికారికంగా ఎక్కువ పనిగంటలతో ఉత్పాదకత పెరిగినా వారానిఇకి 55-60 గంటలమధ్య పనిచేయడం ఆరోగ్యాన్ని దెబ్బతీయడమేనని ప్రపంచ ఆరోగ్య సంస్థ, అంతర్జాతీయ కార్మిక సంస్థలు సంయుక్త నివేదికల్లో ఉటంకించినట్లు ఆర్థికసర్వే ప్రస్తావించింది. ఒకేదగ్గర ఎక్కువ పనిగంటలు చేయడంవలన మానసిక ఆరోగ్యాన్ని క్షీణింపచేస్తుందని సపెయినలాబ్స్ సెంటర్ హ్యూమన్ బ్రెయిన్ అండ్ మైండ్ స్టడీ రిపోర్టును ఎకనమిక్ సర్వే హైలైట్‌చేస్తూ ప్రస్తావించింది. పనిగంటలపై పరిమితులు విధించి ఆర్థికవృద్ధికి అవాంతరం కలిగించవచ్చని సర్వే అంచనా వేసింది. కార్మికుల సంపాదన సామర్థ్యాన్ని దెబ్బతీసే అవకాశం లేకపోలేదని తెలిపింది. సౌకర్యవంతమైన పనిగంటల విధానం భారత దేశాన్ని ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా ఉంచుతుందని ఈ చర్యలతో చిన్న మధ్య తరహా పరిశ్రమల వృద్ధికి తోడ్పడుతుందని ఆర్థికసర్వే సూచించింది.

## పార్లమెంటు ఉభయసభలు నేటికి వాయిదా



**న్యూఢిల్లీ, జనవరి 31:** పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ప్రారంభం రోజున రాష్ట్రపతి ప్రసంగం అనంతరం ఉభయసభలు శనివారానికి వాయిదాపడ్డాయి. పార్లమెంటులో రాష్ట్రపతి ఉభయ సభలనుద్దేశించి తొలిరోజు ప్రసంగించారు. అనంతరం కేంద్ర బడ్జెట్‌కు ముందు ప్రతి ఏటా ప్రవేశపెట్టే ఆర్థిక సర్వేను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌సభలో ప్రవేశపెట్టారు. ఆ తర్వాత సభను శనివారానికి వాయిదా వేస్తున్నటు స్పీకర్‌ఓంబిర్లా ప్రకటించారు. ఆ తర్వాత ఆర్థిక మంత్రి ఆర్థికసర్వేను రాజ్యసభముందుకు తీసుకెళ్లారు. రాజ్యసభల ప్రవేశపెట్టిన తర్వాత ఛైర్మన్ ఉపరాష్ట్రపతి జగదీప్‌ధన్‌కర్ సభను శనివారానికి వాయిదా వేసారు. దీనితో పార్లమెంటు ఉభయసభలు శనివారం ఉదయం 11 గంటలకు ప్రారంభం అవుతాయి. అదేరోజు ఆర్థికమంత్రి 2025-26 సంవత్సర బడ్జెట్‌ను లోక్‌సభలో ప్రవేశపెడతారు. బడ్జెట్ సమావేశాలు శుక్రవారంనుంచి ప్రారంభం అయిన సంగతి తెలిసిందే. ఏప్రిల్ 4వరకూ రెండు విడతల్లో బడ్జెట్ సమావేశాలు జరుగతాయి. మొదటి విడత సమావేశాలు ఫిబ్రవరి 13వ తేదీతోముగుస్తాయి. తర్వాత మార్చి 10వ తేదీ ప్రారంభం అయి ఏప్రిల్ 4 వరకూ కొనసాగుతాయి. ఈ సమావేశాల్లోనే 16 బిల్లులను ప్రవేశపెట్టాలని కేంద్రం భావిస్తోంది. వక్ఫ్‌సవరణ బిల్లు, బ్యాంకింగ్ చట్టాల సవరణ బిల్లు, రైల్వే సవరణబిల్లు, విపత్తునిర్వహణ బిల్లులతోపాటు వలస, విదేశీయుల బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెడుతోంది.

## అమెరికాలో వీసా గడువు తీరినా తిరిగి వెళ్లని భారతీయులు 7,000 మంది

### వెల్లడించిన సెంటర్ ఫర్ ఇమ్మిగ్రేషన్ స్టడీస్!

**వాషింగ్టన్, జనవరి 31:** భారత్ నుంచి అమెరికాకు విద్యార్థులుగా, ఎక్స్ఛేంజి విజిటర్స్‌గా వచ్చి 2023లో వీసా గడువు తీరినా వెనక్కి తిరిగి వెళ్లని భారతీయులు 7,000మంది ఉన్నారని సెంటర్ ఫర్ ఇమ్మిగ్రేషన్ స్టడీస్ వెల్లడించింది. వీరితో పాటు దాదాపు 32 దేశాల విద్యార్థులు, ఎక్ఛేంజి విజిటర్స్‌లో 20 శాతానికిపైగా గడువు తీరినా అమెరికాను వదిలిపెట్టలేదంలేదని పేర్కొంది. ఎఫ్,ఎం కేటగిరీల్లో ఈ సమస్య అధికంగా ఉందని వివరించింది. ఈ నేపథ్యంలో వలస చట్టాల్లో, హెచ్1బి వీసా విధానాల్లో సంస్కరణలు అవసరమని అమెరికా చట్టసభ కమిటీ సభ్యులకు సూచించింది. హెచ్1బి వీసాలు 75లోపే ఉండాలని సిఫార్సుచేసింది. అమెరికాలో ఇమిగ్రేషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పునరుద్ధరణ పై సిఐఎస్ ప్రతినిధి జెస్సికా ఎం వాన్ సభా కమిటీకి వివరాలను వెల్లడించారు. అమెరికాలోని పాఠశాలలు, కళాశాలలు, విశ్వ




విద్యాలయాలలో చదువుకోవడానికి, భాషా శిక్షణకు ఎఫ్1 వీసాలిస్తారు. వృత్తి విద్యలో శిక్షణకు, విద్యేతర శిక్షణకు, విద్యేతర కార్యక్రమాల్లో పాల్గొనేందుకు, భాషేతర అంశాల్లో శిక్షణ పొందేందుకు ఎం1 వీసాలను అందచేస్తారు. భారత్, చైనా, బ్రెజిల్, కొలంబియాల నుంచి వచ్చిన వారిలో ఒక్కోదేశం నుంచి 2,000 మందికిపైగా 2023లో వీసా గడువు తీరినా అమెరికాలోనే ఉంటున్నారు. ఇందులో భారత్ నుంచి వచ్చిన వారే అత్యధికంగా 7,000 మంది ఉన్నారు. చదువు అయిపోగానే విద్యార్థి స్వదేశానికి తిరిగివెళ్లేలా అంగీకరించే విధానం ఉండాలి అని జెస్సికా సూచించారు.

# భక్తులరద్దీతో కొన్ని ఘాట్లలో గంగాహారతి నిలిపివేత



**మహాకుంభ్‌నగర్, జనవరి 31:** ప్రయాగరాజ్‌లో అత్యంత వైభవంగా జరుగుతున్న మహాకుంభమేళాకు భక్తులు భారీసంఖ్యలో వెల్లువలా వస్తున్నారు. రద్దీదృష్ట్యా కొన్నిరోజులపాటు ఘాట్‌లవద్ద గంగా హారతిని నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. జనం రద్దీని దృష్టిలో ఉంచుకుని ఫిబ్రవరి 5వరకూ వారణాసిలోని దశాశ్వమేధ్, శీత్లా, అస్సీ తదితర ఘాట్‌లలో నిర్వహించే గంగా హారతిని నిలిపివేస్తున్నట్లు, స్థానిక ప్రజలు అవసరం అయితే తప్ప ఇళ్లనుంచి బయటికి రావద్దని పోలీస్ కమిషనర్ మోహిత్ అగర్వాల్ విజ్ఞప్తిచేసారు. ఘాట్‌లవద్ద ప్రమాదాలు జరగకుండా నిరోధించేందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రయాగరాజ్‌కు వచ్చిన భక్తులు వారణాసికి పెద్దసంఖ్యలో వస్తుండటంతో కొందరుప్రయాణీకులు వారణాసి, బనారస్ రైల్వేస్టేషన్లలో చిక్కుకుపోయినట్లు అధికారులు వెల్లడించారు. దీనితో ఆయా ప్రాంతాల్లో ఎలాంటి సంఘటనలు తలెత్తకుండా భద్రతా బలగాలు నిరంతరం గస్తీ తిరుగు తున్నాయని తెలిపారుమౌని అమావాస్యనుంచి కాశీలో భక్తులరద్దీపెరిగిందని, వారి సంఖ్య తగ్గేవరకూ ఇతరులు ఎవరూ వారణాసికి రావద్దని విజ్ఞప్తిచేసారు. మహాకుంభమేళాలో మౌని అమావాస్యసందర్భంగా జరిగిన తొక్కిస లాటలో 30మంది చనిపోయిన నేపథ్యంలో యుపి ప్రభుత్వం రద్దీనియంత్రణకు కీలకనిర్ణ యాలు చేపట్టింది. కుంభమేళా ప్రాంతాలకు వాహనాల రాకపోకలు నిషేధించారు. వివిఐపి, స్పెషల్‌పాస్‌లు రద్దుచేసారు. ప్రయాగ రాజ్‌కు పొరుగున ఉన్న జిల్లాలనుంచి వచ్చే వాహ నాలను సరిహద్దులవద్దనే నిలిపివేయాలని చెప్పారు. భక్తుల సౌకర్యం కోసం వన్వే ట్రాఫిక్ వ్యవస్థను అమలుకు తెచ్చారు. ఇప్పటివరకూ 29.64 కోట్ల మందిభక్తులు కుంభమేళాలో పవిత్ర స్నానాలు చేసినట్లు యుపి ప్రభుత్వం ప్రకటించింది.

## జయలలిత ఆస్తులు ప్రభుత్వానికి అప్పగింత..

**చెన్నై, జనవరి 31:** దివంగత ముఖ్యమంత్రి జె. జయలలిత ఆస్తిని తమిళనాడు ప్రభుత్వానికి అప్పగించేందుకు బెంగళూరులోని ప్రత్యేక న్యాయస్థానం చర్యలు చేపట్టింది. ఫిబ్రవరి 14, 15వ తేదీల్లో వాటిని అప్పగించాలని ప్రత్యేక న్యాయస్థానంలో హెచ్.ఎ.మోహన్ అధికారులను ఆదేశించారు. జయలలితకు చెందిన 1,562ఎకరాల భూమికి సంబంధించిన పత్రాలు, 27కిలోల బంగారు, వజ్రా భరణాలు, పదివేలకు పైగా చీరలు, 750కి పైగా జతల చెప్పులు, గడియారాలు, ఇతర వస్తు వులను కర్ణాటక ప్రభుత్వం అప్పగించనుంది. ఈ ఆస్తులు, వస్తువులు తమకు చెందాలంటూ జయలలిత వారసులుగా చెబుతున్న జె.దీపక్, జె.దీప వేసుకున్న అర్జీని ఇటీవలే కర్ణాటక హైకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే.

# రంజీలోనూ స్టార్స్ ఫెయిల్


రోహిత్ శర్మ


రిషబ్ పంత్


శ్రేయస్ అయ్యర్


కెఎల్ రాహుల్


యయశ్వి జైస్వాల్

## రాణించ లేని ప్లేయర్లు

### దేశవాళీ పట్ల నో సీరియస్

**న్యూఢిల్లీ;** బిసిసిఐ అల్టిమేటం జారీ చేయడం వల్ల టీమ్ఇండియా స్టార్ ప్లేయర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, రిషభ్ పంత్, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, యశస్వీ జైస్వాల్, రవీంద్ర జడేజా, శుభమన్ గిల్ ఇటీవల రంజీ ట్రోఫీ బరిలో నిలిచారు. ఇటీవల కాలంలో సీనియర్లు రోహిత్, విరాట్ సహా కుర్రాళ్లు సైతం ఫామ్‌కోల్పోవడం వల్ల ఆటగాళ్లంతా దేశవాళీ టోర్నీల్లో కచ్చితంగా ఆడాలని నిబంధన పెట్టింది. ఈ క్రమంలో రోహిత్ సహా పలువురు ఇప్పటికే రంజీలో ఓ మ్యాచ్ ఆడేశారు. కోహ్లి, రాహుల్ గురువారం ఢిల్లీ తరఫున బరిలోకి దిగారు. అయితే ఇక్కడే అందరికీ ఓ ప్రశ్న తలెత్తుతోంది. రంజీలో ఆడాలని బిసిసిఐ నిబంధన మేరకు స్టార్ ప్లేయర్లంతా బరిలోకి దిగినా, ఈ టోర్నీకి వీళ్లిచ్చిన ప్రాధాన్యం ఎంత అనే ప్రశ్న తలెత్తుతోంది. వాళ్లు దీన్ని ఏమాత్రం సీరియస్‌గా తీసుకోలేదనేది ఫలితాలను బట్టి అర్థమవుతోంది. ఈ సీజన్‌లో వీళ్లంతా ఒక మ్యాచ్‌కే పరిమితం అవ్వడం, అందులోనూ పెద్దగా రాణించకపోవడం వల్ల దేశవాళీలో బరిలోకి దిగి ఏం లాభం అనే అభిప్రాయం తలెత్తుతోంది. రోహిత్, యశస్వి జైస్వాల్, శ్రేయస్ అయ్యర్ గత వారం జమ్ము కశ్మీర్‌తో రంజీ మ్యాచ్‌లో బరిలోకి దిగారు. కానీ, ఈ ముగ్గురూ పేలవ ప్రదర్శనే చేశారు. వరుసగా రెండు ఇన్నింగ్స్‌ల్లో రోహిత్ 3, 28, జైస్వాల్ 4, 26, శ్రేయస్ 11, 17 పరుగులకు పరిమితమయ్యారు. మరోవైపు ఢిల్లీ తరఫున ఆడిన రిషబ్ పంత్ సైతం రెండు ఇన్నింగ్స్‌ల్లో 1, 17 పరుగులే చేశాడు. పంజాబ్‌కు ప్రాతినిధ్యం వహించిన శుభ్‌మన్ గిల్ తొలి ఇన్నింగ్స్‌లో విఫలమైనా, రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీ సాధించాడు. ఇక జడేజా బౌలింగ్‌లో రాణించాడు. ఇక చానాళ్ల తర్వాత గురువారం రంజీ మ్యాచ్ బరిలోకి దిగిన రాహుల్ విఫలం అయ్యాడు. క్రీజులో సెటిల్ అయినట్లే కనిపించిన ఈ కర్నాటక బ్యాటర్ మంచి ప్రారంభాన్ని భారీ స్కోరుగా మలచలేకపోయాడు. హర్యానా, కర్నాటక జట్ల మధ్య జరిగిన ఈ మ్యాచ్‌లో రాహుల్ 37 బంతులు ఎదుర్కొన్నాడు. 4 ఫోర్ల సాయంతో 26 పరుగులు చేశాడు. అయితే ఎవరెలాంటి ప్రదర్శన చేశారన్నది పక్కన పెడితే, వీళ్లంతా ఈ సీజన్లో ఒక్క మ్యాచ్‌కే పరిమితం కావడం ఇప్పుడు చర్చనీయాంశం అవుతోంది. మరికొన్ని రోజుల్లో ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభం కానున్న నేపథ్యంలో, ఆ టోర్నీ ప్రాక్టీస్ శిబిరంలో పాల్గొనడం కోసం వీళ్లంతా తర్వాతి రంజీ మ్యాచ్‌కు దూరమైనట్లు చెబుతున్నారు.



## తొలి టెస్టులో పట్టుబిగిస్తున్న ఆస్ట్రేలియా

### 610 పరుగులు వెనుకబడిన శ్రీలంక

**న్యూఢిల్లీ;** శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో ఆస్ట్రేలియా పట్టు బిగిస్తోంది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక 15 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 44 పరుగులు చేసింది. దీంతో లంక ఇంకా ప్రత్యర్థి తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 610 పరుగులు వెనుకబడి ఉంది. గాలే వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో లంక బ్యాటర్లు ఒషాడోఫెర్నాండో (7), దిముత్ కరుణరత్నె (7), ఏంజెలో మాథ్యూస్ (7) అవుట్ కాగా, దినేశ్ చండీమల్ (9 బ్యాటింగ్), కమిందు మెండిస్ (13 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. అంతకు ముందు ఆస్ట్రేలియా 154 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 654 పరుగులు చేసి తమ తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. రెండో రోజు ఆటలో ఆసీస్ స్టార్ ప్లేయర్ ట్రావిస్ హెడ్ అద్భుతమైన క్యాచ్‌తో మెరిశాడు. స్టన్నింగ్ క్యాచ్‌తో శ్రీలంక వెటరన్ ఏంజెలో మాథ్యూస్‌ను హెడ్ పెవిలియన్‌కు పంపాడు. లంక ఇన్నింగ్స్ 10వ ఓవర్ వేసిన ఆసీస్ స్పిన్నర్ నాథన్ లియాన్ మూడోబంతిని మాథ్యూస్‌కు ఆఫ్ బ్రేక్ డెలివరీగా సంధించాడు. ఆ లూపీ డెలివరీని మాథ్యూస్ ఫ్రంట్ ఫుట్ డిఫెన్స్ ఆడేందుకు ప్రయత్నం చేశాడు. కానీ బంతి బ్యాట్ ఎడ్జ్ తీసుకుని షార్ట్-లెగ్ ఫీల్డర్ కుడివైపునకు వెళ్లింది. ఈ క్రమంలో అక్కడేఉన్న హెడ్ తన కుడివైపునకు లాంగ్‌డైవ్ చేస్తూ సింగిల్ హ్యాండ్‌తో క్యాచ్ అందుకోవడంతో మాథ్యూస్ (7) నిరాశతో మైదానాన్ని వీడాడు. కాగా ఈ మ్యాచ్‌లో ఆసీస్ బ్యాటర్లలో ఓపెనర్ ఉస్మాన్ ఖ్వాజా (352 బంతుల్లో 232 పరుగులు, 16 ఫోర్లు, 1సిక్స్) కెరీర్లో తొలి డబుల్ సెంచరీ నమోదు చేసుకోగా, అరంగ్రేట ఆటగాడు జోస్ ఇంగ్లిస్ (94 బంతుల్లో 102 పరుగులు, 10 ఫోర్లు, 1 సిక్స్), స్టీవ్ స్మిత్ (251 బంతుల్లో 141 పరుగులు, 12 ఫోర్లు, 2సిక్సులు) సెంచరీలతో మెరిశారు. ఇక ఆస్ట్రేలియా ఇప్పటికే వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు అర్హత సాధించింది.


శ్రీకాంత్


శంకర్

## థాయ్‌లాండ్ మాస్టర్స్ బ్యాడ్మింటన్‌లో..

### క్వార్టర్స్‌లోకి శ్రీకాంత్, శంకర్

**న్యూఢిల్లీ;** థాయ్‌లాండ్ మాస్టర్స్-300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పురుషుల సింగిల్స్ విభాగంలో భారత ప్లేయర్లు కిడాంబి శ్రీకాంత్, శంకర్ ముత్తుస్వామి సుబ్రమణియన్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. అలాగే ఇదే టోర్నమెంట్‌లో మహిళల సింగిల్స్ విభాగంలో రక్షిత శ్రీ రామరాజ్ క్వార్టర్ ఫైనల్ బెర్తును ఖరారు చేసుకుంది. బ్యాంకాక్‌లో జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో శ్రీకాంత్ 21-19, 21-15తో హాంకాంగ్‌కు చెందిన జేసన్ గుణవాన్‌పైన, అలాగే శంకర్ 9-21, 21-10, 21-17తో ఇండోనేసియాకు చెందిన చికో ద్వివర్ధోయోపైన, మహిళల సింగిల్స్ విభాగంలో రక్షిత శ్రీ 21-15, 21-12తో చైనీస్ తైపీకి చెందిన క్లా టాంగ్ టుంగ్‌పై గెలుపొందారు.

ఇక మిక్స్‌డ్ డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో భారత్‌కు చెందిన ప్లేయర్లు గద్దె రుతిక్వ శివాని-రోహన్ కపూర్ ద్వయం 19-21, 15-21తో థాయ్లాండ్‌కు చెందిన రచాపోల్- నాథమోన్ జంట చేతిలో ఓడిపోయింది.

## మహిళల అండర్ 19 వరల్డ్ కప్‌లో..

# టైటిల్ పోరుకు భారత్

- సెమీస్‌లో 9 వికెట్ల తేడాతో ఇంగ్లండ్ ఓటమి
- ఫిబ్రవరి 2న ఫైనల్ పోరు



**న్యూఢిల్లీ;** ఐసిసి మహిళల అండర్-19 టి20 ప్రపంచ కప్-2025 టోర్నమెంట్‌లో ఇంగ్లండ్‌పై జరిగిన సెమీఫైనల్ పోరులో భారత్ ఘన విజయం సాధించింది. కౌలాలంపూర్‌లోని బేయూమస్ ఓవల్ స్టేడియంలో శుక్రవారం జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ తన జోరు కొనసాగించింది. లీగ్ దశ, సూపర్ సిక్స్ దశల్లో సత్తా చాటుతూ జైత్రయాత్ర యాత్రను కొనసాగించిన భారత్ అమ్మాయిలు సెమీ ఫైనల్లోనూ అదరగొట్టారు. ఫలితంగా వరుసగా రెండోసారి భారత్ ఈ ఐసిసి టోర్నీ ఫైనల్లో అడుగుపెట్టింది. ఈ రెండో సెమీ ఫైనల్ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఇంగ్లండ్ తొలుత బ్యాటింగ్ చేసింది. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 113 పరుగులు చేసింది. ఓపెనర్ డేవీనా పెరిన్ 45 పరుగులతో సత్తా చాటగా, మరో ఓపెనింగ్ బ్యాటర్ జెమీమా స్పెన్స్ మాత్రం 9 పరుగులకే పరిమితమైంది. ఇక కెప్టెన్ అబీ నార్‌గ్రోవ్ 30 పరుగులతో రాణించగా, లోయర్ ఆర్డర్‌లో అమూ సురేన్‌కుమార్ 14 పరుగులతో అజేయంగా నిలిచింది. మిగతా వాళ్లలో ట్రూడీ జాన్సన్ డకౌట్ కాగా, చార్లెట్ స్టబ్స్ (4), కేటీ జోన్స్ (0), ప్రిషా తానావాలా (2), చార్లెట్ లాంబర్ట్ (0) కూడా పూర్తిగా విఫలమయ్యారు. భారత బౌలర్లలో పరుణిక సిసోడియా, వైష్ణవిశర్మ ఒక్కొక్కరూ 3 వికెట్లతో చెలరేగగా, ఆయుశీ శుక్లా 2 వికెట్లు పడగొట్టింది. ఇక స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టు కేవలం ఒక్క వికెట్ నష్టపోయి పని పూర్తి చేసింది. ఓపెనర్ జి. కమలిని అర్ధ శతకం (50 బంతుల్లో 56 రన్స్, నాటౌట్)తో మెరవగా, గొంగడి త్రిష 29 బంతుల్లో 35 పరుగులు చేసింది. అదే సమయంలో త్రిషను ఇంగ్లండ్ బౌలర్ ఫోబే బ్రెట్ ఔవుట్ చేయగా, కమలినికి తోడుగా వన్‌డౌన్‌లో ఆడిన సనికా చాల్కె 11 పరుగులతో అజేయంగా నిలిచింది. 15వ ఓవర్లో కమలిని ఫోర్ బాదడంతో భారత్ విజయం ఖరారైంది.

## మహిళల అండర్ 19 టి20 ప్రపంచ కప్‌లో..

# ఫైనల్స్‌కు దక్షిణాఫ్రికా

**న్యూఢిల్లీ;** ఐసిసి మహిళ అండర్-19 టీ20 వరల్డ్ కప్-2025 టోర్నీలో సౌతాఫ్రికా ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. ఆస్ట్రేలియా మహిళా జట్టును ఓడించి టైటిల్ పోరుకు అర్హత సాధించింది. వరల్డ్ కప్ తాజా ఈవెంట్లో ఇప్పటికే గ్రూప్1 నుంచి భారత్, ఆస్ట్రేలియా, గ్రూప్2 నుంచి దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్ సెమీ ఫైనల్స్‌కు చేరాయి. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం సౌతాఫ్రికా ఆస్ట్రేలియా మధ్య తొలి సెమీ ఫైనల్ మ్యాచ్ జరిగింది. కౌలలంపూర్లోని బేయూమస్ ఓవల్ మైదానంలో టాస్ గెలిచిన ఆసీస్ అండర్ 19 మహిళా జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. అయితే, సౌతాఫ్రికా బౌలర్ల దెబ్బకు కంగారు జట్టు బ్యాటర్లు ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయారు. ఓపెనర్లలో ఇనెస్ మెకియోన్ డకౌట్ కాగా, గ్రేస్ లియాన్స్ 2 పరుగులే చేసి అవుటైంది. ఇక వన్డౌన్‌లో వచ్చిన కెప్టెన్ లూసీ హామిల్టన్ 18 పరుగులు చేయగా, మిగతా వాళ్లలో ఎలియనోర్ లారోసా (7), హస్రత్ గిల్ (1), ఛ్లోయే ఐన్స్‌వర్త్ (1), లిలీ బాసింగ్‌వైట్ (2), టెగాన్ విలియమ్సన్ (3) పూర్తిగా విఫలమయ్యారు.

అయితే, మిడిలార్డర్ బ్యాటర్ కాయిమే బ్రే 36 పరుగులతో రాణించగా, ఎల్లా బ్రిస్కో మెరుపు ఇన్నింగ్స్ ఆడింది. 17 బంతుల్లో 4 ఫోర్ల సాయంతో 27 పరుగులతో అజేయంగా నిలిచింది. వీరిద్దరి కారణంగా ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 105 పరుగులు చేయగలిగింది. ఇక సౌతాఫ్రికా బౌలర్లలో ఆష్లేవాన్ విక్ 4 వికెట్లతో చెలరేగగా, ఎంతబిసెంగ్ నిని, కెప్టెన్ కైలా రెయ్‌నెకె, షేష్నీ నాయుడు ఒక్కో వికెట్ పడగొట్టారు. ఇక స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన సౌతాఫ్రికాకు ఓపెనర్ జెమ్మా బోతా (24 బంతుల్లో 37 రన్స్) శుభారంభం అందించగా, మరో ఓపెనర్ సిమోనే లౌరెన్స్ (5) మాత్రం నిరాశపరిచింది. వన్‌డౌన్ బ్యాటర్ ఫే కౌలింగ్ (7) కూడా విఫలం కాగా, కైలా కెప్టెన్ ఇన్నింగ్స్ బాధ్యతాయుతంగా ఆడి 26 బంతుల్లో 26 పరుగులు చేసింది.

# రికార్డుస్థాయిలో ఐఫోన్ల సేల్స్

**న్యూఢిల్లీ, జనవరి 31:** భారత్‌లో ఆపిల్ విక్రయాలు జోరందుకున్నాయి. గతంలో ఎన్నడూ లేనంతగా రికార్డు స్థాయిలో విక్రయాలు నమోదయ్యాయి. ఈ విషయాన్ని కంపెనీ సిఇఒ టిమ్ కుక్ శుక్రవారం వెల్లడించాడు. అదే సమయంలో భారత్‌లో అత్యధికంగా అమ్ముడైన స్మార్ట్‌ఫోన్ మోడల్‌గా అవతరించిందన్నారు. అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో ఐఫోన్ రికార్డు స్థాయిలో అమ్మకాలను నమోదు చేసిందని టిమ్ కుక్ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఐ ఫోన్ రెండో అతిపెద్ద స్మార్ట్‌ఫోన్ మార్కెట్ అని పేర్కొన్నారు. ఇక పిసిలు, ట్యాబ్లెట్లకు మూడో అతిపెద్ద మార్కెట్‌గా ఆపిల్ నిలిచిందన్నారు. భారత్‌లో అత్యధికంగా అమ్ముడైన స్మార్ట్‌ఫోన్ మోడల్‌గా ఐఫోన్ నిలవడం ఇదే తొలిసారి. భారత్‌తో పాటు అమెరికా, చైనా, బ్రిటన్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, జపాన్ దేశాల్లో వీటి విక్రయాలు జోరందుకున్నట్లు కుక్ తెలిపారు. కౌంటర్ పాయింట్ రీసెర్చ్ ప్రకారం 2024లో విలువపరంగా ఆపిల్ 23 శాతం, శాంసంగ్ 22 శాతం మార్కెట్ వాటాతో నిలిచాయి. వివో 16శాతం, ఒప్పో 14శాతం, షావోమి 9శాతం వాటాతో తర్వాత స్థానాల్లో నిలిచాయి. ఆపిల్ ప్రత్యేకంగా భారత్‌దేశంపై ఆసక్తిగా ఉందని టిమ్‌కుక్ తెలిపారు. ఆపిల్ ఇంటెలిజెన్స్‌ను ఇంగ్లీష్‌తో సహా మరిన్ని భాషలకు సపోర్ట్ చేసేలా తీసుకొస్తామని వెల్లడించారు. భారత్‌లో ఎంటర్‌ప్రైజ్ విభాగం నుంచి



ఆపిల్‌కు బలమైన డిమాండ్ ఉందని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, 2023 ఏప్రిల్‌లోనే ఢిల్లీ, ముంబైలో రెండు రిటైల్ స్టోర్లను ప్రారంభించింది. ఈ స్టోర్లకు వచ్చిన ఆదరణ నేపథ్యంలో విస్తరణ దిశగా అడుగులు వేస్తోంది. త్వరలోనే బెంగళూరు, పుణె, ఢిల్లీ-ఎన్‌సిఆర్, ముంబైలో మరో నాలుగు స్టోర్లు ప్రారంభించనున్నట్లు ప్రకటించింది.

## వినియోగం పెంచితేనే ఎకానమీకి బూస్ట్



**న్యూఢిల్లీ, జనవరి 31:** మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టాక పూర్తి సంవత్సరానికి ప్రవేశపెడుతున్న బడ్జెట్‌పై సర్వత్రా ఆసక్తి చూపుతోంది. వృద్ధిరేటు అంచనాలు క్షీణించిన వేళ, దీన్ని తిరిగి గాడిన పెట్టేందుకు చర్యలు తీసుకోక తప్పని పరిస్థితి. ముఖ్యంగా ప్రజల కొనుగోలు శక్తిని పెంచడం ప్రధానమైన టాస్క్ ఇందులో భాగంగానే వేతన జీవులకు ఊరటనిచ్చే అంచనాలు ఉన్నాయి. దీనితో పాటు అన్ని వర్గాల వినిమయాన్ని పెంచాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జీడీపీ వృద్ధి రేటు 6.4 శాతంగా నమోదు కావొచ్చని కేంద్ర గణాంక కార్యాలయం అంచనా వేసింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇది 8.2 శాతంగా ఉంది. దేశీయ వృద్ధి అంచనాలు నాలుగేళ్ల కనిష్ఠ స్థాయికి చేరిన వేళ నిర్మల సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో వేతన జీవులకు పన్ను ఊరట కల్పించడం ద్వారా ఆర్థిక వ్యవస్థకు ఊతం ఇవ్వొచ్చని ఎక్కువ మంది ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఓ వైపు ద్రవ్యోల్బణాన్ని అదుపుచేస్తూనే వృద్ధికి చర్యలు తీసుకోవడంతో కూడిన వ్యవహారమేనని అభిప్రాయపడుతున్నారు. వినియోగ వ్యయానికి, దేశాభివృద్ధికి మధ్య ప్రత్యక్ష సంబంధం ఉంటుంది. ఈ వ్యయాలు ఎంత ఎక్కువగా పెరిగితే అభివృద్ధి అంతగా ఊపందుకుంటుంది. దాంతో పరిశ్రమలు కార్మికశక్తిని పెంచుకోవాల్సి వస్తుంది. వారి ఆదాయాలు పెరిగి జీవన ప్రమాణాలు మెరుగవుతాయి. ఫలితంగా స్థూల దేశీయోత్పత్తి పెరుగుతుంది. ఇదంతా ఒక చక్రంలా పనిచేస్తుంది. కాబట్టి దేశవినియోగంపై ఆధారపడి ఉంటుంది. ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై పెట్టుబడులు పెరగాలని ఆర్థికనిపుణులు సూచిస్తున్నారు. వృద్ధికి చర్యలు చేపడతారన్న అంచనాలతో ఈ సారి బడ్జెట్‌పై వేతనజీవులు గంపెడాశలు పెట్టుకున్నారు. ముఖ్యంగా కొత్త పన్ను విధానంలో శ్లాబుల సవరణ, రిబేట్ పెంపు, స్టాండర్డ్ డిడక్షన్ పెంపు ఉన్నాయి. ప్రస్తుతం పన్ను విధానంలో ఉన్న రూ.75 వేల స్టాండర్డ్ డిడక్షన్ పరిమితిని లక్ష రూపాయలకు పెంచాలని కొత్త పన్ను నిపుణులు కోరుతున్నారు.

## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, జనవరి 31:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా నాలుగోరోజు లాభాల్లో ముగిసాయి. అంతర్జాతీయ సానుకూల సంకేతాల మధ్య ఉదయం లాభాల్లో ప్రారంభమైన మార్కెట్లు రోజంతా అదే బాటలోనే పయనించాయి. ఐటి, ఆటో రంగ షేర్లలో కొనుగోళ్లతో సూచీలు రాణించాయి. దీంతో మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 740 పాయింట్లు పెరిగి 77,500.57 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 258 పాయింట్లు పెరిగి 23,508 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.86.61 వద్ద స్థిరపడింది. ఎల్అండ్‌టి, ఇండస్ ఇండ్ బ్యాంకు, నెస్లే ఇండియా, టైటాన్ కంపెనీ, టాటా స్టీల్, టాటా మోటార్స్, ఐటిసి, హిందుస్థాన్ యూనిలీవర్, మారుతి సుజుకి, ఏసియన్ పెయింట్స్ వంటి షేర్లు లాభాల్లో ముగిసాయి. భారతీఎయిర్‌టెల్, బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్‌ఫైనాన్స్, ఐసిఐసిఐబ్యాంకు, కోటాక్ మహీంద్రా బ్యాంకు వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి.



# నేటి నుంచి మారుతున్న రూల్స్

## వాణిజ్యం

**ముంబై, జనవరి 31:** సామాన్యులపై ప్రభావం చూపే అనేక ప్రకటనలు ఫిబ్రవరిలో ఉన్నాయి. కేంద్రాల్లోని ప్రకటనలతో పాటు ఆర్బీఐ బడ్జెట్ రేట్లపై నిర్ణయాలు, యూపీఐ నిబంధనల్లో కొత్త మార్పులు అమల్లోకి రానున్నాయి. వీటితో పాటు అంశాలు ఫిబ్రవరిలో చోటు చేసుకుంటున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న బడ్జెట్ (యూనియన్ బడ్జెట్ 2024) ప్రవేశపెట్టనున్నారు. ఇందులో ఎలాంటి మార్పులు ఉండబోతున్నాయోనని దేశ ప్రజలు ఎంతో ఆశతో ఉన్నారు. ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు ఊరట, నిరుద్యోగులకు భరోసా, కిసాన్ సమ్మాన్ నిధి పెంపు వంటి అంచనాలు ఉన్నాయి. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోనుందో తెలియాలంటే గంటలు ఆగాల్సిందే. 2023 ఫిబ్రవరి నుంచి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెపో రేటును 6.5 శాతం వద్ద కొనసాగిస్తూనే ఉంది. ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడంతో ఫిబ్రవరి 7న నిర్వహించే ఆర్బీఐ ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపిసి) ప్రకటన వడ్డీ రేట్ల తగ్గింపు ఉండే అవకాశం ఉందని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. అంచనాల కంటే వృద్ధి నెమ్మదించడం, కమిటీలో కొత్త సభ్యులు చేరికల కారణంగా ఈ సారి వడ్డీ రేట్ల కోతనే ఆశలు మళ్లీ చిగురించాయి. డిజిటల్ చెల్లింపులకు మరింత భద్రతపెంచే దిశగా నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ) ముందడుగు వేసింది. ఇందులో భాగంగా యూపీఐ లావాదేవీలకు సంబంధించి కొత్త నిబంధనను తీసుకొచ్చింది. యూపీఐ లావాదేవీ ఐడీ కచ్చితంగా ఆల్ఫానమరికా ఉండేలా చూడాలని పేమెంట్ ప్లాట్‌ఫామ్‌లకు సూచించింది. ఐడీలో అంకెలు,అక్షరాలు మాత్రమే ఉండాలని, స్పెషల్ క్యారెక్టర్లుఉంటే లావాదేవీలను అనుమతించబోమని ప్రకటించారు. ఫిబ్రవరి 1 నుంచి ఈ నిబంధన అమల్లోకి రానుంది. దాదాపు అన్ని ప్లాట్‌ఫామ్‌లు ఇప్పటికే ఈ నిబంధనలను పాటిస్తున్నాయి. ఒకవేళ పాటించకపోతే మీ లావాదేవీ ఆగిపోయే అవకాశం ఉంది. కాబట్టి మీ యాప్‌ను అప్‌డేట్ చేయండి. మరిన్ని వివరాలకు మీ కస్టమర్‌లను సంప్రదించండి. దేశీయ కార్ల తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ కార్లధరల పెంపును తాజాగా ప్రకటించింది. ఫిబ్రవరి 1 నుంచి ఈ పెంపు అమల్లోకి వచ్చింది. సెలెరియా, ఇన్విక్టో, వ్యాగన్ఆర్, స్విఫ్ట్, ఎసయూవీ బ్రెజా, విటారా, ఆల్టో, ఎక్స్‌ప్రెసో, బాలెనో, కాంపాక్ట్ ఎస్యూవీ, డిజైర్



ఇలా అన్ని మోడళ్లపై ధరలు పెంపు ఉంటాయి. కారు మోడల్ ఆధారంగా అత్యధికంగా రూ.32,500 వరకు పెంపు ఉన్నట్లు ఇటీవలే ప్రకటించింది. ప్రతి నెలా ఒకటో తేదీన చమురు సంస్థలు ఎల్పీజీ సిలిండర్ ధరలను సవరిస్తుంటాయి. గృహ అవసరాలకు వినియోగించే సిలిండర్లతో పాటు వాణిజ్య సిలిండర్ ధరలను అంతర్జాతీయ మార్కెట్ ధరలకు అనుగుణంగా సవరిస్తుంటాయి. ఈ సారి ఎలాంటి మార్పులు చేస్తారో చూడాలి.

# కరెంటు ఛార్జీల భారం ఇబ్బందికరం: సిఇఎ అనంత నాగేశ్వరన్

**ముంబై, జనవరి 31:** రాష్ట్రాలు వ్యాపార రంగంలోని సంస్థలపై కరెంటు ఛార్జీలను భారీ మోపుతున్నాయని చీఫ్ ఎకనామిక్ అడ్వైజర్ అనంత నాగేశ్వరన్ అభిప్రాయపడ్డారు. ఆర్థిక సర్వే 2025 విడుదల అనంతరం ఆయన విలేకర్లతో సమావేశమయ్యారు. మారుతున్న భౌగోళిక రాజకీయ సమీకణలు చాలా కీలకమని పేర్కొన్నారు. మార్పులో గ్లోబలైజేషన్ శక్తిగా ఆయన.. ప్రపంచ స్థాయిలో జీవన ప్రమాణాలను, అనుసంధానతను పెంచింది. వ్యయాలను తగ్గించిందని అభివర్ణించారు. ప్రపంచ స్థాయిలో చైనా అత్యంత వేగంగా ఎదుగుతోందని నాగేశ్వరన్. కేవలం 10 ఏళ్ల కాలంలోనే ప్రపంచంలోనే 70 శాతం సౌరశక్తి ఆధారిత విద్యుత్తు తయారీ కేంద్రంగా మారింది. సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి పరిశ్రమలపై నియంత్రణలను తగ్గించాలని ఆయన అభిప్రాయపడ్డారు. వేగవంతమైన ఆర్థిక వృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంస్కరణలను చేసి.. చిన్న, మధ్యతరగతి సంస్థలు వ్యయ నియంత్రణలతో, పోటీగా నిర్వహించేలా తయారు చేయాలి అని పేర్కొన్నారు. ప్రధాన భారత్‌లో చాలా రాష్ట్రాల వ్యాపారాలపై అత్యధిక కరెంటు ఛార్జీల భారం మోపుతోంది. ఈ వియత్నాం, బంగ్లాదేశ్ వంటి దేశాలతో మనం పోటీ పడే పరిస్థితి లేకుండా పోతుంది. వియత్నాంలో పరిశ్రమలకు అనుకూలమైన ఈ ఛార్జీలుఉన్నాయి. వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి ఉంది. ఈ రంగంలో బలమైన వృద్ధి నమోదైతే, జీడీపీ వృద్ధిరేటులో 0.75 శాతం నుంచి 1 శాతం వరకు ఉంటుంది. 2026



నాటికి ప్రతి పిల్లవాడికి ప్రాథమిక అక్షరాస్యత, గణితం వచ్చేలా చేయాలన్న లక్ష్యంతో నైపుణ్యం భారత్ కార్యక్రమంపై దృష్టిపెట్టారు. దీని వల్ల బిహార్, గుజరాత్ వంటి చోట్ల సానుకూల ఫలితాలు వచ్చాయి. భారత్‌లో గత పదేళ్లకు పైగా మౌలిక వసతుల అభివృద్ధిపై దృష్టిసారించడం సానుకూలఫలితాలను ఇచ్చింది. సరికొత్త రైళ్లు, ఎయిర్ పోర్టు, ఓడరేవులు అందుబాటులోకి రావడంతో టర్న్ అరౌండ్ టైం 4 గంటల నుంచి 30 గంటలకు తగ్గింది. విద్యుత్తు రంగంలో ఉత్పత్తి పెరుగుదల, డేటా వ్యయం తగ్గింపు, టెలికాంఫ్రా ఇన్‌స్టాషన్‌లో కీలక విజయాలు. తప్పుడు వాణిజ్య ప్రకటనలు, సెలబ్రిటీల ఎండార్స్‌మెంట్‌లు, అస్పష్టమైన లేబులింగ్‌లు ఆందోళనకరం. ముఖ్యంగా అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్‌ను ఈ విధానాలలో అమ్మడం వినియోగదారుల ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీసే ముప్పు ఉంది. కేన్సర్లు, శ్వాస సంబంధ సమస్యలు, గుండెజబ్బులు, జీర్ణకోశ సమస్యల ముప్పు పొంచి ఉంది. ఈ యేడాది తొలి అర్ధ భాగంలో ఆర్థిక వృద్ధి 6శాతం ఉంది. ద్వితీయార్థంలో మరింత బలపడినట్లు అంచనా వేస్తున్నాం.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.